ఈపీఎఫ్ కనీస పింఛన్ పెంచాలె
పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసు
2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - బుధవారం 18 మార్చి 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 72 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అతి పే...ద్ద.. నోబాల్!
12



## లోక్‌భవన్‌లో ముందస్తు ఉగాది ఉత్సవాలు


### శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, మార్చి 17: రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. లోక్ భవన్‌లో జరిగిన ప్రీ-ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న ...మిగతా 2లో

## సభాపర్వంలో వాక్ సమరం

# మంత్రులు V/s కేటీఆర్



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రెండో రోజైన మంగళవారం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ముందుగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై కేటీఆర్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలా? ఆరు గ్యారెంటీలను అటకెక్కించినందుకు ధన్యవాదాలు తెలపాలా ? అని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీనికి సమాధానంగా ముందుగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలను అన్ని విధాలా మోసం చేసినందుకు బీఆర్ఎస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసిందని పేర్కొన్నారు. మరో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందనీ, అయినప్పటికీ పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలని డిమాండ్ చేశారు. ...వివరాలు 3లో



### అభివృద్ధిని ఓర్వలేకనే మాపై బీఆర్ఎస్ విమర్శలు

ఒక్కో కుటుంబానికి కలిగే లబ్ధిని లెక్కల్లో చెప్తం: భట్టి

### పదేండ్లు మోసం చేసిన బీఆర్ఎస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలె

మీరు అప్పులతో ముంచెత్తిన రాష్ట్రాన్ని మేం గాడిలో పెడుతున్నం: కోమటిరెడ్డి





### పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది మీరే గదా!

జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్‌నే ప్రశ్నిస్తారా?
బీఆర్ఎస్‌కు మంత్రి పొంగులేటి సూటి ప్రశ్నలు

### ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలె? ఎందుకు చెప్పాలె?


గవర్నర్‌తో అన్నీ అబద్ధాలే చెప్పించిండ్రు?: కేటీఆర్



## ఖర్గేతో రేవంత్ భేటీ

### ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో సమావేశం

ఢిల్లీ, మార్చి 17: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఏఐసీసీ నూతన కార్యాలయం 'ఇందిరా భవన్'లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ.వేణుగోపాల్ తో భేటీ అయ్యారు. సీఎంతో పాటు సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్ర తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు కేసీ వేణుగోపాల్కు వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





## వడగండ్ల వాన

### తెలంగాణలో అకాల వర్షాలు

హైదరాబాద్, మార్చి 17: తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తెలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లాలో మున్నూరులో అత్యధికంగా 2.4, మెదక్ జిల్లా రేగోడులో 1.8 సెంటీ మీటర్ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవగా.. మరికొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు, తెలికపాటి వడగండ్లతో వర్షం కురిసింది.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నం

### ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం


మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



3

## 20న క్యాబినెట్ భేటీ

### వార్షిక బడ్జెట్‌కు ఆమోదం, కీలక పథకాలపై చర్చ



హైదరాబాద్, మార్చి 17 (మనం బ్యూరో): ఈనెల 20న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఉదయం 9-30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను అదే రోజు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. అయితే, ఆ బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపడం మంత్రివర్గ సమావేశం ప్రధాన ఎజెండాగా తెలుస్తోంది. దీంతో పాటు రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ఆసరా పింఛన్ల పెంపు, మూసీ పునరుజ్జీవ పథకానికి సంబంధించి అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బిల్లులపై చర్చ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోతున్న నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో కొత్తగా ఎలాంటి పథకాలు ఉండబోతున్నాయి ? అనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది.

## 'డ్రగ్స్' పార్టీ వెనుక బడా డీల్

# ఎనిమిది మందితో సిట్ ఏర్పాటు

### చీఫ్‌గా డీసీపీ యోగేశ్ గౌతమ్

- మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- ఢిల్లీలో పరిచయం...ఫామ్ హౌస్‌లో పార్టీ
- ముగ్గురు నిందితుల కస్టడీ కోరుతూ పిటిషన్
- మరో 8మంది నిందితులను విచారించిన సిట్
- రితేష్‌రెడ్డి గన్ లైసెన్స్ రద్దుకు సిఫారసు
- పార్టీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరి చరిత్రపై విచారణ



హైదరాబాద్,మార్చి17(మనం,ప్రత్యేక ప్రతినిధి): మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలోసిట్ చీఫ్‌గా డీసీపీ యోగేశ్ గౌతమ్‌కు బాధ్యతల అప్పగించారు. సిట్ సభ్యులుగా గ్రేహౌండ్స్ కమాండర్ ఎం.రవీందర్, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఈగల్ ఫోర్స్ ఆఫీసర్లు సి.హరీష్ చంద్రారెడ్డి, ఎన్.బుచ్చయ్య, మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి, ఎస్ఐలు కోటేశ్వరరావు, సదాత్ అలీని నియమించారు. ఈ కేసులో కీలక నిందితుడు నమిత్ శర్మతో నిందితులకు మధ్య ఉన్న సంబంధాలపై ...మిగతా 2లో

## పోరాడితే గెలుపు ఖాయం

వెలుగుమట్ల ఘటనే నిదర్శనం

కల్వకుంట్ల కవిత

2

## డీజీపీని కలిసిన బీజేపీ అధ్యక్షుడు

హైదరాబాద్,మార్చి 17(మనం,ప్రత్యేక ప్రతినిధి): బీజేపీ కార్యకర్తలపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు మంగళవారం డీజీపీ శివధర్ రెడ్డిని కలిశారు. పోలీస్ యంత్రాంగం అధికార పక్షానికి కొమ్ముకాస్తోందని ఆరోపిస్తూ ఆయన డీజీపీకి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ...మిగతా 2లో

## బలిమెల 'బాధితుల'కు ఇండ్ల పట్టాలు

18 ఏళ్ల నిరీక్షణ ఫలించింది • సీఎంకు డీజీపీ కృతజ్ఞతలు
• అమరుల కుటుంబ సభ్యుల కళ్లలో ఆనందభాష్పాలు



2



## అమెరికాకు సహకరించని మిత్రులు

### ఒంటరి అవుతున్న అగ్రరాజ్యం

### యుద్ధంలో దానికి చుక్కెదురేనా?

### 'మాకు ఎవరి అవసరం లేదంటూ బింకపు మాటలు చెప్తున్న ట్రంప్

వాషింగ్టన్, మార్చి 17: పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో బలప్రయోగం ద్వారా చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఫెయిలైనాయి. మిత్ర దేశాలు కూడా తనకు మద్దతుగా రామంటూ తెగేసి చెప్పడంతో ట్రంప్‌కు తిక్కకుదిరినట్లైంది. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ.. వార్మూజ్లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు తాము ఒంటరిగానే ప్రయత్నిస్తామని.. ఈ విషయంలో మాకు ఎవరి అవసరమూ లేదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు ఎవరి అవసరం లేదు. మాది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశం. అత్యంత శక్తిమంతమైన సైన్యం మాకుంది' అని ...మిగతా 2లో

### యూఏఈలోని 'షా' గ్యాస్ క్షేత్రంపై డ్రోన్ దాడి..

## నిలిచిపోయిన కార్యకలాపాలు

2

### ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీని మట్టుబెట్టాం: ఇజ్రాయెల్



## మొజ్తాబాకు రష్యాలో ట్రీట్‌మెంట్?

మాస్కో, మార్చి 17: ఇరాన్‌పై అమెరికా జరిపిన దాడుల్లో ఆ దేశ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడిన మొజ్తాబాను రష్యా రాజధాని మాస్కోకు తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆయన్ను వ్యక్తిగతంగా ఆహ్వానించినట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ ఈ కథనాలను తోసిపుచ్చినట్లు 'టాస్' న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఇజ్రాయెల్- అమెరికా దాడులకు ముందు సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ.. వెనెజువెలా, రష్యాకు వెళ్లేందుకు యత్నించినట్లు తప్పుడు వార్తలు సృష్టించారు. ఇప్పుడేమో మొజ్తాబా ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించినట్లు కథనాలు వస్తున్నాయి. ఇదొక కొత్త తరహా మానసిక యుద్ధం. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, షెల్టర్లలో దాక్కోవాల్సిన ...మిగతా 2లో



### క్షణాల్లో బయటపడిన సుప్రీం

టెహ్రాన్, మార్చి 17: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల నుంచి త్రుటిలో బయటపడినట్లు తెలుస్తోంది. వీరి భవనాన్ని క్షిపణులు తాకడానికి కొన్ని క్షణాల ముందే మొజ్తాబా ...మిగతా 2లో

### ఆఫ్ఘన్ ఆసుపత్రిపై పాక్ దాడి..

## 400 మందికి పైగా మృతి



### తీవ్ర గాయాలపాలైన 250 మంది

కాబూల్, మార్చి 17: పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అఫ్గాన్ పై పాక్ వైమానిక ...మిగతా 2లో

### పిరికిపంద చర్య: తీవ్రంగా ఖండించిన భారత్

2

## అమెరికాకు సహకరించని మిత్రులు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిపై మిత్ర దేశాలు కలిసి రాకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాకపోవడం మనకు తెలిసిందే.

## మొజ్తాబాకు రష్యాలో ట్రీట్‌మెంట్?

(మొదటి పేజీ తరువాయి)

అవసరం లేదు. వారు ప్రజల మధ్యే ఉంటారు'' అని కాజెమ్ జలాలీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మరోవైపు.. ఈ వ్యవహారంపై స్పందించేందుకు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ నిరాకరించడం విశేషం.

## క్షణాల్లో బయటపడిన సుప్రీం

(మొదటి పేజీ తరువాయి)

అక్కడినుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ మేరకు 'ది టెలిగ్రాఫ్' కథనం వెల్లడించింది. ఇరాన్ అధికారుల సమావేశానికి సంబంధించి లీకైన ఓ ఆడియోను ఉటంకిస్తూ 'ది టెలిగ్రాఫ్' ఈ కథనం ప్రచురించింది. ''భగవంతుడి దయ వల్ల మొజ్తాబా ఏదో పని మీద భవనం నుంచి బయటకు వచ్చి గార్డెన్లోకి వెళ్లారు. తిరిగి లోపలికి వెళ్దామని అనుకుంటుండగా భవనాన్ని క్షిపణి తాకింది'' అని ఖమేనీ కార్యాలయ ప్రొటోకాల్ హెడ్ మజహర్ హొస్సేనీ చెప్పినట్లు ఆ లీకైన ఆడియోలో ఉంది.

## 400 మందికి పైగా మృతి

(మొదటి పేజీ తరువాయి)

దాడులకు పాల్పడింది. ఒక ఆసుపత్రిపై దాడులు జరగ్గా.. వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ అధికారులు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్లోని ఓ ఆస్పత్రిపై ఈ దాడులు జరిగాయని అఫ్గాన్ ప్రభుత్వ డిప్యూటీ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రాట్ పేర్కొన్నారు. దాడుల్లో ఇప్పటివరకు 400 మంది మరణించారని.. దాదాపు 250 మంది గాయపడ్డారని వెల్లడించారు. భవనంలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి పూర్తిగా దెబ్బతిందని.. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను కూడా వెలికితీస్తున్నట్లు వెల్లడించారు.



## పిరికిపంద చర్య: తీవ్రంగా ఖండించిన భారత్

**ఢిల్లీ, మార్చి 17:** అఫ్గానిస్థాన్లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమయంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

## నిలిచిపోయిన కార్యకలాపాలు

**జెడ్డా, మార్చి 17:** పర్షియన్ గల్ఫ్ చుట్టూ ఉన్న ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని 'షా' గ్యాస్ క్షేత్రం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగగా.. అధికారులు అక్కడి కార్యకలాపాలను నిలిపివేశారు. గ్యాస్ క్షేత్రంపై జరిగిన డ్రోన్ దాడితో పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు అక్కడి మీడియా పేర్కొంది. దట్టమైన పొగ వ్యాపించిందని వెల్లడించింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది అతికష్టంమీద వాటిని అదుపులోకి తీసుకొచ్చారని తెలిపింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టంచేశారు. దాడిలో గ్యాస్ క్షేత్రానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అక్కడ జరిగే కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

# దిన్నేమంటరు?.. సారూ?

- **మా పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లో పోటీ..ఇది ఫిరాయింపు కాదా?**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిండ్రు?**
- **అసెంబ్లీలో నిలదీసిన కేటీఆర్**
- **స్పీకర్ తప్పు తీర్పు ఇచ్చినప్పటికి... ఐనా గౌరవిస్తున్నాం**
- **పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై సంధించిన విమర్శనాస్త్రాలు సభలో సెగలు పుట్టించాయి. ముఖ్యంగా 'ఆరు గ్యారంటీలు', వాటి చట్టబద్ధతపై ఆయన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తొలి అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర గవర్నర్ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తారని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఒక్క గ్యారంటీకి కూడా ఆ దిశగా అడుగులు పడలేదని కేటీఆర్ నిలదీశారు. రాహుల్ గాంధీ కూడా తొలి కేబినెట్ సమావేశంలోనే వీటికి చట్టపరమైన హామీ ఇస్తామని చెప్పిన మాటలను ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజు ఆరు గ్యారంటీలపై చేసినట్లు చెబుతున్న ఆ 'తొలి సంతకం' ఫైలు ఇప్పుడు ఎక్కడ ఉందో ఎవరికీ తెలియడం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇటీవల ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ ఫైలు కూడా ఏమైనా కాలిపోయిందా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఆ మాయమైన ఫైలును వెతికి పట్టుకోవడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలంటూ బీఆర్ఎస్ తరపున అసెంబ్లీలో 'ప్రైవేట్ మెంబర్ బిల్' ప్రవేశపెడతామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 'పదవులు ఎవరికీ శాశ్వతం కాదు. పదేళ్లు అధికారంలో ఉన్న మేము ఇప్పుడు ప్రతిపక్ష స్థానంలో ఉన్నాం. నేనే రాజు, నేనే మంత్రి అని మిడిసిపడ్డ వారు శాశ్వతంగా అదే స్థానంలో ఉండరు' అంటూ కేటీఆర్ చురకలు అంటించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నప్పుడే పాలకులకు విలువ ఉంటుందని... నిన్నటి గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వానికి ఉండాల్సిన స్పష్టత, విశ్వసనీయత ఏమాత్రం కనిపించలేదని ఎద్దేవా చేశారు.



# పోరాడితే గెలుపు ఖాయం

- **వెలుగుమట్ల ఘటనే నిదర్శనం**
- **కల్వకుంట్ల కవిత వెల్లడి**

**హైదరాబాద్,మార్చి17(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు డా. విశారధన్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంయుక్త పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చిందని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. వెలుగుమట్లలో ఇండ్లు కూల్చేసిన వారిలో 411 మందికి పట్టాలు ఇస్తామని ప్రకటించింది.. ప్రజా పోరాటాలు తప్పక విజయం సాధిస్తాయనే విషయం నిరూపితమైందని కవిత స్పష్టం చేశారు. మొత్తం 750 మంది ఇండ్లు కూల్చివేసి కేవలం 411 మందికి మాత్రమే పట్టాలు ఇవ్వడంతో మిగతా బాధితుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తమకు అన్యాయం జరిగిందనే భావన వారిలో నెలకొందని, పట్టాల పంపిణీలో పారదర్శకత ఉండాలని, ప్రతి బాధితుడికి న్యాయం జరగాలనే లక్ష్యంగా వెలుగుమట్ల బాధితుల కోసం నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలోని నిజ నిర్ధారణ కమిటీలో ఆర్మీ మాజీ అధికారి, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వం వెంటబడుతుందని, నిజ నిర్ధారణ కమిటీకి ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు సంపూర్ణంగా సహకరించాలని కవిత కోరారు.

# హలో.. నేనే పెద్ద ట్రెండింగ్ స్టార్

- **సోషల్ మీడియాను ప్రమోట్ చేస్తోంది నేనే?..**
- **పెద్ద స్టార్‌ను..అవసరమైతే సొంతంగా సినిమా తీస్తా?**
- **మరోసారి నవ్వులు పూయించిన మాజీ మంత్రి మల్లారెడ్డి...**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఎక్కడున్నా తనదైన పంచ్ డైలాగులతో నవ్వులు పూయించే మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి... రెండవ రోజు బడ్జెట్ సమావేశాల వేళ కూడా అదే జోష్‌ను కొనసాగించారు.

ముఖ్యంగా సోషల్ మీడియాలో తనకున్న క్రేజ్ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి.

'అసలు సోషల్ మీడియాను ప్రమోట్ చేస్తోంది నేనే.. ఇప్పుడు నేనే పెద్ద ట్రెండింగ్ స్టార్‌ను అంటూ మల్లారెడ్డి నవ్వులు పూయించారు. ఇక సినిమాల్లో నటించే అవకాశం గురించి అడిగిన ప్రశ్నకు ఆయన అదిరిపోయే సమాధానం ఇచ్చారు. 'నాకు ఒకరు సినిమా అవకాశం ఇవ్వడం ఏంటి..? నేనే ఒక పెద్ద స్టార్‌ను అని అన్నారు. ఒకవేళ సినిమా చేయాలనిపిస్తే ఎవరి కోసమో వేచి చూడనని, అవసరమైతే తన సినిమాను తానే సొంతంగా తీస్తానని చెప్పారు.

## లోక్‌భవన్‌లో ముందస్తు ఉగాది ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ప్రసంగిస్తూ.. 'ఉత్సవాలకు విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవన్ పరివార్ సభ్యులకు, కళాకారులకు పేరు పేరునా నా హృదయ పూర్వక నమస్కారాలు. మీ అందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం మీ కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుంటున్నాను. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం. పరాభవ అంటే.. మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఈ ఏడాది రాష్ట్రంలో సమద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను. మరోసారి మీ అందరికీ ఉగాది శుభాకాంక్షలు' అని చెప్పారు. చివరగా జై తెలంగాణ.. జై హింద్ అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## డ్రగ్ టెస్టులకు కాంగ్రెస్ నేతలు సిద్ధం: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

**హైదరాబాద్, మార్చి 17:** మొయినాబాద్ డ్రగ్స్ కేసు తీవ్ర చర్చనీయాంశమైన వేళ టీపీసీసీ చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్ టెస్టుకు కాంగ్రెస్ నాయకులందరూ సిద్ధమని చెప్పారు. సభా నాయకుడు, ప్రతిపక్ష నేతకు డ్రగ్ టెస్టులు జరగాలన్నారు. ''డ్రగ్స్ టెస్టుకు కేసీఆర్ రావాలి. సీఎంనూ తీసుకువస్తా. సభ్యులందరం డ్రగ్ టెస్టు చేయించుకుందాం. సమాజానికి మంచి సందేశం ఇద్దాం'' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# అనవసరంగా యుద్ధం చేస్తున్నం

- **నిరసనగా రాజీనామా చేస్తున్నానంటూ ప్రకటించిన అమెరికా కీలక అధికారి**

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్ పై యుద్ధం కొనసాగిస్తున్న వేళ అమెరికాకు చెందిన ఓ కీలక అధికారి రాజీనామా ప్రకటించారు. ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ఈ యుద్ధానికి మద్దతు ఇవ్వలేనని 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ జో కెంట్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపారు. ''మన దేశానికి ఇరాన్ ఎటువంటి తక్షణ ముప్పును కలిగించలేదు. ఇజ్రాయెల్, దాని శక్తిమంతమైన అమెరికన్ లాబీ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగానే ఈ యుద్ధాన్ని ప్రారంభించామన్నది స్పష్టం'' అని 'ఎక్స్'లో జో కెంట్ ఓ పోస్ట్ పెట్టారు.

చాలా ఆలోచించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌నకు జో కెంట్ లేఖ రాశారు. ''గతంలో మూడు అధ్యక్ష ఎన్నికల సందర్భాల్లో మీరు ప్రచారం చేసిన విలువలకు, మొదటి హయాంలో అమలు చేసిన విదేశాంగ విధానాలకు మద్దతుగా ఉన్నా. మధ్యప్రాచ్యంలోని యుద్ధాలు ఉచ్చులాంటివని, అవి మన పౌరుల ప్రాణాలు తీయడమే కాకుండా.. దేశ సంపదనూ క్షీణింపజేశాయని గతేడాది జూన్ వరకూ అర్థం చేసుకున్నారు. అయితే, రెండో పాలన ప్రారంభంలో ఉన్నత స్థాయి ఇజ్రాయెల్ అధికారులు, అమెరికన్ మీడియాలోని ప్రభావవంతమైన కొందరు వ్యక్తులు ఇరాన్ విషయంలో తప్పుడు ప్రచారాన్ని ప్రారంభించారు. ఇది 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని పూర్తిగా దెబ్బతీసి, ఇరాన్తో యుద్ధానికి వెళ్లేలా పురిగొల్పింది. అమెరికాకు ఇరాన్ తక్షణ ముప్పుగా పరిణమించిందని, ఇప్పుడు దాడి చేస్తే వేగంగా విజయం సాధించొచ్చని నమ్మించారు. కానీ.. ఇదంతా అవాస్తవం. ఇరాక్ యుద్ధంలోకి మనల్ని లాగేందుకు కూడా గతంలో ఇజ్రాయెల్ ఇదే ఎత్తుగడ వేసింది. మనం ఈ తప్పును మళ్లీ చేయొద్దు.

## పితృత్వ సెలవుల కోసం ప్రత్యేక చట్టం చేయాలె

**కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన**

**ఢిల్లీ, మార్చి 17:** పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

# బలిమెల బాధితులకు ఇండ్ల పట్టాలు

**హైదరాబాద్,మార్చి 17(మనం,ప్రత్యేక ప్రతినిధి):** బలిమెల రిజర్వాయర్ లో మావోయిస్టులు దాడి చేసి 38 మందిని హత్య చేసిన ఘటన పోలీస్ యంత్రాంగానికి తీరని వేదనను మిగిల్చిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి అన్నారు. బలిమెల సంఘటనలో అమరులైన పోలీసు కుటుంబ సభ్యులకు మంగళవారం డిజిపి తన కార్యాలయంలో ఇళ్లస్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ....2008 జూన్ 29న మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో 32 మంది గ్రేహౌండ్స్ విభాగానికి చెందిన 38 మంది మరణించిన సంఘటన రాష్ట్ర పోలీసు శాఖను విషాదంలో ముంచిందన్నారు.

ఆ సమయంలో తాను ఎస్ఐబీ డిఐజిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల కాలంలోనే భారీ విషాదం చోటుచేసుకుందని విచారం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఆ వీరుల కుటుంబాలను అక్కున చేర్చుకోవాలనే ఆకాంక్షతో హైదరాబాద్ శివారులో భూమి కేటాయింపు కోసం చేసిన ప్రయత్నాలు సుదీర్ఘ కాలం పాటు కొనసాగాయన్నారు. దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు నేడు తెరపడటం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

అమరవీరుల వారసులకు అండగా నిలవాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే ఈ సమస్య పరిష్కారమైందని, బాధితులకు తగిన న్యాయం చేకూరిందని వెల్లడించారు. అమరుల కుటుంబాల చిరకాల కోరికను నెరవేర్చినందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ తరపున, అమరుల కుటుంబ సభ్యుల పక్షాన ముఖ్యమంత్రికి డిజిపి కృతజ్ఞతలు తెలియజేశారు.

**18 ఏళ్ల నిరీక్షణ:**

2008 జూన్ 29న ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ వద్ద బలిమెల రిజర్వాయర్‌లో లాంచీపై వెళ్తున్న 60 మంది గ్రేహౌండ్స్ కమాండోలు, పోలీసులపై మావోయిస్టులు మెరుపుదాడి చేశారు. ఈక్రమంలో కొండల పైనుంచి మావోయిస్టులు జరిపిన కాల్పులు, గ్రెనేడ్ల దాడిలో లాంచీ మునిగిపోయింది.

ఈ దారుణ ఘటనలో 32 మంది గ్రేహౌండ్స్ కమాండోలు సహా మొత్తం 38 మంది మరణించారు. వీరి త్యాగానికి గుర్తింపుగా నాటి ప్రభుత్వం అమరవీరుల వారసులకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ 2013లో జీవో నంబర్ 339 జారీ చేసింది.తొలుత కుత్బుల్లాపూర్ మండలం గజులరామారం గ్రామంలోని సర్వే నంబర్ 23, 27లలో రెండెకరాల భూమిని కేటాయించారు. అయితే ఆ భూమిలో ఆక్రమణలు ఉండటంతో, ప్రత్యామ్నాయంగా అదే గ్రామంలోని సర్వే నంబర్ 16లో 3.10 ఎకరాలను గుర్తించారు.

జీవోలో ఉన్న సర్వే నంబర్లకు, క్షేత్రస్థాయిలో ఉన్న స్థలానికి మధ్య వ్యత్యాసం ఉండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో అమరవీరుల కుటుంబాలు దాదాపు 13 ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందిస్తూ గత ఏడాది అక్టోబరు 18న సవరణ ఉత్తర్వులు (జీవో నం. 132) జారీ చేసింది. గాజులరామారంలోని సర్వే నంబర్ 16లో భూమి కేటాయింపును క్రమబద్ధీకరించి లబ్ధిదారులైన 33 మంది వారసులకు డిజిపి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు.

**సీఎంకు కృతజ్ఞతలు:**

మావోయిస్టుల దాడిలో అమరులైన గ్రేహౌండ్స్ అమరవీరుల కుటుంబ సభ్యులకు ఇళ్ల స్థలాల పంపిణీ ఆలస్యమైందని గ్రేహౌండ్స్ అడిషనల్ డిజిపి అనిల్ కుమార్ అన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైనప్పటికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ,రెవిన్యూ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి విజయ్ కుమార్, ఎస్ఐబి, ఐజిపి బి. సుమతి, గ్రేహౌండ్స్ కమాండర్ రాఘవేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో అశోక్ కుమార్ లతోపాటు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రేహౌండ్స్‌లో ప్రతిభ కనబరిచిన నలుగురు అధికారులకు 2024 సంవత్సరానికి గాను 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్' (స్పెషల్ ఆపరేషన్ మెడల్) లభించింది. గ్రూప్ కమాండర్ జాజాల రాఘవేందర్ రెడ్డి, సీనియర్ కమాండోలు తిప్పని రాకేష్, ఉడుతనూరి మల్లయ్య, జూనియర్ కమాండో గంటా సాయి కుమార్ ఈ పురస్కారాలకు ఎంపికైన వారిని డిజిపి అభినందించారు.

## డీజీపీని కలిసిన బీజేపీ అధ్యక్షుడు

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేకనే కక్షపూరితంగా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. పోటీ చేయవద్దని హెచ్చరించినా ధైర్యంగా నిలబడిన బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులే కాకుండా, సాక్షాత్తూ పోలీసులే దాడులకు పాల్పడటం దారుణమన్నారు. గతంలో నల్గొండ ఎస్పీ,ఇటీవల పరిగి సీఐ బీజేపీ కార్యకర్తలపై భౌతిక దాడులు చేసిన ఘటనలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.కాగా రాష్ట్ర డీజీపీ తమ ఫిర్యాదుపై సానుకూలంగా స్పందిస్తూ విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఈపీఎఫ్ కనీస పింఛన్ పెంచాలె

**ఢిల్లీ, మార్చి 17:** ఈపీఎఫ్ చందాదారులు రిటైర్మెంట్ తర్వాత పొందే పెన్షన్కు సంబంధించి పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి కీలక ప్రతిపాదనలు చేసింది. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995 (ఈపీఎఫ్, 1995) కింద ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.1000 కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కమిటీ సూచించింది. ఆ మొత్తం వాస్తవికంగా, గౌరవప్రదంగా ఉండాలని అభిప్రాయపడింది. ఈ మేరకు లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ పై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 15వ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పుడు అందుతున్న మొత్తం ఏమాత్రం సరిపోవడం లేదని, దాన్ని రూ.7,500కు పెంచాలని వారు కోరుతున్నారు.

ఇదే డిమాండ్ తో ఇటీవల దిల్లీలోని జంతర్మంతర్ వద్ద మూడు రోజుల పాటు ధర్నా నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పందించింది. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995ని పునః సమీక్షించి పెన్షన్ మొత్తాన్ని పెంచాలని ప్రతిపాదించింది. ఇందుకోసం కేటాయింపులు చేయాలని సూచించింది.

## ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీని మట్టుబెట్టాం: ఇజ్రాయెల్

**టెహ్రాన్, మార్చి 17:** ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించారు. లారిజానీని లక్ష్యంగా చేసుకుని టెహ్రాన్లో వైమానిక దాడులు జరిపినట్లు అంతకుముందు ఇజ్రాయెల్ సైనిక అధికారులు తెలిపారు. ఇతర దాడుల్లో ఐఆర్జీసీకి చెందిన బసిజ్ పారామిలిటరీ ఫోర్స్ కమాండర్ గోలమ్రెజా సోలేమాని హతమైనట్టు వెల్లడించారు. ఈ ఘటనలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. ఇటీవల మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి లారిజానీ కుడిభుజంగా వ్యవహరించారు. దేశ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమం తదితర వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. 'సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ది కల్చరల్ రివల్యూషన్'లోనూ సభ్యుడిగా ఉన్నారు. అలీ ఖమేనీ మరణానంతరం లారిజానీని ఇరాన్లో శక్తిమంతమైన నేతగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు.. గోలమ్రెజా సోలేమాని నేతృత్వంలోని బసిజ్ దళాలు ఇరాన్లో ప్రజా నిరసనలను ఉక్కుపాదంతో అణచివేశాయని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఆయనపై అమెరికా, ఈయూ ఆంక్షలు విధించాయి.

# ఎనిమిది మందితో సిట్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

సిట్ ఆరా తీస్తోంది. ఏపీ ఎంపీ పుట్టా మహశ్ యాదవ్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రంజిత్‌రెడ్డిలకు నమిత్ శర్మతో ఢిల్లీలో పరిచయం ఏర్పడినట్లు సిట్ ప్రాథమిక విచారణలో తేలింది. ఈగల్ పోలీసులపై కాల్పులకు తెగబడిన నమిత్ శర్మ గత చరిత్రపై సిట్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సోదారుడు రితేష్ రెడ్డి గన్ లైసెన్స్‌ను రద్దు చేయాలని ఫ్యూచర్ సిటీ సీపీకి సిట్ అధికారులు లేఖ రాశారు. రితేష్‌రెడ్డికి 2017లో గన్ లైసెన్స్ జారీ చేశారని, రివాల్వర్ మిస్ యూస్ చేసినందుకు అతని గన్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ చర్యలు తీసుకోవాలని సీపీని సిట్ అధికారులు కోరారు. అలాగే, అసాంఘిక కార్యక్రమాలకు పైలెట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్ అడ్డాగా మారిందని, దాన్ని సీజ్ చేయాలని రెవెన్యూ అధికారులకు పోలీసులు లేఖ రాశారు.

**సిట్ దూకుడు:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ డ్రగ్ పార్టీ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో మొత్తం 11 మందిపై కేసు నమోదు కాగా 8 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చిన విషయం విదితమే. అయితే వారిని మంగళవారం శంషాబాద్ రూరల్ పీస్‌లో సిట్ విచారించి కీలక విషయాలు రాబట్టింది. డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ సిట్ అధికారులు డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరి వ్యక్తి గత చరిత్రపై విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా డ్రగ్ పార్టీ కోసం బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్తలు, అడ్వకేట్లు ఎందుకొచ్చారన్న కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. వెరసి ఈ పార్టీ వెనుక పెద్ద బిజినెస్ డీల్ ఉన్నాయన్న అనుమానం వ్యక్తం చేయడంతో పాటు అ దిశగా విచారణ చేపడుతున్నారు. ఈ కేసులో కీలక నిందితుడు నమిత్ శర్మ ఫోన్ డేటా ఆధారంగా ఈ పార్టీ వెనుక దుబాయ్ కనెక్షన్లు ఉన్నాయని, డ్రగ్స్ వ్యాపార కోణం ఉందన్న అంశాలపైనా సిట్ అధికారులు కూపీ లాగుతున్నారు.

**ఎవరీ...నమిత్ శర్మ:**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిందితుడు నమిత్ శర్మకు ఉన్న రాజకీయ పరిచయాలతో పాటు గతంలో అతను చేసిన మోసాలపై సిట్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ కేసులో డ్రగ్స్ కోణంతో పాటు నిందితుల ఆర్థిక మూలాలపై కూడా సిట్ దర్యాప్తు చేపడుతోంది. విచారణలో నమిత్ శర్మకు సంబంధించిన విస్తుపోయే నిజాలు పోలీసుల విచారణలో బయటపడుతున్నాయి. ఇతను కేవలం డ్రగ్స్ వ్యవహారాల్లోనే కాకుండా, రాజకీయ అండదండలు ఉన్నాయని నమ్మించి మోసాలకు పాల్పడే ఒక ఆరితేరిన మోసగాడిగా పోలీసులు గుర్తించారు. ఢిల్లీ వంటి ముఖ్య నగరాల్లోని కొంతమంది ప్రజాప్రతినిధులు , వ్యాపారవేత్తలతో పరిచయాలు పెంచుకొని, తద్వారా భారీగా అక్రమ లావాదేవీలు జరిపినట్లు ఆధారాలు లభించాయి. ఉన్నత పదవుల్లో ఉన్న రాజకీయ నాయకులతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నమ్మబలికి, కింది స్థాయి నాయకుల నుండి పనులు చేయిస్తానంటూ కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు సిట్ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల నేతలతో పరిచయం పెంచుకుని వారికి భారీ కాంట్రాక్టులు ఇప్పిస్తానని పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడినట్లు సిట్ దర్యాప్తులో తేలింది.ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న నమిత్ శర్మతో పాటు పైలెట్ బ్రదర్స్‌ను ఏడు రోజుల పాటు కస్టడీకి అప్పగించాలని కోరుతూ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. మొయినాబాద్ కేసులో ముగ్గురు నిందితులను, మరో 8మందిని విచారిస్తే డ్రగ్ పార్టీ వెనుక అసలు సూత్రధారులు ఎవరో తేలుతుందని సిట్ భావిస్తోంది. అలాగే డ్రగ్ వెనుక అసలు విషయాలపై సిట్ అధికారులు లోతుగా విచారించనున్నారు.

**రితేశ్ రెచ్చగొట్టాడు:**

మొయినాబాద్ కేసులో నిందితుడు రితేష్‌రెడ్డి ఆదేశాల మేరకే నమిత్ శర్మ ఈగల్ పోలీసులపై కాల్పులకు తెగబడినట్లు సిట్ విచారణలో తేలింది. ఫామ్‌హౌస్‌ను పోలీసులు చుట్టుముట్టిన క్రమంలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్ రెడ్డి ఇద్దరూ వాళ్లను కాల్చెయ్, తర్వాత మొత్తం మేం చూసుకుంటాం అంటూ నమిత్ శర్మను రెచ్చ గొట్టినట్లు సమాచారాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు అప్రమత్తతతో అందర్నీ చుట్టుముట్టడంతో తుపాకీ కాల్పులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలోనే పైలట్ రోహిత్రెడ్డి, నమిత్ శర్మ, రితేశ్ రెడ్డిపై కొత్తగా అటెంప్ట్ టు మర్డర్ సెక్షన్లను జోడించినట్లు పోలీసులు తెలిపారు.




# పదేండ్లు మోసం చేసిన... బీఆర్ఎస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలె

**మీరు అప్పులతో ముంచెత్తిన రాష్ట్రాన్ని మేం గాడిలో పెడుతున్నం**

**అసెంబ్లీలో కేటీఆర్ విమర్శలపై మంత్రి కోమటిరెడ్డి కౌంటర్**

**హైదరాబాద్, మార్చి 17 ( మనం బ్యూరో ) :** పదేళ్లు అధికారం అనుభవించి ప్రజలను మోసం చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలని పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్ విమర్శలకు సమాధానంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఇవ్వని తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం మేము ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలపాలన్నారు. రూ.20 వేల కోట్లతో కుల మతాలకు అతీతంగా ఇంటర్నేషనల్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామనీ, ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లినా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారనీ అందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలన్నారు. ఏ గ్రామానికి పోయినా ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇస్తూ 40 ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నందుకు ప్రభుత్వానికి బీఆర్ఎస్ ధన్యవాదాలు చెప్పాలని వ్యాఖ్యానించారు. దళితుడిని సీఎం చేస్తానని, డబుల్



బెడ్రూం ఇళ్లు ఇస్తానని ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని విమర్శించారు. రూ.లక్షల కోట్లతో అప్పుల బారిన పడిన ఈ రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నామనీ, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు లేకుండా భూ సేకరణ సరిగా చేయలేదన్నారు. రెండున్నరేళ్లలో రూ.3 లక్షల 25 వేల కోట్ల అప్పుకు బాకీ కట్టి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామనీ, ఈ కార్యక్రమాలు చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ధన్యవాదాలు చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

# అభివృద్ధిని ఓర్వలేకనే మాపై బీఆర్ఎస్ విమర్శలు

**ఒక్కో కుటుంబానికి కలిగే లబ్ధిని లెక్కల్లో చెప్తం**

**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్, మార్చి 17 ( మనం బ్యూరో) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో లెక్కలతో సహా చెప్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని బీఆర్ఎస్ విమర్శించడంలో అర్థం లేదని పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామనీ, అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామనీ, కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే రూ.22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తూ నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసిందన్నారు. గూడు లేని నిరుపేదలకు అండగా నిలవడంలో దేశ చరిత్రలోనే ఇది ఒక విప్లవాత్మకమైన నిర్ణయమని పేర్కొన్నారు. అలాగే, వరి బోనస్‌పై రైతులకు రూ.25000 ఆదా అవుతోందనీ, మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామనీ, వడ్డీ లేని రుణాల కింద స్వయం సహాయక బృందాలకు ఏటా రూ.20 వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ నేతలకు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రతి సందర్భంలో కేటీఆర్ మహిళల మనసు గాయపరుస్తున్నారనీ, మహిళల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సూచించారు.

# పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది మీరే గదా!

**జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్‌నే ప్రశ్నిస్తారా?**

**బీఆర్ఎస్‌కు మంత్రి పొంగులేటి సూటి ప్రశ్నలు**



**హైదరాబాద్, మార్చి 17 (మనం బ్యూరో) :** పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకుని ఫిరాయింపులను ప్రోత్సహించింది మీరు కాదా ? అని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై ముందుగా కేటీఆర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ తీర్పును ప్రస్తావించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం కాంగ్రెస్ బీ ఫామ్‌పై పోటీ చేస్తే పార్టీ మారినట్లు తగిన ఆధారాలు లేవని తీర్పు ఇవ్వడాన్ని తప్పు పట్టారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పీకర్ స్పందిస్తూ కేటీఆర్ తీర్పు మొత్తం చదవకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తనపై విమర్శలు వచ్చిన ప్రతీ సారి మీడియా ముందుకు రావాల్సిన పని లేదనీ, ఉన్నత పదవిలో ఉన్న తనను అవమానించడం సరైంది కాదన్నారు. అనంతరం మాట్లాడిన మంత్రి పొంగులేటి కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్‌నే ప్రశ్నించడం కరెక్ట్ కాదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక విధంగా మాట్లాడటం కేటీఆర్‌కే చెల్లుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని అడిగి తెలుసుకోవాలని ఈ సందర్భంగా పొంగులేటి కేటీఆర్‌కు సూచించారు.

# ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలె? ఎందుకు చెప్పాలె?

- **గవర్నర్‌తో అన్నీ అబద్ధాలే చెప్పించిండ్రు?: కేటీఆర్**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ, గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రేవంత్ చేసిన తొలి సంతకం చేసిన ఫైల్ ఏమైందని అసెంబ్లీ సాక్షిగా కీలకమైన ఆ ఫైల్ ఎక్కడికి పోయిందని కేటీఆర్ ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తుల విలువ జీరో చేసింది ఎవరని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా? అని అడిగారు. పదే పదే అబద్ధాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నం

- **ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 17 :** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు



నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో కానీ అక్కడేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఫిర్యాదు దారుడే... ప్రధాన నిందితుడు

- **రూ. కోటి చోరీ కేసులో కొత్త ట్విస్ట్**
- **24గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు**
- **పోలీసులకు డీసీపీ అభినందనలు**

**హైదరాబాద్,మార్చి17(మనం,ప్రత్యేక ప్రతినిధి):** కూకట్‌పల్లిలో జరిగిన కోటి రూపాయాల చోరీ కేసును కేవలం 24 గంటల్లోనే పోలీసులు ఛేదించారు. ఈక్రమంలో ఫిర్యాదు దారుడే కీలక నిందితుడని పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే..కూకట్‌పల్లి పరిధిలోని మెట్రో పిల్లర్ వద్ద సోమవారం రాత్రి దాదాపు 10 గంటల సమయంలో రూ.కోటి నగదు తీసుకెళ్తున్న వారిని కొందరు దుండగులు కారం పొడి చల్లి దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈ చోరీ ఘటన ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. చోరీ ఘటనపై ఫిర్యాదు చేసి బాధితుడి ప్రవర్తన అనుమానస్పదంగా కనిపించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. అదేవిధంగా బాధితుడు చెప్పిన వివరాల మేరకు దుండగులను ట్రాక్ చేయడంతో నలుగురు నిందితులు పట్టుబడ్డారు. కోటి రూపాయాల చోరీ కేసును 24 గంటల్లోనే ఛేదించిన కూకట్‌పల్లి పోలీసులు ప్రధాన సూత్రధారితోపాటు నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.77.39 లక్షల నగదు, రూ.39,195 విలువైన విమాన టికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ రితీరాజ్ వెల్లడించారు.

**హవాలా సొమ్ము :**

నగరంలోని పాతబస్తీలోని బహదూర్‌పూరాకు చెందిన ఖుస్రోద్దీన్ తన యజమాని పంపిన హవాలా నగదుపై కన్నేశాడు. వారిపై దాడి చేసినట్టు చేసి రూ.కోటి నగదుతో దుండగులు పరారయ్యారు. అయితే ఆ సమయంలో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లో సీసీటీఎన్ఎస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ సీఐ సుబ్బారావుకు సమాచారం అందించారు. దీనితో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఈ నేపథ్యంలో నిందితులు వదిలేసిన హోండా యాక్టివా ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలతో నిందితులు శంషాబాద్ విమానాశ్రయంలో ఉన్నట్లు గుర్తించారు.

**లక్నోకు పారిపోతూ :**

చోరీకి పాల్పడిన నిందితులు నగదుతో లక్నో పారిపోయేందుకు ప్రయత్నించగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ఒమర్ షరీఫ్, గౌస్ సద్దాం, హమీద్, ఖుస్రోద్దీన్ ఉన్నారు. పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో బాధితుడిగా ప్లాన్ ప్రకారం వ్యవహరించిన ఖుస్రోద్దీన్ ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. డబ్బుల కోసం ఆశపడి ఈ తతంగాన్ని నడిపించాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తర లించారు. 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన కూకట్‌పల్లి, సీసీఎస్ పోలీసులను అభినందించి వారికి నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు.

# జగ్గారెడ్డిని పీసీసీ అధ్యక్షుడిని చేయాలి



- **ఆయన మరో పీజేఆర్**
- **మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, మార్చి 17 ( మనం బ్యూరో ) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. జగ్గారెడ్డి మాస్ లీడర్ అనీ, ఆయన ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటారని పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో కోమటిరెడ్డి మాట్లాడుతూ జగ్గారెడ్డి మరో పీజేఆర్ అంతటి వాడనీ, ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే ఆదుకుంటారని వ్యాఖ్యానించారు. జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలవడం ఖాయమని చెప్పారు. సంగారెడ్డి నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన జగ్గారెడ్డికి అపార రాజకీయ అనుభవం ఉందనీ, ఆయన అనుభవం కాంగ్రెస్ పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

# హ్యాం రోడ్ల పేరిట వేల కోట్ల కుంభకోణం

**హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిచే విచారణ చేయాలి?**

**ఆ టెండరు, మొబిలైజేషన్ అడ్వాన్సులు రద్దు చేయాలి?**

**సీవీసీ, ఆర్‌బీఐ సహా అన్ని విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం**

**రేవంత్ సార్కార్‌పై మండిపడ్డ హరీశ్‌రావు, వెముల ప్రశాంత్‌రెడ్డి**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో హ్యాం రోడ్ల పేరిట రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారని మాజీ మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రెండవ రోజు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్ చాట్‌లో వారు మాట్లాడుతూ. ఆర్అండ్‌బీ రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ రూ.6000 కోట్లు పది శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు పెట్టారు. రూ.1800 కోట్లు నేరుగా వస్తాయి నాలుగు రాష్ట్రాల ఎన్నికలకు ఆ మొత్తాన్ని పంపుతారు, జలయజ్ఞం కాదు ధనయజ్ఞం.. జేబులు దండుకుంటున్నారని నాడు తెలుగుదేశం, రేవంత్ రెడ్డి అంతటా చెప్పారు. చాలా పనుల బిల్లులు ఇవ్వడం లేదు, రోడ్లకు గుంతలు పడినా మరమ్మత్తులు చేయడం లేదు. కమీషన్ల కోసం హ్యాం రోడ్ల పేరిట వేల కోట్లు దండుకునేందుకు ప్లాన్ చేశారని ఆరోపించారు. దేశం మొత్తం జాతీయ రహదారులు సాధారణంగా 20 నుంచి 30 శాతం వరకు టెండర్లు తక్కువ ధరకు వెళ్తాయికానీ, ఇప్పుడు 15 నుంచి 20 శాతం అధిక ధరకు వెళ్తున్నాయి. తేడా 50 శాతం వస్తోంది. సీఓటీకి వెళ్లకుండా నేరుగా శాఖాపరమైన కమిటీ ఆమోదించేలా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని రద్దు చేసింది. నాడు జలయజ్ఞంలో 3 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఉంటే.. ఇప్పుడు పది శాతం పెట్టారు. మొత్తం 34లో ఇప్పటి వరకు తెరిచిన 24 టెండర్ల సాంకేతిక బిడ్లు చూస్తే దాదాపు 16 టెండర్లలో ఇద్దరు మాత్రమే వేశారు ముందే రింగ్ అయ్యారు. కుమ్మక్కై ముందే మాట్లాడుకొని అధికంగా టెండర్ వేసేలా చేశారు.

**రెండు కంపెనీలు మాత్రమే టెండర్లు..**

పంచాయతీరాజ్ లోని 12 పనులను కూడా ఇప్పటికే మాట్లాడి పంపకాలు చేశారు. ఇప్పటివరకు టెండర్ ధరలో ఐదు శాతం మాత్రమే ఎక్కువకు వెళ్లేలా సీలింగ్ ఉండేది, ఇప్పుడు హ్యాం రోడ్లకు ఎత్తివేయడంతో ఎంత ఎక్కువకు అయినా వేసుకోవచ్చు. హ్యాం రోడ్ల టెండర్లలో పెద్ద కుంభకోణం జరిగింది. నల్గొండలో రెండు కంపెనీలు మాత్రమే టెండర్లు వేశాయన్నారు. నల్గొండ జిల్లా టెండర్లు మూడు బృందా కంపెనీకి, ఒకటి వేరే కంపెనీకి ఇచ్చారు. రాష్ట్రం మొత్తం 34 టెండర్లలో 24 టెండర్లలో 16 టెండర్లు ఇద్దరు మాత్రమే వేశారు. టెండర్లలో కుమ్మక్కు అయ్యారు. సివేట్, సరళ, బృందా,బివిఎస్ఆర్ కంపెనీలు కుమ్మక్కయ్యాయి. పంచాయతీ రాజ్ శాఖలో 7 వర్కులు సివేట్‌కు 3 వర్కులు జె ఇన్ఫ్రా కంపెనీకి, చెరో ఒక టెండర్ సివేట్, బృందాకు ఇచ్చారు. రాష్ట్రంలో టెండర్ యక్సెస్‌కు 5 శాతం సీలింగ్ ఉండేది ఇప్పుడు కాంగ్రెస్ వచ్చిన తర్వాత యాక్సెస్ ఎత్తివేశారు. టెండర్లలో అవినీతి జరిగిందని.. వాటిని వెంటనే రద్దు చేయాలని. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపించాలని హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ కు,రిజర్వ్ బ్యాంకుకు ఫిర్యాదు చేస్తాం. అన్ని విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాము. టెండర్లలో పాలు పంచుకున్న అధికారులు, కాంట్రాక్టర్లపై మా ప్రభుత్వం రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే టెండర్లు రద్దు చేయాలి పారదర్శంగా నిర్వహించాలి. సీఓటీ అనుమతి, ఐదు శాతం సీలింగ్ తప్పనిసరి చేయాలి, మొబిలైజేషన్ అడ్వాన్సులు రద్దు చేయాలి. సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ చేయాలి. సీవీసీ, ఆర్‌బీఐ సహా అన్ని విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. అవినీతికి కారణమైన అధికారులు, కాంట్రాక్టర్లపై బీఆర్ఎస్ వచ్చిన తర్వాత విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ పద్దులు చర్చకు వచ్చినపుడు బీఆర్ఎస్ తరపున మరిన్ని ఆధారాలు బయటపెడతామన్నారు. హైకోర్టు విచారణకు పట్టుబడతాం సింగరేణి శ్రీరాంపూర్ టెండర్ వ్యవహారాన్ని మేము బయటపెట్టిన తర్వాత లెస్‌కు పోయిందన్నారు.

మనం Manam Editorial సంపాదకీయం

## నా తల్లి చెప్పినందుకే కవిత్వం రాస్తున్నాను

కవిత్వానికి
నేను ఒక నిశానీ పెట్టుకుంటాను
కలలను ఇంద్ర ధనుస్సులా అల్లుతాను

మండే హృదయంలో
నన్ను నేను పుటం పెట్టుకుంటాను
ముళ్లు గీరుకుంటున్నా
పరిమళం పోకుండా పూలను తీస్తాను

మనిషి స్వేచ్ఛ గురించి కావచ్చు,
రంగు వెలుస్తున్న జీవితం గురించి కావచ్చు
కుట్లు తెగిపోతున్న ప్రేమ గురించీ కావచ్చు
ఎప్పుడూ ఒక ప్రశ్నను వెతుకుతాను

నాది హైదరాబాద్
తెలంగాణ సంస్కృతిని కాపాడుతాను
బాణం పదును కూడా అందంగా మలుస్తాను
మనిషి కన్నీళ్లు తుడవడానికి,
మనసును నేమిలీకను చేస్తాను

ప్రాణాలు త్యాగాలు చేసిన నేలమీద పుట్టాను
ప్రశ్నిస్తేనే మనిషికి బతుకని నమ్ముతాను
ఈ మట్టిలో అత్తర్ వొలికింది, నెత్తురు వొలికింది
మనుషులు నడిచిన అడుగుల్లో స్వేచ్ఛ
మొలిచింది

నేను జీవితం గురించే కవిత్వం రాస్తాను
మనుషుల గురించే ప్రయాణం చేస్తాను

మీరు అనుమతిస్తే ఓ మాట చెపుతాను
నా తల్లి చెప్పినందుకే, కవిత్వం రాస్తున్నాను

**- ఆశారాజు**
9392302245

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**

**- ఎడిటర్**

# దేశ భద్రతకు ప్రాణం... అమరవీరుల త్యాగనిరతి

ఒక దేశం యొక్క అస్తిత్వం, ఆ దేశ సరిహద్దుల వద్ద నిరంతరం పహారా కాసే వీర జవానుల గుండె ధైర్యంపై ఆధారపడి ఉంటుంది. నిశ్శబ్దంగా సాగే ఈ నిరంతర పహారా వెనుక వేలాది మంది సైనికుల కుటుంబాల నిరీక్షణ, మరెందరో వీరుల రక్త తర్పణం దాగి ఉన్నాయి. మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛా వాయువులు, పొందుతున్న సామాజిక భద్రత కేవలం పాలనా వ్యవస్థల వల్ల మాత్రమే సాధ్యం కాలేదు; అది రక్షణ దళాల నిరుపమాన త్యాగఫలం. దేశం కోసం ప్రాణాలను అర్పించిన మహావీరుల త్యాగాన్ని స్మరించుకోవడం అనేది ప్రతి సమాజం యొక్క ప్రాథమిక నైతిక బాధ్యత మాత్రమే కాదు, అది జాతి ఉనికిని కాపాడే కర్తవ్య బోధ కూడా. సరిహద్దుల్లో శత్రువుల కన్ను పడకుండా దేశాన్ని కాపాడే సైనికులు, దేశం లోపల అశాంతి రేగకుండా రక్షించే పోలీసులు, అగ్నిప్రమాదాలు మరియు ప్రకృతి విపత్తుల వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టే అగ్నిమాపక మరియు విపత్తు నిర్వహణ దళాల సేవలు ఒక దేశం యొక్క స్థిరత్వానికి మూలస్తంభాలు. అటువంటి ధైర్యవంతుల త్యాగాలను సమున్నతంగా గౌరవించే ఉద్దేశంతోనే ప్రతి సంవత్సరం మార్చి 18న నేషనల్ సుప్రీం సాక్రిఫైస్ డేను మనం జరుపుకుంటున్నాం. ఈ దినోత్సవం కేవలం ఒక క్యాలెండర్ తేదీ కాదు, ఇది దేశ భద్రత మరియు ప్రజల ప్రాణరక్షణ కోసం జరిగిన అత్యున్నత త్యాగాలను స్మరిస్తూ, సమాజంలో దేశభక్తిని, కర్తవ్య నిష్ఠను రగిలించే ఒక చైతన్య స్ఫూర్తి.



సుప్రీం సాక్రిఫైస్ లేదా అత్యున్నత త్యాగం అనే పదానికి ఉన్న అర్థం చాలా గంభీరమైనది. మానవ జీవితంలో ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. అటువంటి ప్రాణాన్ని ఒక సిద్ధాంతం కోసం, ఒక దేశం కోసం, లేదా తోటి మనుషుల క్షేమం కోసం తృణప్రాయంగా అర్పించడం అనేది సామాన్య మానవులకు సాధ్యపడని విషయం. చరిత్ర పుటలను తిరగేస్తే, భారతదేశం ఎదుర్కొన్న ప్రతి సవాలులోనూ మన వీరుల రక్తపు ముద్రలు కనిపిస్తాయి. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుండి నేటి వరకు జరిగిన ప్రతి యుద్ధంలోనూ, ప్రతి ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలోనూ భారత సైనిక శక్తి తన వీరత్వాన్ని చాటుకుంది. భారతదేశం వంటి భౌగోళిక వైవిధ్యం ఉన్న దేశంలో రక్షణ బాధ్యత నిర్వహించడం ఒక అగ్నిపరీక్ష వంటిది. హిమాలయాల లోని గడ్డకట్టే మంచు తుఫానుల మధ్య, సియాచిన్ వంటి ప్రపంచంలోనే ఎత్తైన యుద్ధ క్షేత్రాలలో -40 డిగ్రీల చలిలోనూ అప్రమత్తంగా ఉండే సైనికుడి పట్టుదల వర్ణనాతీతం. మరోవైపు రాజస్థాన్ ఎడారులలో నిప్పులు చెరిగే ఎండలు, ఈశాన్య రాష్ట్రాల లోని దట్టమైన అరణ్యాలు, విస్తారమైన సముద్ర తీరాలు - ఇలా ప్రతి అడుగులోనూ ప్రకృతి సిద్ధమైన సవాళ్లను ఎదుర్కొంటూ సైనికులు విధిని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కేవలం శత్రువుల తూటాలకే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలకు కూడా ఎందరో బలై పోతున్నారు. అయినప్పటికీ, తమ తర్వాత వచ్చే తరం సురక్షితంగా ఉండాలనే ఒకే ఒక లక్ష్యంతో వారు ముందడుగు వేస్తున్నారు.

భారతదేశ చరిత్రలో జరిగిన యుద్ధాలు మన రక్షణ దళాల పరాక్రమానికి సాక్ష్యాలుగా నిలిచాయి. 1962 చైనా యుద్ధం, 1965 మరియు 1971లో పాకిస్తాన్తో జరిగిన పోరాటాలు మన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటాయి. ముఖ్యంగా 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం భారత సైనికుల అసమాన ధైర్యసాహసాలకు ప్రతీక. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో, శత్రువు పై చేయిగా ఉన్న పరిస్థితుల్లో కూడా మృత్యువును వెక్కిరిస్తూ మన జవాన్లు శిఖరాలను అధిరోహించి విజయం సాధించారు. ఈ యుద్ధంలో సుమారు 527 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. కెప్టెన్ విక్రమ్ బత్రా లాంటి వీరుల సాహసం నేటికీ భారతీయ యువతకు ఒక నిరంతరస్ఫూర్తి. ఈ యుద్ధాలు మరియు ఆపరేషన్లలో అమరులైన వేలాది మంది సైనికుల రక్తంతోనే దేశ చిత్రపటం సురక్షితంగా ఉందనే సత్యాన్ని ప్రతి పౌరుడు గుర్తించాలి. కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా, దేశం లోపల శాంతి భద్రతలను పరిరక్షించే పోలీసువ్యవస్థ, పారామిలిటరీ దళాల త్యాగాలను కూడా తక్కువ అంచనా వేయలేము. ఉగ్రవాదదాడులు, అంతర్గతభద్రతా ముప్పులు, నక్సలైటు సమస్యల వంటి క్లిష్ట పరిస్థితుల్లో పోలీసులు రక్షణ కవచంలా నిలుస్తున్నారు. 2008 ముంబై దాడుల సమయంలో సామాన్య ప్రజలను రక్షించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారులు మరియు భద్రతా సిబ్బంది చూపిన తెగువ చిరస్మరణీయం. సమాజం నిశ్చింతగా నిద్రపోవడానికి వారు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణ సిబ్బంది అందించే సేవలు మానవత్వానికి నిలువెత్తు సాక్ష్యాలు. భారీ వరదలు, భయంకరమైన భూకంపాలు లేదా పెను ప్రమాదాలు సంభవించినప్పుడు, ఎక్కడైతే అందరూ ప్రాణ భయంతో వెనక్కి తగ్గుతారో, అక్కడికి రక్షణ దళాలు, అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలకు తెగించి వెళ్తారు. శిథిలాల కింద చిక్కుకున్న చిన్నారిని రక్షించే క్రమంలోనో, లేదా వరద ఉధృతిలో కొట్టుకుపోతున్న అపరిచితుడిని కాపాడే ప్రయత్నంలోనో వారు తమ ప్రాణాలను కోల్పోయిన సందర్భాలు అనేకం. ఇది కేవలం వృత్తి ధర్మం మాత్రమే కాదు, ఇది నిస్వార్థమైన దేశ సేవ మరియు అత్యున్నతమైన మానవత్వం. ఇటువంటి త్యాగాల విస్తృతిని రక్షణ,గృహ మంత్రిత్వ శాఖల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం విధి నిర్వహణలో వందలాది మంది భద్రతా సిబ్బంది అమరులవుతున్నారనే వాస్తవం మనల్ని ఆలోచింప జేయాలి. ఈ త్యాగాలను కేవలం అంకెలుగా చూడకుండా, వారి వెనుక ఉన్న ఆశలు, ఆశయాలు మరియు వారి కుటుంబాల వేదనను అర్థం చేసుకోవాలి.

నేషనల్ సుప్రీం సాక్రిఫైస్ డే వంటి సందర్భాలు మనలో నిద్రాణమైన దేశభక్తిని రగిలిస్తాయి. అమర వీరుల కుటుంబాలను సత్కరించడం ద్వారా వారికి సమాజం అండగా ఉందనే భరోసాను కల్పించడం ముఖ్యం. అలాగే, విద్యా సంస్థల్లో ఇటువంటి దినోత్సవాలను నిర్వహించడం ద్వారా భావి తరాలకు త్యాగం యొక్క విలువను, దేశ రక్షణలో ఉండే గొప్పతనాన్ని వివరించవచ్చు. అయితే, అమరవీరుల పట్ల మన కృతజ్ఞత కేవలం భావోద్వేగానికే పరిమితం కాకూడదు. వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు సమాజం నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలి. విధి నిర్వహణలో అమరులైన వారి పిల్లల విద్యా సదుపాయాలు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా మరియు సమాజంలో వారికి దక్కాల్సిన గౌరవం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు. అలాగే, విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి అంగవైకల్యం పొందిన సైనికులకు మరియు పోలీసులకు మెరుగైన వైద్య మరియు పునరావాస సదుపాయాలు కల్పించడం మన కనీస బాధ్యత. ప్రస్తుత ఆధునిక కాలంలో దేశ భద్రత ఎదుర్కొంటున్న సవాళ్లు మారుతున్నాయి. ఈ ఆధునిక సవాళ్లను ఎదుర్కోవడానికి మన భద్రతా దళాలు అత్యాధునిక సాంకేతికతతో శిక్షణ పొందుతున్నాయి. అయినప్పటికీ, క్షేత్ర స్థాయిలో ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. ప్రాణనష్టం పూర్తిగా అరికట్టడం సాధ్యం కాని స్థితిలో, త్యాగాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ త్యాగాలను స్మరించుకోవడం వల్ల మనలో దేశం పట్ల మమకారం బలపడుతుంది. ప్రతి వ్యక్తి సరిహద్దుల్లో సైనికుడిగా మారలేక పోవచ్చు, కానీ తన రంగంలో నిజాయితీగా పనిచేస్తూ, దేశాభివృద్ధికి తోడ్పడటం కూడా దేశ సేవలో భాగమేనని గుర్తించాలి. అక్రమాలకు తావు లేకుండా, సామాజిక బాధ్యతను పెంచుకోవడం ద్వారా మనం అమరవీరుల త్యాగానికి నిజమైన గౌరవాన్ని ఇవ్వగలము. నేషనల్ సుప్రీం సాక్రిఫైస్ డే అనేది దేశాన్ని రక్షించేందుకు తమ ప్రాణాలను ఇంధనంగా మార్చిన మహావీరుల జ్ఞాపకాలకు సమర్పించే నీరాజనం. అమరవీరుల త్యాగాలు వ్యర్థం కాకూడదంటే, పౌరులుగా మనం ఐక్యతను చాటాలి. వారి త్యాగాల పునాదులపై నిర్మితమైన ఈ స్వేచ్ఛా భవనాన్ని మనం సురక్షితంగా కాపాడుకోవాలి. ఆ మహావీరుల త్యాగం మనకు నిరంతరం దిశానిర్దేశం చేసే వెలుగు కావాలి. బాధ్యతాయుతమైన పౌరులుగా మెలుగుతూ, దేశ ప్రగతిలో భాగస్వాములం కావడమే మనం ఆ వీరులకు అర్పించే అసలైన నివాళి. ఆ వీరుల ఆత్మకు శాంతి కలగాలంటే మనలో నిరంతరం దేశభక్తి జ్వాల ప్రజ్వరిల్లాలి.

**మార్చి 18 జాతీయ అత్యున్నత త్యాగ దినోత్సవం.**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## ఎరువుల భారం నుండి విముక్తి లేదా?



భారతదేశం నేడు ఆహార భద్రత విషయంలో స్వయం సమృద్ధి సాధించినప్పటికీ, ఆ ఆహారాన్ని పండించేందుకు అవసరమైన ఎరువుల విషయంలో మాత్రం తీవ్రమైన దిగుమతి సవాలును ఎదుర్కొంటోంది. ఇటీవల పశ్చిమాసియాలోని హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు మరియు అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశ ఎరువుల సరఫరా గొలుసు ఎంత బలహీనంగా ఉందో మరోసారి స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో, రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి 'బయో-పాత్వే' లేదా జీవ మార్గం వైపు మళ్లడం కేవలం పర్యావరణ అవసరం మాత్రమే కాదు, అది దేశ వ్యూహాత్మక భద్రతకు కూడా అత్యంత కీలకం. ఒక దేశం తన ప్రాథమిక అవసరమైన ఆహార ఉత్పత్తి కోసం ఇతర దేశాలపై, ముఖ్యంగా భౌగోళిక రాజకీయంగా అస్థిరంగా ఉండే ప్రాంతాలపై ఆధారపడటం ఎప్పుడూ ప్రమాదకరమే. 2025 నాటి గణాంకాలను పరిశీలిస్తే, హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో అంతరాయం కలిగితే అత్యంత ప్రభావితమయ్యే దేశాలలో భారత్ ఒకటిగా నిలుస్తోంది. చమురు విషయంలో మనకు వ్యూహాత్మక నిల్వలు ఉన్నప్పటికీ, నత్రజని సంబంధిత ఎరువుల విషయంలో అటువంటి రక్షణ కవచం లేకపోవడం గమనార్హం.



ప్రస్తుతం భారతదేశం తన యూరియా అవసరాలలో దాదాపు మూడు వంతుల భాగాన్ని ఒమన్, సౌదీ అరేబియా, ఖతార్ మరియు యూఏఈ వంటి గల్ఫ్ దేశాల నుండే దిగుమతి చేసుకుంటోంది. 2025-26 నాటికి భారత ఎరువుల సబ్సిడీ బిల్లు అంచనా రూ. 1.86 లక్షల కోట్లుగా ఉంది, ఇది మొత్తం ప్రభుత్వ సబ్సిడీ వ్యయంలో 40 శాతానికి పైగా ఉంటుంది. సరఫరా మార్గాల్లో చిన్న అంతరాయం కలిగినా, అది షిప్పింగ్ ఖర్చులను పెంచి సబ్సిడీ భారాన్ని మరింత పెంచుతుంది. ఇది నేరుగా ఖరీఫ్ సీజన్ సాగుపై మరియు దేశ ఆహార ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కేవలం ఆర్థిక పరమైన అంశాలే కాకుండా, దశాబ్దాలుగా రసాయన ఎరువులను విపరీతంగా వాడటం వల్ల భారతదేశ నేలల స్వభావం కూడా పూర్తిగా దెబ్బతిన్నది. శాస్త్రీయంగా ఉండాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం నిష్పత్తి 4:2:1 కి బదులుగా, ప్రస్తుతం అది ఆందోళనకరంగా 10.9:4.4:1 స్థాయికి చేరుకుంది. రసాయన ఎరువుల అతి వినియోగం వల్ల నేలలోని సూక్ష్మజీవులు నశించి, నేల నిస్సారమవుతోంది. మనం వాడే ఎరువులలో సగం కంటే తక్కువ భాగమే మొక్కలకు అందుతోంది. మిగిలినది భూగర్భ జలాల్లోకి పర్యావరణానికి ముప్పుగా మారుతోంది.

ఈ సంక్లిష్ట సమస్యకు పరిష్కారంగా బయోఫెర్టిలైజర్స్ లేదా జీవ ఎరువులు స్పష్టమైన మార్గాన్ని చూపుతున్నాయి. ఇవి నేలలో నత్రజనిని స్థిరీకరించే, భాస్వరాన్ని కరిగించే మరియు నేల జీవశాస్త్రాన్ని మెరుగుపరిచే సూక్ష్మజీవుల ద్వారా తయారవుతాయి. ఇవి దేశీయంగా తయారు చేయబడటమే కాకుండా రసాయన ఎరువుల కంటే తక్కువ ఖర్చుతో కూడుకున్నవి. సిక్కిం రాష్ట్రం వంద శాతం సేంద్రీయ రాష్ట్రంగా మారడం, ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడం వంటి ఉదాహరణలు ఈ మార్పు సాధ్యమేనని నిరూపిస్తున్నాయి. అయితే, ఈ మార్పు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా విజయవంతం కావాలంటే ప్రభుత్వం తక్షణమే కొన్ని కీలకమైన విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. మొదటగా, ప్రస్తుతం రసాయన ఎరువులకు అందుతున్న భారీ సబ్సిడీల తరహాలోనే జీవ ఎరువులను కూడా ప్రోత్సాహక పథకాల్లో చేర్చాలి. వ్యవసాయ శాఖ ప్రతిపాదించినట్లుగా, సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా, రైతులు ధరతో సంబంధం లేకుండా తమ భూమికి అవసర మైన నాణ్యమైన ఎరువులను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు. ఇది మార్కెట్లో ఆరోగ్యకరమైన పోటీని పెంచుతుంది. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద ఏర్పాటు చేస్తున్న పది వేల బయో-ఇన్పుట్ రిసోర్స్ సెంటర్లు ఈ విప్లవానికి వెన్నెముకగా నిలవాలి. ఈ కేంద్రాల్లో తయారయ్యే ఎరువులు నాణ్యతతో ఉండేలా చూడటం అత్యంత ముఖ్యం. ప్రస్తుతం ఈ రంగం చిన్నచిన్న ప్రాంతీయ తయారీదారులతో విచ్చిన్నమై ఉంది. ప్రైవేట్ కంపెనీలను కూడా ఈ రంగంలో భాగస్వాములను చేసి, కేవలం ఎరువుల అమ్మకాలకే కాకుండా పంట దిగుబడి ఫలితాలకు కూడా వారిని బాధ్యులను చేయాలి. వీటితో పాటు కొత్త రకమైన సూక్ష్మజీవుల జాతులకు అనుమతులు ఇచ్చే ప్రక్రియను సరళీకృతం చేయాలి. రసాయన ఎరువులతో పోలిస్తే జీవ ఎరువులకు నిల్వకాలం చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి పరిశోధనల నుండి పొలానికి చేరే వరకు ప్రక్రియ వేగంగా ఉండాలి. బలమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే రైతులు ఈ నూతన పద్ధతులను నమ్మకంగా స్వీకరిస్తారు. రసాయన ఎరువుల నుండి జీవ ఎరువుల వైపు మళ్లడం అనేది రాత్రికి రాత్రే సాధ్యం కాకపోవచ్చు. రెండు వ్యవస్థలు కొంతకాలం పాటు కలిసి పనిచేయవలసి ఉంటుంది. దిగుమతి భారాన్ని తగ్గించుకోవడానికి, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మరియు రైతులకు తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయాన్ని అందించడానికి ఈ జీవ మార్గాన్ని అనుసరించడం నేటి అవసరం. హోర్ముజ్ జలసంధి సంక్షోభం మనకు ఒక హెచ్చరికగా భావించి, ఆహార భద్రత మరియు పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేయాలి. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన నేలను మరియు స్వయంసమృద్ధి కలిగిన వ్యవసాయ రంగాన్ని అందించే గొప్ప ప్రయత్నం.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# అమరజీవి ఆత్మార్పణం.. మరో కోణం

పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము. రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది.

మహాత్మా గాంధీతో వ్యక్తిత్వానికి ప్రభావితులై, ఉద్యోగం వదిలి దాదాపు రెండు దశాబ్దాలు శ్రీరాములు సన్నిహితంగా మెదిలారు. జాతిపిత అహింస సిద్ధాంతాన్ని విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. అదే మార్గంలో దీక్ష చేయాలని నిర్ణయిం చారు.

అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సందర్భంగా తనకు ఎదురవుతున్న సవాళ్లను తెలియజేస్తూ శ్రీరాములు రాసిన లేఖకు సమాధానంగా గాంధీజీ స్వదస్తూరితో ఇచ్చిన జవాబు... 'అన్ని విధాలుగా ప్రచారాన్ని కొనసాగించు. కానీ ఇప్పుడే దీక్ష వద్దు' అని గాంధీ పేర్కొన్నారు.

వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు.

అనంతరం నెల్లూరులో దళి తులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన వాటికోసం ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు.

''మద్రాసును కేంద్రపాలిత ప్రాంతం చేయాలి'' అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో ''ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది.

ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షిం చటం పాపమని నిన్నె(1952 సెప్టెంబర్ 14) అనిపించింది''.

తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే''ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు'' అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించ లేదు. ''మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యతను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ



ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు'' అని పేర్కొన్నారు.

1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ''మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి'' అని పేర్కొన్నారు. దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు..

''ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి.

1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది.''

ఆయనదీక్షను చేపట్టాక విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు.

1.మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం.

2.భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం. '' పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో ''మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడ తామో వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుం దన్నారు. మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులుకోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 15-20 కోట్లు ఎందుకు పోసు కోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృథా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కు ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి.''


అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ ''నేను చచ్చిపో వాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు'' అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952)

ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. ''ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు''. ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు.

మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు.

ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**- ఆర్‌కేఎస్**



## విజయ శిఖరాలను అధిరోహించాలంటే..?

ఎవరైనా సరే చేసే పనిలో విజయాన్ని సాధించాలంటే ఖచ్చితంగా ఆ పని మీద అవగాహన, ఆ పనిని సాధించాలనే తపన, దాని కొరకు సరైన ప్రణాళిక అనేది ఎంతో అవసరం. సహజంగా మనం ఏదైనా లక్ష్యసాధన దిశగా అడుగు లేస్తున్నప్పుడు అనేక అవరోధాలు వస్తూనే ఉంటాయి వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలే గాని అవరోధాలు వస్తున్నాయని వాటికి లోనై మన పనులను పక్కన పెడితే ఎన్నటికీ ముందుకు సాగలేము.

మన సమాజంలో మూడు రకాల స్వభావాలు గల మనుషులు ఉంటారు. అందులో మొదటి రకం వారు ఏదైనా పని చేద్దామని అనుకుంటున్నారు కానీ చేయరు కాలం గడిచిపోతూనే ఉంటుంది అందరితో నేను ఆ పనిచేస్తాను లేదా ఈ పని చేస్తాను అని చెప్పుకుంటూనే ఉంటారు కానీ ఏ ఒక్క పని చేయరు.రెండో రకం వారు పని ప్రారంభిస్తారు కానీ దాన్ని పూర్తి చేయకుండానే వేరే ఇతర పనుల మీద దృష్టి మళ్లిస్తారు అందువల్ల వారు ఏ పనిని సకాలంలో పూర్తి చేయలేరు.మూడో రకం వారు పని మీద దృష్టి పెట్టి ఆ పని అయ్యేదాకా వేరే ఏ పని ప్రారంభించరు. ఇటువంటి స్వభావం గలవారు ప్రారంభించిన ప్రతి పనిలోనూ విజయాన్ని సాధిస్తారు. మనం కూడా ఇటువంటి స్వభావాన్ని అలవర్చుకోవడం చాలా అవసరం.

ఇంకా విద్యార్థుల విషయానికొస్తే ప్రస్తుతం మనకి చదువులతో పాటు అభివృద్ధి చెందిన సాంకేతికత వలన సెల్ ఫోను మరియు వీడియో గేమ్‌లకు సమయాన్ని వృథా చేసే తత్వం బాగా పెరిగింది దీనివల్ల ఏ పని మీద దృష్టి సారించకపోవడం కొంచెం సేపు చదివిన తర్వాత మొబైల్ చూడాలి లేదా వీడియో గేమ్ ఆడాలనే ఆలోచన రావడంతో చేయవలసిన పనిలో పూర్తిస్థాయిలో దృష్టి సారించక తగినంత సామర్థ్యం పొందలేక విజయాలను సాధించలేకపోతున్నారు ఇది చాలా దురదృష్టకరం. ఇది మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి మనం చేయాల్సిందల్లా మనసును నియంత్రించుకొని ఏదైనా ఖచ్చితమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని మీద దృష్టి కేంద్రీకరించే విధంగా ముందుకు సాగాలి. ఆ విధంగా చేస్తే మనం ఖచ్చితంగా విజయాన్ని సాధించి తీరుతాం ఆ విధంగా అందరూ ముందుకు సాగాలని కోరుకుంటూ..

**- ఏడుకొండలు కళ్ళేపల్లి**
9490832338


# రైతులు సమగ్ర భూ రీ-సర్వే చేయించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి, మార్చి 17 మనం ప్రతినిధిః భూములకు సంబంధించిన వివాదాలు తగ్గించి రైతులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా పాల్గొని తమ భూములను రీ సర్వే చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. భూములకు సంబంధించిన సమస్యలు, సరిహద్దు వివాదాలు తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. మంగళవారం నాగలిగిద్ద మండలంలోని వల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని భూముల రీ-సర్వేపై గ్రామ ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన 17 గ్రామాల్లో సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ మరియు అటవీశాఖ అధికారుల సమన్వయంతో ఆధునిక రోవర్ సాంకేతికతను వినియోగించి వ్యవసాయ భూముల రీ-సర్వే నిర్వహించి, భూముల ఖచ్చితమైన హద్దులను నిర్ధారించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత భూములపై ఉన్న అనేక వివాదాలు తగ్గి రైతులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. భూముల కొలతలు సరిగ్గా నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో భూ రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని, రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ భూములను రీ-సర్వే చేయించుకుంటే భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్ నాయక్, తహసిల్దార్, ఎంపీడీవో, సర్పంచ్, గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 6గ్యారంటీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం



వేములవాడ,మార్చి17(మనం న్యూస్):కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని వేములవాడ బీజేపీ నాయకులు విమర్శించారు. మంగళవారం గ్యారంటీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు అందించాలని కోరుతూ తహసిల్దార్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్లు కొండ్లెపు ముత్యం, మైలారం శ్రీనివాస్, వంగల శ్రీనివాస్,రేగుల శ్రీకాంత్, బోనాల శివ, మామిండ్ల లక్ష్మీరాజం రేగుల రాజ్ కుమార్, బిల్ల కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, వివేక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ చవితిలో నిండు అసెంబ్లీలో వందేమాతరం గీతాన్ని అవమానించి బహిష్కరించి వెళ్లిన ఎంఐఎం పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో నివసించాలంటే జాతీయగీతం వందేమాతర గీతం ఆలపించాల్సిందేనని హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ములుగు, మార్చి 17(మనంన్యూస్)ః రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో చోటుచేసుకుంది. ములుగు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కొక్కొండ గ్రామానికి చెందిన అశేల్లి వాసుదేవా, అశేల్లి అరుంధతి ఆమె భర్త శ్రీనివాస్గౌడ్లు తన కొడుగు రిషికేష్, కూతురు భవిష్య, వంగాల అరుణ భర్త కుమార్లతో కలిసి అల్వాల్లో ఫంక్షన్కు కారు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వంటిమామిడి చెక్పోస్టు వద్ద కారు కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుంధతికి తీవ్ర గాయాలు కాగా, మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అరుంధతిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు .అశేల్లి వాసుదేవా గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తులు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# భీమన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్



వేములవాడ, మార్చి17(మనం న్యూస్)ః రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర మంత్రి, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఆలయానికి చేరుకున్న సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ జి. శ్రావణ్ కుమార్ మంత్రికి స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, ఎమ్మార్వో జయంత్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, జూనియర్ అసిస్టెంట్ నరాల రాజు, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, మార్చి - 17(మనం ప్రతినిధి )ః ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రీ ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బడ్జెట్ లోనే ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఆయా మండలాల్లో గుడిసె ల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయమై జడ్పీ డిప్యూటీ సీఈవో, హౌసింగ్. ఇతర అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ఇండ్లను పూర్తి చేయించాలని ఆదేశించారు.జిల్లాలో గ్రామ సమాఖ్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్ర భవనాల పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని భవనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా వసతులు కల్పించిన తర్వాత ప్రారంభించాలని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, హౌసింగ్ డీఈ సాజిద్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చందుర్తి మండల ప్రత్యేక అధికారి, పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సారంగాపూర్ మండలానికి శాశ్వత సర్వేయర్ను నియమించాలి



- జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి

జగిత్యాల మార్చి 17(మనం న్యూస్)ః జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో సర్వేయర్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేచపల్లి గ్రామ సర్పంచ్ బాస మహేష్ తెలిపారు. భూముల కొలతలు సక్రమంగా జరగకపోవడం వల్ల భూ వివాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇంచార్జి సర్వేయర్ ఉన్నప్పటికీ, ఆయన మండలానికి తరచుగా రాకపోవడంతో పెండింగ్లో ఉన్న భూ కొలతలు పూర్తి కావడం లేదని చెప్పారు. భూ సమస్యపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఇంకా పరిష్కారం లభించలేదని ఆయన వెల్లడించారు. అందువల్ల సారంగాపూర్ మండలానికి శాశ్వత సర్వేయర్ను వెంటనే నియమించి, పెండింగ్లో ఉన్న భూ కొలతలను పూర్తి చేసి రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సర్పంచ్ బాస మహేష్ జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు అంతర్జాతీయ విషయాలపై అవగాహన పెంపొందించాలి




జగిత్యాల మార్చి 17(మనం ప్రతినిధి)ః విద్యార్థులలో అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా విద్యాశాఖ మరియు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం నాడు నమూనా ఐక్యరాజ్యసమితి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత మాట్లాడుతూ వనరులపై అధిపత్యము కోసమే అనేక యుద్ధాలు జరిగాయని ప్రస్తుతం కూడా చమురుపై ఆధిపత్యం కోసం యుద్ధాలు జరుగుతున్నాయని తెలిపి మనం ఇతరులపై ఆధారపడకుండా మనకు మనమే అనగా ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా విద్యార్థులందరూ కృషి చేయాలని ఆశించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ వాతావరణం లో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, ప్రపంచశాంతిని కాపాడటంలో అంతర్జాతీయ సంస్థలు కీలక పాత్ర పోషించాలని లేదంటే మూడవ ప్రపంచ యుద్ధం సంభవిస్తే ప్రపంచం మొత్తం అంతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించి పిల్లలు ఇట్టి కార్యక్రమంలో పలు విషయాలపై అవగాహన చేసుకుంటే అవి ఉపయోగకరంగా ఉండి భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము మాట్లాడుతూ తక్కువ సమయంలో విద్యార్థులను సిద్ధం చేసి పిల్లలకు మంచి మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయులను చురుకుగా పాల్గొన్న విద్యార్థులను అభినందించి ఇటువంటి కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలు తరతరాలకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చంద్రశేఖర్ రెడ్డి , సత్యనారాయణ, నీరజా, మహేష్ లు మరియు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఫోరం అధ్యక్షుడు జోగ రవి ,కార్యదర్శి దాసరి రామస్వామి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు భోనగిరి దేవయ్య కొమరయ్య , మహేష్, జక్కుల రవి అజీమ్, పద్మ, సతీష్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో వేములవాడ



వేములవాడ, మార్చి17(మనం న్యూస్)ః వేములవాడ పట్టణం సర్వతోముఖాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పట్టణంలోని నాలుగో వార్డులో గల మహాలక్ష్మి కమాన్ నుండి జమ్మి చెట్టు వరకు చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్ తోట రాజు మరియు కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వేములవాడ పట్టణ రూపురేఖలు మారుతున్నాయని కొనియాడారు. ప్రజల సౌకర్యార్థం వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అభివృద్ధి లక్ష్యంగా పట్టణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో వేములవాడను ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం



- గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం
- డాక్టర్ అన్నపూర్ణ

గజ్వేల్ మార్చి 17 మనం న్యూస్ః గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక '99 రోజుల' కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, మార్చి 17(మనం ప్రతినిధి)ః ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో ఇల్లంతకుంట మండలం వంతడుపుల, అనంతారం, రేపాక, ఓబులాపూర్, బోయినపల్లి మండలం విలాసాగర్, మల్కాపూర్, మర్లపేట, కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్, వేములవాడ, గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామాల్లో మొత్తం 40 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇల్లంతకుంట మండలం వంతడుపులలో మంగళవారం కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు వస్తాయని తెలిపారు. ఆయిల్ పామ్ లో అంతర పంటలుగా కూరగాయలు, మొక్క జొన్న, పూల మొక్కలు ఇతర పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్, ఇతర సబ్సిడీలు ఉన్నాయని తెలిపారు. పంటకు మంచి మద్దతు ధర వస్తుందని వివరించారు. పంట ఉత్పత్తి సేకరణకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి మండలం నుంచి కొనుగోలు చేస్తారని తెలిపారు. ఒకే పంట సాగు చేయకూడదనే ఉద్దేశంతో, ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు ఇప్పటికే పీఏసీఎస్ లలో రైతులకు అవగాహన కల్పించామని, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు లక్ష్యం నిర్దేశించామని తెలిపారు. ఆదర్శనీయమైన రైతులు ముందుకు వస్తున్నారని, మిగతా వారు కూడా సాగు చేయాలని పిలుపు ఇచ్చారు. జిల్లాకు దగ్గరలోనే సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించ నున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ ఫరూఖ్, ఎంపీడీఓ శశికళ తదితరులు ఉన్నారు.

# మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ముస్లిం సోదరిమణులు



ములుగు, మార్చి 17మనం ప్రతినిధి : మంగపేట మండలం లోని దొమేడా గ్రామం లోనీ మసీద్ కు చుట్టూ ప్రహరీ గోడా కావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలియజేసిన వెంటనే స్పందించి 6 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ శాంక్షన్ చేయగా మంగళవారం నిర్మాణ పనులను మత పెద్దలు మొల్ సాహెబ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం లకు ఇది చాలా పవిత్రమైన నెలగా భావిస్తారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చే ముస్లిం కుటుంబాలకు తోఫా కిట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పంపగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, మాజీ పిఏసిఎస్ చైర్మన్ తోట రమేష్,జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ క్రరీ నాగేంద్ర బాబు,మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కొంకతి సంబశివారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలన్న,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పల్నాటి సంతోష్, మాజీ ఎంపీటీసీ కొమరం సారయ్య, గ్రామ అధ్యక్షులు సప్పిడి వెంకటేశ్వర్లు, మహ్మద్ ఆశీ, అచ్చలు, కొమరం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లా కలెక్టరేట్లో ఘనంగా ఇఫ్తార్ విందు

జగిత్యాల మార్చి 17 (మనం ప్రతినిధి)ః జగిత్యాల జిల్లాలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత మరియు బి. రాజ గౌడ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సమాజంలో పరస్పర గౌరవం, సహనం, సహాయ సహకారాల విలువలను పెంపొందించే గొప్ప సమయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు సూదన్, డి.ఆర్.డి. ఓ రఘువరన్, డి. పి.ఆర్.ఓ నరేష్, కలెక్టరేట్ ఏ.వో హకీమ్, ట్రెసా జిల్లా అధ్యక్షులు వకీల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాగేందర్ , జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, ముస్లిం మత పెద్దలు, వివిధ స్థాయిల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# సామేల్ వాక్యల్ని ఖండించిన భారత సురక్ష సమితి



జగిత్యాల మార్చి 17(మనం న్యూస్)ః ఈనెల 12వ తేదీన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ గా పదవి బాధ్యతల్ని స్వీకరిస్తున్న సందర్భంగా గాంధీభవన్ వేదికగా బ్రాహ్మణోత్తములు ఇచ్చిన ఆశీర్వచనాలను వక్రీకరిస్తూ వైదిక మంత్రాలను బూతులతో పోలుస్తూ బ్రాహ్మణ పండితులను హిందూ ధర్మాన్ని కించపరిచే విధంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడిన మాటల్ని తీవ్రంగా ఖండించారు. మందుల సామేల్ దళిత ముసుగులో ఉన్న క్రిస్టియన్ అని, క్రిస్టియన్ మతాన్ని ఆచరిస్తూ రాజకీయంగా ఎస్సి రిజర్వేషన్స్ ఉపయోగించుకొని ఎమ్మెల్యే అయిన సామెల్ అసలైన దళిత సోదరులకు అన్యాయం చేస్తున్నాడని శతమానం భవతి సర్వేజనా సుఖినోభవంతు అని దీవించే బ్రాహ్మణ పండితుల దీవెనలను నీచంగా మాట్లాడటం సరి కాదని ఇలాంటివారు హిందూ ధర్మంపై చేస్తున్న వాక్యాన్ని బ్రాహ్మణులే కాకుండా హిందూ సమాజమంతా ఖండించాలని సామెల్ ను పార్టీ నుండి సస్పెండ్ చేసి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రముఖ న్యాయవాది అక్కినపల్లి కాశీనాథం, కార్యదర్శి సింగం గంగాధర్, 22వ వార్డు కౌన్సిలర్ ఆరవ లక్ష్మి, చిట్ల గంగాధర్, భాశెట్టి దుబ్బరాజం, తునికి అంజన్న, బొందుకూరు శ్రీనివాస్, ప్రదీప్ రావు పాల్గొన్నారు

## సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీశైలంకు శుభాకాంక్షలు



రంగారెడ్డి మార్చి 17 (మనం న్యూస్): సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా ఇన్స్పెక్టర్ గా శ్రీశైలం యాదవ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సరూర్ నగర్ పోలీస్ స్టేషన్లో వి ఎం హోమ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సరూర్నగర్ బంగారు మైసమ్మ కాశీ వైద్య నాథ దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ బేర బాలకిషన్,(బాలన్న) జనరల్ సెక్రెటరీ నోముల కబీర్ దాస్ గౌడ్, కోశాధికారి జక్కుల శ్రీశైలం యాదవ్, సలహాదారులు కైరంకొండ దనంజయ,నల్లెంకి ధనరాజ్ గౌడ్ , రవి, బోనగిరి శ్రీనివాస్, సోమన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో ఏసీబీ సోదాలు

- అవినీతి అధికారుల అపవిత్ర బంధం బట్టబయలు!
- కమిషనర్ సరస్వతి రీ-ఎంట్రీ వెనుక ఉన్న అసలు రంగు బయటపడింది
- అర్కాల కామేష్ రెడ్డి

రంగారెడ్డి మార్చి 17 (మనం న్యూస్) మున్సిపల్ కార్పొరేషన్లో తాజాగా జరిగిన ఏసీబీ సోదాలు అధికారుల, అధికార పార్టీ నేతల మధ్య ఉన్న అపవిత్ర బంధాన్ని నిరూపించాయని మీర్పేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కాల కామేష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా కమిషనర్ సరస్వతి బదిలీ అయిన కేవలం నెల రోజుల్లోనే మళ్ళీ అదే స్థానానికి రావడం వెనుక ఉన్న కుట్ర ఇప్పుడు సాక్ష్యాధారాలతో సహా బయటపడిందని ఆయన ధ్వజమెత్తారు.

**ప్రధాన ఆరోపణలు:**

దొంగ ఫైళ్ల రక్షణ కోసమే రీ-ఎంట్రీ: కమిషనర్ సరస్వతి బదిలీ అయిన నెల రోజుల్లోనే కాంగ్రెస్ నాయకుల ప్రోత్బలంతో మళ్ళీ అదే సీటులోకి రావడం వెనుక ఉన్న అసలు కారణం.. గతంలో ఆమె చేసిన అక్రమాలను, దొంగ ఫైళ్లను కాపాడుకోవడానికే అని ఇప్పుడు ఏసీబీ సోదాల ద్వారా నిర్ధారణ అయింది.

**అధికారుల భారీ కుంభకోణం:**

ఈ అవినీతి చక్రంలో కమిషనర్తో పాటు ఏఎంసి శ్రీధర్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి , ఇతర అధికారులు కీలకంగా వ్యవహరించారు. వీరంతా కలిసి ముందస్తు ప్రణాళికతో ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు.

**శానిటేషన్ విభాగంలో కోట్ల రూపాయల దోపిడీ:**

శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి మరియు బినామీ ఏజెన్సీలతో కలిసి కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా రూ .9.50 కోట్లు రూపాయల లోపు ఉన్న పనుల ఫైళ్లను సృష్టించి, నిబంధనలను తుంగలో తొక్కి నిధులను కాజేస్తున్నారు. ఏసీబీ సోదాల్లో దొరికిన దొంగ ఫైళ్లు9 లక్షల లోపు ఉన్న అక్రమ అనుమతులపై పూర్తిస్థాయి నివేదికను ప్రజల ముందు ఉంచాలి. అవినీతికి పాల్పడిన కమిషనర్ సరస్వతి, శ్రీధర్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. అవినీతి




అధికారులకు కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ నాయకుల అసలు స్వరూపాన్ని బడంగ్పేట్ ప్రజలందరికీ వివరిస్తాం. లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాం.

## తెలంగాణలో బంజారాలకు కాంగ్రెస్ అన్యాయం

- ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆవేదన
- కాంగ్రెస్ పార్టీకి బంజారాల హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 17(మనంన్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షలకుపైగా జనాభా కలిగిన బంజారాలు రాష్ట్రంలో రాజకీయాలనూ తారు మారు చేసే చైతన్యం కలిగి ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో బంజారాలు ముఖ్యమైన పాత్ర పోషించారని స్వయంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలియజేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అయినప్పటికీ, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (అఐఇఇ) ఇటీవల ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీలో బంజారాలకు చెందిన ఒక్క ప్రతినిధికి కూడా స్థానం కల్పించకపోవడం సమాజానికి తీవ్ర నిరాశకు గురిచేస్తోందని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మోహన్ సింగ్, ప్రధాన కార్యదర్శి బస్కి నాయక్‌లు తెలిపారు. బంజారా సమాజం ఎప్పటినుంచో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తూ, పార్టీ విజయాల్లో



కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో బంజారా ఓటర్లు, నాయకులు, కార్యకర్తలు ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించారని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్ని సభలలో తెలియజేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి సమాజాన్ని పక్కన పెట్టడం అనేది కేవలం ఒక నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక పెద్ద సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యం చేయడం అని భావించవచ్చు. ఇది మాత్రమే కాకుండా, రాష్ట్రంలో మంత్రి పదవుల విషయంలో కూడా బంజారా జాతికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల సమాజం ఇప్పటికే ఆవేదనకు కారణమైంది. ఇప్పుడు అఐఇఇ స్థాయిలో కూడా కోఆర్డినేషన్ కమిటీలో ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల బంజారా సమాజం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ముఫై 30 లక్షల జనాభా కలిగిన బంజారా జాతికి రాజకీయంగా గుర్తింపు ఇవ్వకపోవడం, వారి కృషిని గౌరవించకపోవడం, సమాజంలో అసమానతలకు దారితీస్తున్నది. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి ప్రతికూల పరిస్థితులను తీసుకువస్తుంది. మేము ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున ఆవేదనను వ్యక్తం చేస్తున్నాము. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యతతో పరిగణించి వెంటనే బంజారా జాతికి మంత్రి మండలి లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము. లేకపోతే, ఇటువంటి నిర్ణయాలు భవిష్యత్తులో రాజకీయ పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నాము. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బంజారాల హక్కుల కోసం పోరాడటానికి ఎల్లవేళల సిద్ధంగా ఉందని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మోహన్ సింగ్, ప్రధాన కార్యదర్శి బస్కి నాయక్‌లు తెలిపారు.

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మందిపేదలకు లబి



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి

రంగారెడ్డి మార్చి 17 (మనం న్యూస్) నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూరి కాలనీ నందు నివాసం ఉండే విజయకుమారి గుండెనొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,ఆందోజు సత్యంచారి,పగిడిమర్రి శంకర్,నారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతా



- డివిజన్ అధ్యక్షుడు పున్నా గణేష్ నేత

రంగారెడ్డి మార్చి 17 (మనం న్యూస్) మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ లో సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతా అని ఆర్కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత అన్నారు. మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కాలనీల సమస్యలు, అభివృద్ధి పనుల విషయములో మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి తో చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ నేత మాట్లాడుతూ కె ఎల్ ఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కు పితృ వియోగం



మహబూబాబాద్, 17 (మనంన్యూస్): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి జాటోత్ లచ్చా నాయక్ (95) మరణించగా వారి పార్థీవ దేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించిన బంజారా బంధుమిత్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, భానోత్ వెంకన్న, బాదావత్ బాలాజీ, రామన్న, జాటోత్ కిషన్ నాయక్, రాష్ట్ర ట్రైబల్ జర్నలిస్టు యూనియన్ జాయింట్ సెక్రెటరీ, లావుడియా పల్లవి రాజు నాయక్, పోరిక రమేష్ నాయక్ ప్రొఫెసర్, ఆర్టీసీ డిపార్ట్మెంట్ మూడు రమేష్, సీనియర్ జర్నలిస్ట్ భూక్య శ్రావణ్ కుమార్,లు నివాళులు అర్పించారు. జాటోత్ హుస్సేన్ నాయక్ ను కలిసి ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చిన బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్ వెంకన్న, బాలాజీ, రామన్న, రమేష్, శ్రవణ్ కుమార్, రామ్ కుమార్ మొదలైన వారు అంత్యక్రియ లో పాల్గొన్నవారు

## బిజెపి జోనల్ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గుగులోతు హుస్సేన్ నాయక్



హైదరాబాద్, మార్చి 17(మనంన్యూస్): భారతీయ జనతా పార్టీ గోపాలపురం జోనల్ ఎస్టి మోర్చా అధ్యక్షుడిగా హనుమకొండ 56వ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీకి చెందిన గుగులోత్ హుస్సేన్ నాయక్ నియమితులయ్యారు. బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్ ఆదేశం మేరకు బిజెపి గోపాలపురం జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యాలయ కార్యదర్శి అలుగునూరి కృష్ణంరాజు, బిజెపి గోపాల్పూర్ జోనల్ కార్యదర్శి బొద్దిరెడ్డి సురేందర్ రెడ్డి, జోనల్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బత్తుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా నాయకులు ఆరే రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజారోహణంతో ప్రారంభమైన శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాల వైభవం

- రామ నామ స్మరణతో మార్మోగిన ఆలయం

తిరుపతి, మార్చి 17 మనం న్యూస్ : తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తుల రామ నామ స్మరణతో ఆలయం మార్మోగింది. కంకణబట్టార్ శ్రీ భరత్ కుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 8 నుండి 9 గంటల మధ్య మేషలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణ, రామనామ జపముల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్ఠింపచేశారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతోపాటు సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని అర్చకులు తెలిపారు. అంతకుముందు ఉదయం 6.30 నుండి 8 గంటల వరకు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు, ధ్వజపటము, చక్రతాళ్వారులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుండి 9.30 గంటల వరకు ఆస్థానం నిర్వహించారు. అనంతరం ఉదయం 11 నుండి 12.45 గంటల వరకు శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె,



కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. కాగా, రాత్రి 7 నుండి 8.30 గంటల వరకు పెద్దశేష వాహన సేవ జరుగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, డిప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సిలిండర్లను బ్లాక్ లో విక్రయిస్తే కఠిన చర్యలు

ములుగు, మార్చి 17మనం ప్రతినిధి : సిలిండర్లను బ్లాక్ లో విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ కన్వీనర్ మరియు డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసర్ సయ్యద్ షా ఫైసల్ హుస్సేన్ హెచ్చరించారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు సంబంధించి ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ సందర్భంగా 16.03.2026 న జిల్లాలో 1402 డొమెస్టిక్ సిలిండర్లను డెలివరీ చేశామని తెలిపారు. ఎప్పటికప్పుడు మానిటరింగ్ కమిటీ గ్యాస్ సరఫరా ఇబ్బందులపై పర్యవేక్షణ జరుపుతుందన్నారు. యధావిధిగా ఎప్పటిలాగానే గ్యాస్ సరఫరా జరుగుతుందని స్పష్టం చేశారు.

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ గా వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లాలో కమర్షియల్ గా వాడుతున్న 46 డొమెస్టిక్ సిలిండర్లను అధికారులు సీజ్ చేశారని తెలిపారు. అదేవిధంగా 30 కేసులు నమోదు చేశారని చెప్పారు. గ్యాస్ సరఫరా పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## టాస్క్ ఫోర్సును వరించిన ఏడు ఉగాది-2026 సేవా పతకాలు



తిరుపతి, మార్చి 17 మనం న్యూస్ : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) విభాగానికి ఏడు ఉగాది-2026 సేవా పతకాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు, ఎస్పీ పీ.శ్రీనివాస్ అధికారులు, సిబ్బంది పనితీరును గుర్తించి, వీరికి పతకాలను సిఫారసు చేశారు. అధికారులు, సిబ్బందిల ఉత్తమ సేవలకు గుర్తింపుగా టాస్క్ ఫోర్సు పోలీసులు ఏడుగురుకి ఉగాది-2026 సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్ ఫోర్సు రిజర్వు ఇనస్పెక్టర్ బి. సత్యసాయి గిరిధర్ కు సేవా పతకం, రిజర్వు సబ్ ఇనస్పెక్టర్ సి. వినోద్ కుమార్ కు కఠిన సేవా పతకం, కానిస్టేబుల్ ఎం. మణికంఠకు కఠిన సేవా పతకం, హెడ్ కానిస్టేబుళ్లు కే రాజేష్ రాజుకు కఠిన సేవా పతకం, ఎం. వెంకటరమణకు సేవా పతకం, కానిస్టేబుళ్లు ఎం. రాజేష్ కు ఉత్తమ సేవా పతకం, డి. కిరణ్ కు సేవాపతకం లభించాయి.

ఉగాదిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ సేవా పతకాలను ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసిందని టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు తెలిపారు. ఇదే విధంగా భవిష్యత్తులోనూ ఇదే తరహాలో కర్తవ్య నిబద్దతతో పని చేసి మరెన్నో పతకాలను పొందాలని టాస్క్ ఫోర్స్ ఎస్పీ.పీ.శ్రీనివాస్ సూచించారు. పతకాలను పొందిన వారికి వీరిద్దరూ అభినందనలు తెలిపారు.

## కాణిపాకంలో 8 కియోస్క్ మిషన్ల ప్రారంభించిన ఎమ్మెల్యే

కాణిపాకం మార్చి 17 మనం న్యూస్ : శ్రీ స్వయంభు వరసిద్ధి కాణిపాక వినాయక స్వామి ఆలయం నందు 8 కియోస్క్ మిషన్లను పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ మంగళవారం ప్రారంభించారు.

కరూర్ వైశ్యా బ్యాంక్ వారి సౌజన్యంతో భక్తులకు లకు టికెట్లు సేవలు డొనేషన్లు సులభ పద్ధతిలో అందుబాటులో తీసుకురావాలని ఉద్దేశంతో మంగళవారం ఆర్జిత సేవా కౌంటర్ల వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు దేవస్థానం ఈవో పెంచల కిషోర్ బోర్డు సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, శివప్రసాద్, నరేష్, సునీత, అనసూయ, ఈ.ఈ వెంకట్ నారాయణ, ఏఈఓ ఎస్వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, కరూర్ వైశ్య బ్యాంక్ ఏజీఎం సత్యనారాయణ, మేనేజర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ కేసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన తిరుపతి ఎంపీ



తిరుపతి, మార్చి 17 మనం న్యూస్ : తిరుపతి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో సోమవారం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి ఢిల్లీ నుంచి స్పందించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్న ఆయన ఈ ఘటనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలపై అధికార పార్టీకి చెందిన వ్యక్తులు దాడి చేయగా వారిని వదిలిపెట్టి, దాడిలో గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలపైనే అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. చట్టాన్ని వక్రీకరించి రాజకీయ కక్ష సాధింపులకు ఉపయోగించడం తగదన్నారు. అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పెళ్లకూరు మండలం కలవకూరు గ్రామంలో ఇసుక అక్రమ రవాణా విషయమై ప్రశ్నించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యపై అక్రమ కేసు నమోదు చేయడం, మాజీ డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, గ్రామానికి చెందిన మరికొంత మంది నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి రిమాండ్కు పంపడం అధికార పార్టీ నాయకుల మన్ననలు పొందేందుకు అక్రమ కేసులు బనాయించి వేధించే ఏ అధికారిని కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశం

- పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- తక్షణ స్పందనతో రంగంలోకి దిగిన మంత్రి
- రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో అడ్డంకుల నివారణకు ఆదేశాలు
- యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసిన మంత్రి



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మళ్లకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థతో మంత్రి నేరుగా ఫోన్లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః కొణిజర్లకు చెందిన నిరుపేద మైనారిటీ విద్యార్థి ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత గా నిలవడం అభినందనీయమని ఖజానా శాఖ ఉపసంచాలకులు వై. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు కలెక్టరేట్ లోని ఖజానా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షేక్ ఉస్మాన్ కు పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూత గా అందించిన ఇరవైవేలరూపాయల చెక్కును అందజేసి అభినందించారు. కొణిజర్లకు చెందిన నిరుపేద మైనారిటీ వర్గానికి చెందిన షేక్ హసన్, అబ్బాస్బీ దంపతుల కుమారుడు ఉస్మాన్ మధ్యప్రదేశ్ లో ఫోరెన్సిక్ డిగ్రీ చదువుతుండగా, ఆర్థిక చేయూత కోసం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ను సంప్రదించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు నేపద్యంలో ఆర్థిక చేయూత కు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ అంగీకరించింది. ఆ మేరకు మంగళవారం చేయూత గా చెక్కు అందజేసింది. ఖజానా శాఖ కార్యాలయంలో ఉప కోశాధికారులు బినాగేంద్రకుమారి, యం వేలాద్రి, బి శారద, వై మంజుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య, విశ్రాంత యంపిఓ డి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ న్యాయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా 'దండి'



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః ఆల్ ఇండియా న్యాయ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులుగా ఖమ్మం నగరానికి చెందిన దండి ప్రేమ్ కుమార్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర న్యాయ ఉద్యోగుల సంఘానికి అసోసియేట్ ప్రెసిడెంట్ గా వ్యవహరిస్తున్న దండి ప్రేమ్ కుమార్ గతంలో ఖమ్మం జిల్లా న్యాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కూడా పనిచేశారు .ప్రస్తుతం హైదరాబాదులో కూకట్పల్లి కోర్టులో చీఫ్ అడ్మిస్ట్రేటివ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. ప్రేమ్ కుమార్ కు జాతీయ కమిటీలో స్థానం లభించడం పట్ల పలువు శాఖ ఉద్యోగులు అధికారులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# నిజమైన సేవకులకు అవకాశం కల్పించాలి



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః ప్రభువైన ఏసుక్రీస్తు బోధనలను ప్రజలకు అందిస్తూ ఆధ్యాత్మిక సేవ చేస్తున్న నిజమైన సేవకులకు బిషప్గా అవకాశం కల్పించాలని డోర్నకల్ డయాసిస్ అధ్యక్ష మండల పీఠం ఎన్నికల బిషప్ అభ్యర్థి కె. సేనంరాజు కోరారు. ఖమ్మం శ్రీనివాసనగర్లోని బృందావనం గార్డెన్స్లో మంగళవారం చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) డోర్నకల్ డయాసిస్ అధ్యక్ష మండల పీఠాధిపతి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీ రాష్ట్రంలోని తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి డయాసిస్లోని గ్రూపు చైర్మన్లు, గ్రూపు కార్యదర్శులు, సభ్యులు 1000 మంది ప్రతినిధులు హాజరై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బీజీ క్లెమెంట్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బిషప్ అభ్యర్థి కె.సేనంరాజు మాట్లాడుతూ... మే 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం సెయింట్ ఆంద్రూస్ చర్చిలో డోర్నకల్ డయాసిస్ బిషప్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు ఈఎన్నికల్లో కె. సేనంరాజు ప్యానల్ నుంచి కేటీ విజయకుమార్, ఆర్. ఇజ్రాయేల్రెడ్డి, జీజే కాంతారాణి పోటీ చేస్తున్నారని వెల్లడించారు. కొందరు రియల్టర్లు, కుహనా ఆధ్యాత్మిక వేషధారులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, వారి నుంచి డయాసిస్లోని క్రైస్తవ సంఘాలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. డయాసిస్లో గతంలో జరిగిన పొరపాట్లను సమీక్షించుకొని భవిష్యత్తులో పునరావృతం కాకుండా సీనియర్ సంఘకాపరులైన నలుగురు అభ్యర్థులకు సభ్యులు తమ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, డయాసిస్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు అనంతరం 320మంది సభ్యులు సేనంరాజు ప్యానలకు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఆరు జిల్లాలకు చెందిన గ్రూపు కార్యదర్శులు ఐజక్ మల్లికార్జున్, ఆముదాల ప్రసాద్, ఇ. కిశోర్, రితేశ్రెడ్డి, వేము కృష్ణ, నెమ్మాది నవీన్, స్వర్ణప్రేమలత, శాంతారాజ్యం, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## కరాటే ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా త్రివేణి



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః రెండు తెలుగు రాష్ట్రాల షోటోకాన్ కరాటే ఛాంపియన్షిప్ 2026 పోటీలను స్థానిక ఎంబి గార్డెన్స్ ఖమ్మం నందు, వినోద్ కరాటే అకాడమీ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి విద్యార్థిని విద్యార్థులు పలు విభాగాలలో బహుమతులను గెలుచుకున్నారు, త్రివేణి కరాటే మాస్టర్ వీరన్న బెస్ట్ రిఫరీ అవార్డును గెలుచుకున్నారు. అలాగే త్రివేణి పాఠశాల ఓవరాల్ ఛాంపియన్షిప్ ను గెలుచుకుంది. త్రివేణి పిల్లలు ఈ అవార్డులు గెలుచుకోవడం పట్ల పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి హర్షం వ్యక్తం చేస్తూ మున్ముందు జాతీయస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేస్తూ త్రివేణి విద్యార్థులు చదువులు ఆటపాటల్లోనే కాకుండా ఇలాంటి స్వీయ రక్షణ విద్యలో కూడా ముందుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ వినోద్ పాల్గొని పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు ఈ కార్యక్రమంలో వినోద్ మాట్లాడుతూ కరాటే స్వీయ రక్షణకు అలాగే శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ బహుమతి ప్రదానోత్సవం లో పాఠశాల కరాటే మాస్టర్ వీరన్న వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా పాల్గొని విజేతలైన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్.పి.వి.వ్యాక్సిన్

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.రామారావు



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః ఖమ్మం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని ఆరోగ్య మహిళా సెంటర్ వద్ద హెచ్.పి.వి. వ్యాక్సిన్ కార్యక్రమాన్ని 14-15 సంవత్సరాల బాలికల కోసం ఏర్పాటుచేయగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.డి.రామారావు పర్యవేక్షణ చేశారు. గర్భాశయ క్యాన్సర్, ఇతర సంబంధిత క్యాన్సర్లను నివారించడానికి అత్యంత ప్రభావవంతమైన టీకా హెచ్.పి.వి. వ్యాక్సిన్ అని, ఇది 14-15 సంవత్సరాల బాలికలకు క్యాన్సర్ కారక వైరస్ల నుండి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలోని 14-15 సంవత్సరాల వయసు గల బాలికలు అందరూ తమ తల్లి లేదా తండ్రి వెంట స్కూల్ ఐడెంటి కార్డ్ (వయసు నిర్ధారణ కొరకు) తప్పక తీసుకుని వచ్చి వ్యాక్సిన్ వేయించుకోవాలి. చాలా విలువైన ఈ వ్యాక్సిన్ ను బాలికలలో సర్వైకల్ (గర్భాశయ ) క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందస్తుగా నివారించడానికి ఉపయోగపడుతుందన్నారు. మంగళవారం వ్యాక్సిన్ తీసుకున్న బాలికలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా. డి. రామారావు, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. నరేందర్, ఆర్.ఎం.ఓ. డా.రాంబాబు హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం తెలంగాణా డయాగ్నస్టిక్ హబ్‌ను డిఎంఅండ్‌హెచ్‌ఓ సందర్శించి అక్కడి సేవలను పరిశీలించారు. పరీక్షలు చేయించుకోడానికి వచ్చిన రోగులతో మాట్లాడారు.

## ప్రియదర్శిని విద్యార్థినులకు క్రియేటివ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలు



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః స్థానిక ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రముఖ సంస్థ క్రియేటివ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలకు ఎంపికై కళాశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఎంపికైన విద్యార్థినులు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, వెబ్ డెవలపర్ హోదాల్లో సంవత్సరానికి రూ.4 లక్షల వేతనంతో నియామకం పొందారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు విద్యార్థినుల విజయాన్ని అభినందించారు. విద్యార్థినులు మంచి ఉద్యోగాలను సాధించడం వెనుక అధ్యాపకుల నిరంతర శ్రమ, మార్గదర్శనం, కళాశాల నిర్వహణ అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు ఈ స్థాయికి చేరుకోవడానికి కళాశాల అధ్యాపకులు అందించిన మార్గదర్శనం, నిరంతర శిక్షణ, ప్లేస్మెంట్ కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషించాయని పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ తరగతులు, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ వంటి కార్యక్రమాలు విద్యార్థినులను ఉద్యోగావకాశాలకు సిద్ధం చేస్తున్నాయని, తమ కళాశాల ఎల్లప్పుడూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం సాధించిన విద్యార్థినులు భవిష్యత్తులో తమ ప్రతిభతో సంస్థలో మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు కళాశాల ప్రతిష్టను మరింత పెంచాలని, మొత్తం 84 మంది విద్యార్థినులు రిజిస్టర్ అవ్వగా 15 మంది ఎంపిక కావడం వారి కృషి, పట్టుదల,ప్రతిభకు నిదర్శనమని అన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ కష్టపడి చదివితే, లక్ష్యంతో ముందుకు సాగితే మంచి అవకాశాలు తప్పకుండా వస్తాయని తమ కళాశాల విద్యార్థినులు మరోసారి నిరూపించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని, ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఎంపికైన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ తివారి మన్మోహన్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బొగ్గారపు రామయ్య కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ నామ పరామర్శ



ఖమ్మం, మార్చి 17(మనం న్యూస్)ః ఖమ్మం కార్పొరేషన్, ఇల్లందు రోడ్ లోని ప్రగతి ప్రైడ్ కాలనీకి చెందిన బొగ్గారపు రామయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. స్వగృహానికి వెళ్లి రామయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్ తో పాటు పొట్ల హరినాధ్ బాబు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ మన్నే బాలకృష్ణ, గుంటుపల్లి రఘు బాబు, యనమద్ది రాధాకృష్ణ, దేవభక్తని హేమంత్, బీఆర్ఎస్ నాయకులు వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న తుమ్మల



దమ్మపేట, మార్చి 17(మనం న్యూస్) ః దమ్మపేట మండలం గొర్రె గుట్ట గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ స్వామి వారిని కోరారు. అనంతరం వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డ ప్రసాద్, కాసాని నాగప్రసాద్, మంగేశ్వరరావు, దమ్మపేట మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.

### లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తాటి

దమ్మపేట మండలం గొర్రెగుట్ట గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి వారి స్వయంభూః క్షేత్రము ఏకాదశ 11వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు తాటి వెంకటేశ్వర్లుని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ వారికి స్వామి వారి కళ్యాణం కోసం ఐదు వేల రూపాయలు అందజేశారు. ఆలయ చైర్మన్ అడపా రామకృష్ణ, ఓబులేని సత్యం, పుడరీకాక్ష, దనేకుల కృష్ణారావు, పైడి లక్ష్మణ్, వాడే వీరాస్వామి, రామారావు, భద్రం, తదితరులు పాల్గొన్నారు.

## గృహ ప్రవేశంకు వస్త్రాలు అందజేసిన కాంగ్రెస్‌నేతలు



ములుగు,మార్చి 17మనం ప్రతినిధి : మంగపేట మండలంలోని దోమేడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో ఒకటి ఇందిరమ్మ ఇళ్లకు అర్హత కలిగిన లబ్ధిదారులు తోరుగు జయలక్ష్మి నాగయ్యల ఇల్లు గృహ ప్రవేశంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, మాజీ పిఎసిఎస్ చైర్మన్ తోట రమేష్,జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్ర బాబు,మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కొంకతి సంబశివారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలన్న,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పల్నాటి సంతోష్, మాజీ ఎంపీటీసీ కొమరం సారయ్య, గ్రామ అధ్యక్షులు సప్పిడి వెంకటేశ్వర్లు, మహ్మద్ ఆశీ, అచ్చలు, కొమరం కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణకు మాజీ ఎంపీ నామ నివాళి



తల్లాడ, మార్చి17(మనం న్యూస్)ః తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఇఓ మోరంపూడి సత్యనారాయణ మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్వగృహానికి చేరుకుని సత్యనారాయణ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వారి సోదరుడు మోరంపూడి ప్రసాద్ రావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరు జీవన్ కుమార్, తల్లాడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీను, దుగ్గిదేవర అజయ్, బీఆర్ఎస్ నాయకులు నాయుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కనకయ్య, శెట్టిపల్లి లక్ష్మణరావు, వెంకటరెడ్డి, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### జగ్గారెడ్డి లాంటి మాస్ లీడర్ పిసిసి ప్రెసిడెంట్ అయితే

# తెలంగాణలో 100 సీట్లు గెల్చుకుంటాం



సంగారెడ్డి మార్చి 17 మనం న్యూస్ ప్రతినిధి : జగ్గారెడ్డి లాంటి మాస్ లీడర్ టీపీసిసి ప్రెసిడెంట్ అయితే వచ్చే ఎన్నికల్లో తెలంగాణ లో 100 సీట్లు గెలవడం పక్కా అని సోమవారం ఆర్ అండ్ బి మినిస్టర్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశాడు. అసెంబ్లీ లాబీల్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ లో సీనియర్ లీడర్, రెండు తెలుగు రాష్ట్ర ల్లో పాపులర్ లీడర్. పి జనార్దన్ రెడ్డి ( పి జె ఆర్) లాగా మాస్ ఫాలోయింగ్ ఉన్న వ్యక్తి జగ్గారెడ్డి అని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చిట్ చాట్ లో పేర్కొన్నారు. జగ్గారెడ్డి పిసిసి అధ్యక్షుడు అయితే వచ్చే ఎన్నికల్లో తెలంగాణ లో 100 సీట్లు గెలవడం పక్కా అని ఆయన ఉద్ఘాటించారు. అధిష్టానం ఆ దిశగా ఆలోచన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జగ్గారెడ్డి లాంటి వ్యక్తి పిసిసి అధ్యక్షుడు గా ఉండాల్సిన అవసరం ఉందని, రాష్ట్రం లో కింది స్థాయి కార్యకర్త మొదలుకుని పై స్థాయి నాయకుల వరకు అందరిని కలుపుకుని పోయె వ్యక్తి జగ్గారెడ్డి మాత్రమేనని ఆయన అన్నారు. గతం లో సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షులు అయిన సందర్భం లో సైతం పిసిసి అధ్యక్షుడు గా జగ్గారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. పిసిసి అధ్యక్ష పదవి తనకు కావాలని సైతం బహిరంగంగానే జగ్గారెడ్డి అధిష్టానాన్ని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నేతలంతా ప్రత్యేకంగా పిసిసి అధ్యక్షుడి గా జగ్గారెడ్డి పేరు ప్రతిపాదిస్తున్న నేపథ్యం లో అధిష్టానం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన



దుగ్గొండి.మార్చి 17 (మనం న్యూస్)ః జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుగ్గొండి నందు సైన్ సర్కిల్లో భాగంగా పాఠశాలలో మెంటరింగ్ రిటైర్డ్ ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ రఘు వర్మ ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల జిజ్ఞాస కలిగించడానికి వివిధ అంశాలను విశదీకరించడం జరిగింది... దుగ్గొండి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఏ రామస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ పట్ల విద్యా పట్ల అవగాహన నిర్వహించిన. ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ రఘువర్మ డాక్టర్ కూరపాటి రాధిక ఎమ్మెస్ ...వివిధ రకాలైనటువంటి నావిగేషన్ సిస్టములు భారత్ యొక్క నావిక్ సిస్టం వివిధ రకాలైనటువంటి ఉపగ్రహాల ప్రయోగాలు వాటి ఉపయోగాలు వంటి అనేక అంశాలను తెలియజేయడం జరిగింది అదేవిధంగా ఒక రోల్ మోడల్ గా మారడానికి ఏ విధంగా కష్టపడి చదవాలో తెలియపరచడానికి సైంటిస్ట్ తో సహా డాక్టర్ కూరపాటి రాధిక ఎమ్మెస్ ఒబేసిటీ వరంగల్ నుండి విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులతో వివిధ రకాలైనటువంటి ఆరోగ్య సమస్యలు శారీరక మానసిక ఆరోగ్యం సామాజిక ఆరోగ్యం వండి అంశాలను తెలియజేస్తూ ఏ విధంగా నడవడిక ఉండాలో విద్యార్థిని విద్యార్థులకు ఏ విధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయో సమాజం మిమ్మల్ని అనుకరించడానికి ఏ విధంగా నడవడికను అలవర్చుకోవాలో తెలియపరచడం జరిగింది తదనంతరం ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ రఘు వర్మ ని, డాక్టర్ కూరపాటి రాధికా ఎమ్మెస్ ను సత్కరించడం జరిగింది.

## 'బాలార్జున'కు ఉగాది సాహితీ పురస్కారం



అమలాపురం మార్చి 17 మనం న్యూస్ : తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా కవి వక్త వ్యాఖ్యాత వ్యాసకర్త ప్రశంసాపత్రాల రచయిత తెలుగు భాషోపాధ్యాయులు బాలార్జున సత్యనారాయణను చైతన్య సారస్వత పరిషత్, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ ఉగాది సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. అంబాజీపేటలో జరిగిన ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో చైతన్య సారస్వత పరిషత్ అధ్యక్షులు కెవివి సత్యనారాయణ రాజు చైతన్య రాజు ప్రతినిధులు శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ ఈ పురస్కారాన్ని అందించి ప్రసాంశ పత్రం బహుకరించి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## స్వర్ణాంధ్రలో ఘనంగా ప్రారంభమైన హ్యాకథాన్ పోటీలు



నరసాపురం, మార్చి 17 (మనం న్యూస్) : నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీరింగ్ సంస్థ అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ మద్దతుతో నిర్వహిస్తున్న జాతీయస్థాయి హ్యాకథాన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి. సత్యనారాయణ, ట్రెజరర్ కె. వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, యాజమాన్య సభ్యులు టి.వి.వి. ప్రసాద్, ఎస్. కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. గోపిచంద్, ఏఐఎమ్ఎల్ విభాగాధిపతి డాక్టర్ బొమ్మ రామకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఫ్రాన్సిస్ లూథర్ కింగ్, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారుఈ కార్యక్రమానికి ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి, ఏఎస్ఎంఈ ఆసియా హెడ్ ఎస్. గణేష్, ఏపీఎస్సిహెచ్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఏఎస్ఎంఈ ప్రతినిధులు జి. నందగోపాల్, ఎల్. అశ్వాత్, డాక్టర్ సుశాంత్ కుమార్ సాహూ, డాక్టర్. వి. శివరామన్ ఈ హ్యాకథాన్ నిర్వహణలో పాల్గొంటున్నారు. ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ బొమ్మ రామకృష్ణ, డాక్టర్ ఫ్రాన్సిస్ లూథర్ కింగ్ నిర్వహణ ప్రధాన బాధ్యతలను డాక్టర్ రావి లలిత నారాయణ, డాక్టర్ జి. సుధాకర్, డాక్టర్ పి.ఎస్.ఎన్. రాజు, ఆర్.వి. మణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొంటున్నారు.

### నిరుపయోగంగా తాళ్ళరేవు
## చెరువుగట్టు సెంటర్ బస్సు షెల్టర్



ముమ్మిడివరం, మార్చి 17, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మండల కేంద్రమైన తాళ్లరేవులో చెరువుగట్టు సెంటర్ వద్ద దాతలచే ఏర్పాటు చేయబడిన బస్ షెల్టర్ నిరుపయోగంగా తయారైంది. ఈ బస్సు షెల్టర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొత్త రాజారావు జ్ఞాపకార్థం వారి కుమారులచే నిర్మించబడి, ప్రజలు మరియు ప్రయాణికుల ప్రయోజనార్థం అందుబాటులోకి వచ్చింది. దాతలు మహోన్నత లక్ష్యంతో, సామాజిక బాధ్యతతో బస్సు షెల్టర్ సదుపాయాన్ని కల్పించినా ప్రయాణికులు, ప్రజలు ఉపయోగించకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని బస్సు షెల్టర్లు నిర్మించాల్సి ఉంది.అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, చెరువుగట్టు సెంటర్ బస్ షెల్టర్ సమీప ప్రాంతాన్ని శుభ్రపరచి,ప్రజలకు వినియోగంలోకి తేవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో
## మజ్జిగ వితరణ కేంద్రం ప్రారంభం



ముమ్మిడివరం, మార్చి 17, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన తాళ్లరేవులో సంతపేట కూడలి వద్ద వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో కూర్మదాసు అయ్యన్న షాప్ వద్ద మజ్జిగ వితరణ కేంద్రాన్ని ప్రారంభించారు.వేసవికాలం అంతా మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కపుల్స్ అధ్యక్షురాలు గుండు సీత, కార్యదర్శి కొమ్మూరి మాల,కోశాధికారి సామా పూర్ణ,సామా ప్రకాష్,అద్దేపల్లి సత్తిరాజు,పెకేటి సతీష్,సామా లావణ్య,కంచర్ల రామోజీ మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ముంపు సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



కాట్రేనికోన, మార్చి 17 మనం ప్రతినిధిః కాట్రేకోన మండలం తీర ప్రాంత సమీపంలో ఉన్న వరిచేలు సముద్రపు నీరు పోటు ఎత్తడంతో పండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నిళ్ళుగా ఇదే పరిస్థితి రావడంతో వరి పొలాలు పండించడం మానేశారు. మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు రైతులు, అధికారులు తో కలిసి సత్తెమ్మ చెట్టు సమీపంలో ఏటుగట్టు ను పరిశీలించి సమస్య పరిష్కారం కొరకు అధికారులు తో చర్చించారు. కార్యక్రమం లో ఇరిగేషన్ డి ఈ జనార్దన్, ఏ ఈ పవన్, తహసీల్దార్ రవి కిరణ్, ఏ ఓ మృదుల, ఎఫ్ డి ఓ చల పతి, రాష్ట్ర మత్స్యాశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్, ఫిషరీస్ డైరెక్టర్ విత్తనాల బుజ్జి నీటి సంఘం డైరెక్టర్ వాసంశెట్టి రాజేశ్వరరావు, సుంకర బుజ్జి, బండారు యేసు, రంగరాజు, కాట్రేనికోన సొసైటీ డైరెక్టర్ మోకా అప్పాజీ, మండల టిడిపి యూత్ అధ్యక్షుడు వంగా దుర్గ బాబు, టిడిపి నాయకులు పచ్చిమట్ల సూర్యనారాయణ రాజు,( పి ఎస్ ఎన్ రాజు ), వనసర్ల నాగేశ్వరరావు, శీలం సూర్యనారాయణ, సానబోయిన నాగేశ్వరావు, జంగా శ్రీనివాసరావు, గుబ్బల చంద్ర రావు, కోటిపల్లి సత్యనారాయణ, సానబోయిన వెంకటేశ్వర రావు, కూటమి నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం

అమలాపురం మార్చి 17 మనం న్యూస్ : రాష్ట్రమంతటా దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంబుధవారం ప్రారంభమయ్యే దివ్యాంగ ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాలలో స్థానిక శాసనసభ్యులు మరియు ఇతర ప్రజాప్రతినిధులచే ప్రారంభించబడునని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపారు.

## పోడూరు మండలంలో విషాదం పిల్లి సంపతరావు కన్నుమూత

### మాజీ ఎంపీటీసీ,వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్( అధ్యక్షులు) పిల్లి నాగన్నకి పితృవియోగం

పోడూరు మర్చి17 మనం న్యూస్ : పోడూరు మండలం గుమ్మలూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ (అధ్యక్షులు) పిల్లి నాగన్న తండ్రి పిల్లి సంపతరావు (79) మంగళవారం సాయంత్రం 4 గంటలకు పరమపదించారు .ఈ వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.సాధారణ రైతు జీవితం గడిపినా, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావంతో సంపతరావు గ్రామంలో ప్రత్యేక స్థానం సంపాదించారు. ఎవరికి కష్టం వచ్చినా ముందుండే వ్యక్తిగా గుర్తింపు పొందారు. అలాంటి వ్యక్తి అకస్మాత్తుగా లేకపోవడం గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.ఆయనకు భార్య పిల్లి రత్నమ్మ, కుమారుడు పిల్లి నాగన్న, ముగ్గురు కుమార్తెలు. అలాగే నలుగురు మనవళ్లు, ఆరుగురు మనవరాళ్లు ఉన్నారు.కుటుంబానికి ఆధారంగా నిలిచిన సంపతరావు మృతి ఆ కుటుంబాన్ని తీరని దుఃఖంలోకి నెట్టింది.ఈ విషాద వార్తను తెలుసుకున్న వైఎస్సార్సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పిల్లి నాగన్నను పరామర్శించారు.ఇలాంటి నష్టాన్ని భరించడం చాలా కష్టం మీ తండ్రి జ్ఞాపకాలు ఎప్పటికీ మాతోనే ఉంటాయి అంటూ ధైర్యం చెప్పారు.సంపతరావు లేకపోవడం కేవలం కుటుంబానికే కాదు, గ్రామానికీ తీరని లోటు. ఆయన చిరునవ్వు, ఆయన మాటలు ఇక వినిపించవని ఆలోచన గ్రామస్థులను మరింత కృంగదీస్తోంది. ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ అందరి మనసుల్లో నిలిచిపోతాయి.అనటంలో ఎలాంటి సందేహం లేదు.



### వాకర్స్ క్లబ్, పాలకొల్లు తరపున
## పలు సేవా కార్యక్రమాలు



పాలకొల్లు, మార్చి 17,మనం ప్రతినిధిః నిస్సహాయులకు సాయం చేయడం అంటే సమాజం పట్ల మన బాధ్యతను నెరవేర్చడమేనని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. మంగళవారం క్లబ్ సభ్యులతో కలిసి పలువురికి సాయం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, జవ్వాజి కల్యాణ్, నేతల రమేష్ తదితరులు పాల్గొన్నారు. జిన్నూరు గ్రామానికి చెందిన పేద యువతి కాటం శుభశ్రీ కి ఉపాధి నిమిత్తం 8 వేల రూపాయల విలువైన కుట్టు మిషన్, యలమంచిలి గ్రామానికి చెందిన కోటిపల్లి పూజిత శారీరక ఎదుగుదల సమస్యతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం 6 వేల రూపాయల ఆర్థిక సాయం,పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన కుక్కల వేపాలస్వామి అనారోగ్యం తో బాధపడుతుండడంతో అతనికి 4 వేల రూపాయల మందులు క్లబ్ తరపున అందించారు.

## ఇండ్లస్థలాల పోరాటానికి రాష్ట్ర కార్యదర్శిని రామకృష్ణ ఆహ్వానం

యు. కొత్తపల్లి,మనం న్యూస్ (పిఠాపురం) : రాజమండ్రిలో16తేదినుండి 18తేదివరకు జరుగుతున్న మున్సిపల్ కార్మికుల6 మహాసభ కి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్యను పిఠాపురం కార్యదర్శి సాకా రామకృష్ణ కలిసి నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు బాధితుల ఇబ్బందులు గురించి వివరించి నియోజకవర్గానికి రావాలని తెలపగారాష్ట్ర పిలుపులో భాగంగా ఈనెల 24వ తేదీన జరిగే ఇళ్ల స్థలాల ముంజూరుకోసంతలపెట్టిన కార్యక్రమం అయిన తర్వాత పిఠాపురం వస్తున్నట్లుగా హామీ ఇవ్వడం జరిగిందని మంగళవారం పత్రిక ప్రకట ద్వారా సాకారామకృష్ణ తెలిపారు.

### గాలికుంటు వ్యాధిటీకాలు
## పాల్గొన్న జాయింట్ డైరెక్టర్ శ్రీధర్



ఏలేశ్వరం,మార్చి, 17(మనం న్యూస్)ః ఏలేశ్వరం మండలం బద్రవరం గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమం పశువర్ధక శాఖ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాటి పశువులకు స్థానిక నాయకుల సమక్షంలో వ్యాధి సంరక్షణ దిశగా గాలికుంటు టీకాలు వేశారు. జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గాలికుంటు టీకాలను రైతులు తప్పనిసరిగా పాడి పశువులకు వేయించాలని, పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలచంద్ర యోగేశ్వర్ ,భద్రవరం గ్రామ సర్పంచ్ కునపరెడ్డి సుబ్బారావు, టిడిపి నాయకులు జగటాపు సూరిబాబు, బిజెపి నాయకులు పోలినాటి బుజ్జి,, గ్రామ నాయకులు పశు వైద్య సిబ్బంది ,పాడి రైతులు, పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీల గోడౌన్లలో ఆర్డీవో తనిఖీలు




నరసాపురం, మార్చ్ 17 (మనం న్యూస్)ః నరసాపురం పట్టణంలోని భారత్ గ్యాస్, హెచ్.పీ గ్యాస్ కంపెనీల గోడౌన్లలో మంగళవారం నరసాపురం ఆర్డీవో దాసి రాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో దాసిరాజు గ్యాస్ సిలిండర్ల నిల్వలను తనిఖీ చేశారు. ఈరోజు వచ్చిన సిలిండర్ల సంఖ్య, వినియోగదారులకు పంపిణీ చేసిన సిలిండర్ల సంఖ్య, నిల్వ ఉన్న గ్యాస్ సిలిండర్ సంఖ్యలను స్టాక్ రిజిస్టరులో పరిశీలించారు. ఈరోజు వినియోగదారు లకు గ్యాస్ పంపిణీకి సంబంధించిన రసీదులను ఆయన ఆరా తీశారు. సంబంధిత గ్యాస్ కంపెనీల యాజమాన్యా నికి, డెలివరీ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితులను అనుగుణంగా ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా గ్యాస్ పంపిణీ చేపట్టాలని దీనిపై ప్రత్యేక టీములను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజల నుండి ఏ విధమైన ఫిర్యాదులు వచ్చినా గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో హెచ్చరించారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీకి ఒక అధికారిని నియమించడం జరిగిందని ప్రజలు ఎవరికైనా గ్యాస్ విషయంలో ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్ 8121676653 కు కాల్ చేయవలసిందిగా ఆర్డీవో సూచించారు. ఈ తనిఖీలలో ఆయన వెంట తాసిల్దార్ ఐవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆచంట గ్రామీణ రహదారులు అద్వాన్నం



- కూటమి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్ర రావు

ఆచంట మార్చి 17 న్యూస్ః నియోజకవర్గ కేంద్రమైన ఆచంట పరిధిలోని అన్ని గ్రామాలలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కొడమంచిలి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచందర్రావు అన్నారు ఈ సందర్భంగా ఆయనమనం న్యూస్ విలేకరితో మాట్లాడుతూఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన కనీసం కొడమంచిలి గ్రామీణ రహదారులు సైతం అభివృద్ధికి నోచుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికైనా తల్లి కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుండి ఎదిగిన ప్రస్తుత తెలుగుదేశం పార్టీ ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ గ్రామీణ రోడ్ల అభివృద్ధికి దృష్టి సాధించాలని ఆయన డిమాండ్ చేశారు సంబంధిత అధికారుల సమక్షంలో నాణ్యతా ప్రమాణాలతో రోడ్లు అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కొడమంచిలిగ్రామ పరిధిలోని మెట్లపాడు దళిత వాడలలోఆ ప్రాంత గ్రామీణ ప్రజలు మట్టి ఇటుకలతో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవలసిన దౌర్భాగ్యం కూటమి ప్రభుత్వ హయాంలో ఏర్ప డిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు ఈ సమస్యలపై టిడిపి జనసేన బిజెపి పెద్దలు దృష్టి సారించాలని లేకుంటే తీవ్ర ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## వాహన తనిఖీలు చేసిన జగ్గంపేట సీఐ



గండేపల్లి మార్చి 17( మనం న్యూస్ )ః గండేపల్లి మండలం గండేపల్లి గ్రామంలో జగ్గంపేట సీఐ బి తిరుపతి రావు ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్సై శివ నాగబాబు మరియు సిబ్బంది మంగళవారం సాయంత్రం గండేపల్లి రహదారిపై వెళ్తున్న ద్విచక్రవాహనదారులను ఆపి వాహనాదారులకు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి, ఇన్సూరెన్స్, వంటి పత్రాలను పరిశీలించారు. అదేవిధంగా హెల్మెట్ ధరించడం వాళ్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తూ. రోడ్డు ప్రమాదాల నివారించేందుకు వేగ పరిమితులను పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులకు సీఐ సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీలు ముఖ్యంగా ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా తీసుకుని చర్యలుచేపట్టిస్తున్నామని తెలిపారు.

## రాజపూడి డ్వాక్రా యానిమేటర్పై చర్యలు తీసుకోవాలి



జగ్గంపేట మార్చి 17 ( మనం న్యూస్)ః కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి గ్రామం లో కృప మహిళా శక్తి సంఘం గ్రూపు 2022లో 15 లక్షల రూపాయలు లోన్ తీసుకోవడం జరిగింది. తీసుకున్నప్పటినుంచి 32 నెలలు ఒక్కొక్కరు 3,100/- చొప్పున నెలకు 31,000/- రూపాయలు కట్టి త్వరగా తీరిపోతుందని నెలకు 4,100/- చొప్పున నెలకు 41,000 ప్రెసిడెంట్ తీసుకువెళ్లి యానిమేటర్ హైమావతి కి ఇవ్వడం జరిగింది. కానీ గత 20 నెలల నుంచి లోను కట్టడం మానివేసి సుమారు 7 లక్షల 75 వేల రూపాయలను మాయంచేసి ఇప్పుడు ఏమి చేసుకుంటారో చేసుకోండి అని అంటే ఈరోజు గ్రూప్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కలిసి వారి సమస్యను విన్నవించుకున్నారు మంగళవారం మధ్యాహ్నం వారికి జగ్గంపేట ఏపిఎం వారికి వినతి పత్రం అందజేశారు.

### శిరగట్లపల్లి దళిత పేటకు
## దక్కని నీరు



అల్లవరం మార్చి 17 మనం న్యూస్ ప్రతినిధి: ప్రజలందరికీ తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కోట్లాది రూపాయలు కేటాయించి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి పైప్ లైన్లు, కొళాయిలు నిర్మిస్తుండగా కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, దళిత వాడకు తాగునీరు అందని పరిస్థితి తలెత్తుతోంది.. వివరాల్లోకి వెళితే అల్లవరం మండలం మొగల్లమూరు గ్రామంలో మొత్తం నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. ఇందులో జాంబవాని పేటలో ఒక ఓవర్ హెడ్ ట్యాంకు, మెయిన్ రోడ్డులో ఒక ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. బీసీ ఓసీ ప్రాంతానికి సరిపడేలా మరొక ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. ఎస్సీ ప్రాంతం అయిన శిరగట్ల పల్లి కు నూతనంగా మరో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించియున్నారు. శిరగట్లపల్లిలో ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి అదనంగా అగ్నికులక్షత్రులకు అనుమతి లేని లేఅవుట్లు నివసిస్తున్న బెండమూర్లంక గ్రామపంచాయతీకి చెందిన ఇంటి పన్ను లేదు అప్రూవల్ లేదు అయినా అనుమతి లేకుండా మంచినీరు కనెక్షన్ ఇస్తున్న సర్పంచ్ రాయుడు విష్ణు మరో పైప్ లైన్ వేయడం వల్ల శిరగట్లపల్లిలోని దళితులు ఉండే ప్రాంతానికి తాగునీరు అందని పరిస్థితి తలెత్తింది.

### స్వామి దయానంద ఆశ్రమానికి
## హాట్ బాక్స్,సీలింగ్ ఫ్యాన్ అందజేత



ఏలేశ్వరం,మార్చి17, (మనం న్యూస్ ): ఏలేశ్వరం పట్టణంలో క్వారిపేటలో ఉన్న స్వామి దయానంద ఆశ్రమానికి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా వాగు సుజాత 4వేల రూపాయలు విలువ చేసే హాట్ బాక్స్,రాతికింద వెంకట కృష్ణారావు బ్రదర్స్ 3వేల రూపాయల విలువ చేసే సీలింగ్ ఫ్యాన్,గొల్లపూడి త్రిమూర్తులు విద్యార్థులకు పెన్నులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాగు రాజేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజేష్ మీడియాతో మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆశ్రమానికి హాట్ బాక్స్ ఫ్యాను అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అలాగే దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఉభయగోదావరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గొల్లపూడి త్రిమూర్తులు, సిహెచ్సి చైర్మన్,ఆర్యవైశ్యుల మండల అధ్యక్షుడు వాగు రాజేష్, నరసింహ,ఊర నానాజీ,వీరబాబు, బాబా,కటకం కిరీటి, బుజ్జిబాబు, స్కూల్ చైర్మన్ శ్రీను,వాగుబద్రిష్, వాగు రాకేష్, డొక్కా సీతమ్మ సేవా సంస్థ సభ్యులు సిరి ఫుడ్ కృష్ణ, కుర గోవిందు, హాస్టల్ వార్డెన్ నల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వాటికి కాలమే జవాబిస్తుంది..

● టీవీకే నేత వ్యాఖ్యలపై రజనీకాంత్



**చెన్నై, మార్చి 17:** అగ్ర నటుడు రజనీకాంత్ రాజకీయ ప్రయత్నాలపై ఇటీవల టీవీకే నేత మాట్లాడిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వివాదంపై తాజాగా రజనీకాంత్ స్పందించారు. అవన్నీ అసత్య ప్రచారాలేనంటూ కొట్టిపారేశారు. అన్నిటికీ కాలమే జవాబిస్తుందన్నారు. అసలేం జరిగిందంటే..

నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ ఆదవ్ అర్జున ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రజనీకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన రాజకీయాల్లో ప్రవేశించేందుకు ప్రయత్నించిన సమయంలో డీఎంకే పార్టీ రజనీపై బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు. ఈ విషయంలో తాను నటుడిపై విమర్శలు చేయాలనుకోవట్లేదని, ఇలాంటి ఒత్తిళ్లకు తమ నేత విజయ్ తలొగ్గరని చెప్పడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను డీఎంకే పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. రాజకీయ లబ్ధి కోసమే టీవీకే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు. అటు రజనీకాంత్ అభిమానులు కూడా తీవ్రంగా మండిపడ్డారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

ఈ క్రమంలోనే తాజాగా రజనీకాంత్ ఎక్స్ వేదికగా స్పందించారు. ''టీవీకేలో ఉన్నతస్థాయిలో ఉన్న నేత నాపై చేసిన వ్యాఖ్యలు అసత్యం. ఆయన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నాకు మద్దతుగా నిలిచిన రాజకీయ, సినీ ప్రముఖులు, మీడియా మిత్రులు, అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఈ విషయంలో నేను చెప్పేది ఒక్కటే.. కాలం మాట్లాడకపోవచ్చు కానీ, సరైన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తుంది'' అని తన పోస్ట్‌లో స్పష్టం చేశారు.

2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు రజనీ రాజకీయ ప్రవేశంపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. 'రజనీ మక్కళ్ మండ్రం' పేరుతో రాజకీయ పార్టీ పెట్టనున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. వీటికి 2020లో ఆయన ఫుల్‌స్టాప్ పెట్టారు. అనారోగ్య కారణాల వల్ల తాను రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనను విరమించుకుంటున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. ఇదిలా ఉండగా 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలను ప్రకటించనున్నారు.

# టీఎంసీ అభ్యర్థుల జాబితా విడుదల



**కోల్‌కతా, మార్చి 17:** వచ్చే నెలలో పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేశారు. ఎన్నికల్లో 294 స్థానాలకు గాను 291 స్థానాల్లో టీఎంసీ పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. డార్జిలింగ్ ప్రాంతంలోని 3 స్థానాల్లో అనిత్ థాపా నేతృత్వంలోని బీజీపీఎం పోటీ చేయనున్నట్లు తెలిపారు. భవానీపూర్ నుంచి తాను ఎన్నికల బరిలో దిగుతున్నట్లు మమత వెల్లడించారు. బీజేపీ తరఫున ఆ స్థానం నుంచి ప్రస్తుత శాసనసభలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. భవానీపూర్ మమత సొంత నియోజకవర్గం. 2011 నుంచి మూడుసార్లు విజయం సాధించారు.

సువేందు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న నందిగ్రామ్‌లో టీఎంసీ పవిత్ర కర్‌ను బరిలోకి దింపింది. గతంలో టీఎంసీ నుంచి బీజేపీలో చేరిన పవిత్ర కర్ అభ్యర్థుల జాబితా విడుదల కావడానికి కొన్ని నిమిషాల ముందే టీఎంసీలో తిరిగి చేరడం ఆసక్తికరంగా మారింది. గతంలో మమతకు నమ్మకస్తుడిగా ఉన్న సువేందు 2021 ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలోకి దిగి నందిగ్రామ్‌లో టీఎంసీ అధినేతను దాదాపు 2,000 ఓట్ల తేడాతో ఓడించారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీలోకి తిరిగి ప్రవేశించడానికి మమత భవానీపూర్ నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. తమ పార్టీ అభ్యర్థుల జాబితా ప్రకటించిన అనంతరం మమత మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తమ పార్టీ 226 కంటే ఎక్కువ సీట్లలో విజయం సాధిస్తుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన గంటల వ్యవధిలోనే రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీ సహా పలువురు కీలక అధికారులపై ఈసీ వేటు వేయడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో ఘర్షణలు సృష్టించడానికే బీజేపీ ఈ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఆ పార్టీ తరఫున ఈసీ మంచి గేమ్ ఆడుతోందని.. బీజేపీ కోసం ఎన్నికల అధికారులే ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో జరగకూడని ఘటనలు జరిగితే అందుకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# రష్యా వదిలేసిన 'టైమ్‌బాంబ్'

● రెండు దేశాలకు భయంభయం..!

**మాస్కో,మార్చి 17:** నడి సముద్రంలో రష్యా వదిలేసిన ఓ 'చమురు బాంబ్' రెండు దేశాలను కలవరపెడుతోంది. డ్రోన్ దాడిలో సగం కాలిన చమురు నౌక పర్యావరణ వినాశనానికి దారితీస్తుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆ రెండు దేశాలు ఆందోళనకు గురవుతున్నాయి. అసలు ఏం జరిగిందంటే..?

రష్యా జెండాతో ఉన్న ఆర్కిటిక్ మెటాగాజ్ చమురు నౌకపై మార్చి 3న దాడి జరిగింది. మధ్యధరా సముద్రంలో ప్రయాణిస్తుండగా తటస్థ జలాల్లో ఈ నౌకపై డ్రోన్లతో దాడులు చేశారు. ఈ విషయాన్ని రష్యా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మార్చి 11న మీడియాకు వెల్లడించింది. మాల్టాకు ఆగ్నేయాన 168 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపింది. ఉక్రెయిన్ నావెల్ డ్రోన్లు ఈ దాడికి పాల్పడినట్లు ఆరోపించింది. అయితే, దీనిపై కీవ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ముర్మాన్‌స్కోలోని రష్యన్ ఆర్కిటిక్ పోర్టు నుంచి ఈజిప్టు వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకొంది. దాడి సమయంలో నౌకలో 30 మంది సిబ్బంది ఉండగా.. వీరిలో కొందరు గాయపడ్డారు. లైఫ్‌బోట్ సాయంతో వీరు అందులో నుంచి బయటపడ్డారు. ఆయిల్ ట్యాంకర్‌ను అక్కడే వదిలేసి సిబ్బంది వెళ్లిపోయారు. అయితే, నౌకలో 900 మెట్రిక్ టన్నుల డీజిల్, 60వేల మెట్రిక్ టన్నుల లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ఉంది. ఇప్పుడిదే భయాందోళనలు కలిగిస్తోంది.

ప్రస్తుతం ఈ నౌక మాల్టా, ఇటలీ తీరాల మధ్య తేలియాడుతోంది. సగం కాలిపోయి ఒకవైపునకు ఒరిగినట్లుగా ఉన్న నౌక దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇందులో నుంచి చమురు సముద్రంలోకి లీకవుతోంది. అంతర్జాతీయ జలాల్లోనే నౌకపై దాడి జరిగినప్పటికీ బలమైన గాలుల కారణంగా ఇది ఇటలీ తీరానికి కొట్టుకొచ్చే ప్రమాదం ఉందని ఆ దేశ ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేస్తోంది. చమురు, గ్యాస్‌తో నిండి ఉన్న ఈ నౌక 'టైమ్ బాంబ్'తో సమానమేనని, దాన్ని తమ దేశ పోర్టులకు తీసుకురావొద్దని ఇటలీ మంత్రులు తమ ప్రధాని జార్జియా మెలోనీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. మరోవైపు, మాల్టా కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ నౌక కారణంగా పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్లోబల్ కన్జర్వేషన్ ఆర్గనైజేషన్ 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఈ చమురు ట్యాంకర్ సముద్రంలో మునిగితే.. సముద్ర జీవరాశికి ముప్పు తప్పదని హెచ్చరించింది. అంతేగాక, సుదీర్ఘకాలం నీటి కాలుష్యంతో పాటు క్రయోజనిక్ మేఘాలు ఏర్పడే ప్రమాదం ఉందని అంచనా వేసింది.



## అమెరికా యుద్ధ నౌకలో అగ్నిప్రమాదం



● వందలాది సైనికులకు అస్వస్థత

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా కొనసాగిస్తోన్న ఆపరేషన్‌లో అమెరికా విమాన వాహక నౌక జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఎర్రసముద్రంలో తనవంతు సహకారాన్ని అందిస్తోంది. ఇటీవల ఈ నౌకలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఘటనను అమెరికా సైనిక అధికారులు ధ్రువీకరించారు.

న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం.. వారం క్రితం జెరాల్డ్ నౌకలోని ప్రధాన లాండ్రీ విభాగంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అనంతరం వెంటిలేషన్ డక్ట్ ద్వారా ఇతర భాగాలకు మంటలు వ్యాపించాయి. నౌకలోని పలు ప్రదేశాల్లో దాదాపు 30 గంటల పాటు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో పలు కంపార్ట్‌మెంట్లలో ఉన్న అమెరికా సైనికులు, నావికులు విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఘటన జరిగిన సమయంలో నౌకలో 4,500 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 600 మంది సెయిలర్ల పడకలు అగ్నికి ఆహుతి అయ్యాయి. 30 గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాణ నష్టానికి సంబంధించి ఎటువంటి సమాచారం వెలువడలేదు.


నౌకలో తీవ్రంగా మంటలు చెలరేగినప్పటికీ పెద్ద నష్టం జరగలేదని అమెరికా సైనిక అధికారులు వెల్లడించారు. విమాన వాహక నౌక పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్నారు. అస్వస్థతకు గురైన సిబ్బందికి చికిత్స అందిస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదానికి గురైన కంపార్ట్‌మెంట్లను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాధారణంగా అమెరికాకు చెందిన విమాన వాహక నౌకలు సుమారు ఏడు నెలల పాటు సముద్రంలో మోహరించి ఉంటాయి. అయితే యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో పది నెలలుగా జెరాల్డ్ పలు ప్రదేశాల్లో మోహరిస్తూ సముద్రంలోనే ఉంది.

మొదట మధ్యధరా సముద్రంలో పనిచేసిన ఈ నౌకను వెనెజువెలాపై దాడి సమయంలో కరేబియన్‌కు మళ్లించారు. ఆ తర్వాత ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా వైపు తరలించారు. ప్రస్తుతం ఈ నౌక ఎర్ర సముద్రం నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా ఓడరేవు వైపు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువకాలం సముద్రంలో మోహరించి ఉండడం వల్ల ఇందులో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

## జేడీయూకు కేసీ త్యాగి రాజీనామా

### నితీష్‌తో విడిపోయిన 50 ఏళ్ల బంధం

**పాట్నా, మార్చి 17:** బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జేడీయూ సలహాదారు, నీతీశ్ సన్నిహితుడు కేసీ త్యాగి పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైన మరుసటి రోజే త్యాగి ఈ నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం.



జేడీయూ జాతీయ కార్యదర్శి, పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేసిన త్యాగి ఆ పార్టీ అవతరించినప్పటి నుంచి కొనసాగుతున్నారు. నీతీశ్ కుమార్‌తో దాదాపు 50 ఏళ్లు కలిసి రాజకీయాల్లో పనిచేశారు. తాజాగా జేడీయూ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోలేదని ప్రకటించిన ఆయన నీతీశ్‌తో మాత్రం అనుబంధం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాజకీయాలపై ఆయన దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏదైనా పార్టీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం.

# డీజిల్ కొరత..

## థాయిలాండ్‌లో అంత్యక్రియలపై ప్రభావం

**బ్యాంకాక్, మార్చి 17:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతుండటంతో ఇంధన కొరతపై అనేక దేశాల్లో ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. దీని ప్రభావం తాజాగా థాయిలాండ్‌లో అంత్యక్రియల పైనా పడింది. డీజిల్ కొరత కారణంగా ఇక్కడి ఓ ప్రముఖ క్షేత్రంలో జరిగే దహన సంస్కారాలను నిలిపివేశారు. నఖోన్ ఫానోమ్‌లోని ఓ ప్రధాన పుణ్యక్షేత్రమైన వాట్ మహాథాట్‌లో డీజిల్, కరెంటుతో పర్యావరణానికి అనుకూలమైనవిధంగా అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఇందులోభాగంగా ప్రతి దహన సంస్కారానికి సుమారు 90 లీటర్ల డీజిల్‌ను వాడతారు. తాజా సంక్షోభం నేపథ్యంలో ఇక్కడి గ్యాస్ స్టేషన్లలో



నిబంధనలను కఠినతరం చేశారు. వ్యక్తిగత కొనుగోళ్లను 500 థాయ్ బాట్(థాయ్ కరెన్సీ)లకు పరిమితి విధించారు. కంటైనర్లు, డ్రమ్ముల్లో ఇంధనం నింపడాన్ని నిషేధించారు. ఈ క్రమంలోనే ఆలయ సిబ్బందికి డీజిల్ లభించడం కష్టమైంది. దీంతో అంత్యక్రియల కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ నిబంధన నిరుపేదల దహన సంస్కారాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కంటైనర్లలో ఇంధనం కొనుగోలుకు క్షేత్రాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇక, ఇంధనం కొరత నేపథ్యంలో అనేక గ్యాస్ స్టేషన్లలో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. అత్యవసర సేవల పైనా దీని ప్రభావం పడిందని ఓ ఫౌండేషన్ పేర్కొంది. అంబులెన్స్ సర్వీసులు కూడా తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తంచేసింది.



## నయనతారపై అనుచిత వ్యాఖ్యలు

### చిక్కుల్లో ఎంపీ సీవీ షణ్ముగం

**చెన్నై, మార్చి 17:** ప్రముఖ నటి నయనతారపై తమిళనాడు ఎంపీ ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎంకే స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఆమె ప్రస్తావన తెచ్చి, వివాదంలో చిక్కుకున్నారు. అదికూడా.. మహిళల భద్రతకోసం నిర్వహించిన నిరసనలో పాల్గొని ఆయన మాట్లాడిన మాటలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం విల్లుపురంలో ఎన్డీయే కూటమి ఈ నిరసన కార్యక్రమం నిర్వహించింది.

''మీ కలలను మాకు చెప్పండి.. వాటిని నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది'' అంటూ ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. దీనిని ఉద్దేశించి అన్నాడీఎంకే నేత, రాజ్యసభ ఎంపీ సీవీ షణ్ముగం మాట్లాడుతూ..''అబ్దుల్ కలాం మనల్ని కలలు కనమన్నారు. మన కలలను తనతో పంచుకోమని ఆయన (స్టాలిన్‌ను ఉద్దేశించి) అడుగుతున్నారు. నాకు నయనతార కావాలని అడిగితే.. ఆయన నెరవేరుస్తారా..? ఆమెను పెళ్లి చేసుకోవాలనే కల ఎవరికైనా ఉంటే తీరుస్తారా..?'' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ''మా విధానాలను విమర్శించండి. కానీ, మహిళల గురించి అనుచితంగా మాట్లాడకండి. నయనతారను అవమానించడం ద్వారా మహిళలందరినీ అవమానించారు. ఈ వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు'' అని డీఎంకే పార్టీ తీవ్రంగా స్పందించింది. ఆ ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. షణ్ముగం అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటి సారి కాదు. గతంలోనూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మహిళల ప్రస్తావన తెచ్చి తీవ్ర విమర్శల పాలయ్యారు.

# పాఠశాలలో టవల్తో అమ్మాయిల డ్యాన్స్

● ఎన్‌హెచ్ఆర్సీ సీరియస్

**కోల్‌కతా, మార్చి 17:** కోల్‌కతాలోని ఓ పాఠశాల ఈవెంట్లో ఇద్దరు మైనర్ అమ్మాయిలు టవల్‌తో స్టేజీ మీద డ్యాన్స్ చేయడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జాతీయ మానవ హక్కుల చట్టం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్కూల్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు బాలీవుడ్ పాటలకు డ్యాన్స్‌లు చేశారు. ఇందులో భాగంగా హీరోయిన్‌ను అనుకరించే క్రమంలో వారు టవల్స్‌లో కన్పించడం గమనార్హం. దీనిపై ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు అందింది. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో, సామాజిక మాధ్యమాల్లో మైనర్ బాలికలతో ఇలాంటి అసభ్యకరమైన ప్రదర్శనలను ఇప్పించడం నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్సీ స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది.




# ఆ కారణంతో ప్రసూతి సెలవులు నిరాకరించొద్దు

● సుప్రీంకోర్టు కీలక తీర్పు

**ఢిల్లీ , మార్చి 17:** ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని తీర్పులో పేర్కొంది. ఆ బిడ్డ వయసుతో సంబంధం లేకుండా ఆ తల్లికి 12 వారాల సెలవు పొందడానికి అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని వ్యాఖ్యానించింది.

''దత్తత తీసుకున్న బిడ్డకు కన్నబిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ప్రసూతి సంరక్షణ కనీస హక్కు'' అని పేర్కొంది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు (మూడు నెలలు) వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది.



# నేను ఏదైనా చేయగలను..

## క్యూబా స్వాధీనంపై ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్‌తో యుద్ధాన్ని కొనసాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా క్యూబాను స్వాధీనం చేసుకోవడంపై దృష్టిసారించారు. ఆ ద్వీప దేశాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని వ్యాఖ్యానించారు. క్యూబా వ్యాప్తంగా విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ.. 'క్యూబాను స్వాధీనం చేసుకునే అవకాశం నాకు దక్కుతుందని నేను బలంగా నమ్ముతున్నాను. అది చాలా గొప్ప విషయం. అది నాకు పెద్ద గౌరవం. దాన్ని స్వాధీనం చేసుకోగలను. దానితో నేను ఆశించినది ఏదైనా దక్కించుకోగలను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా అమెరికా చమురు ఆంక్షల నేపథ్యంలో క్యూబాలో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. దీంతో 9.6 మిలియన్ల మంది ప్రజలు అంధకారంలో చిక్కుకుపోయారు. అమెరికా ఆంక్షల వల్ల గత మూడు నెలలుగా క్యూబాకు ఎలాంటి భారీ ఇంధన రవాణా జరగలేదని క్యూబా అధ్యక్షుడు మిగెల్ దియాజ్ కానెల్ గతవారం పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు ఆ దేశ సంబంధిత శాఖ తాజాగా వెల్లడించింది.



# యూఏఈలో గ్యాస్ క్షేత్రమే లక్ష్యంగా దాడి

**దుబాయి, మార్చి 17:** పర్షియన్ గల్ఫ్ చుట్టూ ఉన్న ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని 'షా' గ్యాస్ క్షేత్రం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగగా అధికారులు అక్కడి కార్యకలాపాలను నిలిపివేశారు. గ్యాస్ క్షేత్రంపై జరిగిన డ్రోన్ దాడితో పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు అక్కడి మీడియా పేర్కొంది. దట్టమైన పొగ వ్యాపించిందని వెల్లడించింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది అతికష్టంమీద వాటిని అదుపులోకి తీసుకొచ్చారని తెలిపింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టంచేశారు. దాడిలో గ్యాస్ క్షేత్రానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు అక్కడ జరిగే కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.



ఇదిలాఉండగా.. యూఏఈ తూర్పు తీరంలో ఉన్న ఒక చమురు ట్యాంకర్‌పై క్షిపణి దాడి జరిగింది. మంగళవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ పేర్కొంది. ఫుజైరా సమీపంలోని ఒమన్ గల్ఫ్‌లో ఆ నౌక ఉన్నట్లు తెలిపింది. దాడి కారణంగా ట్యాంకర్ స్వల్పంగా దెబ్బతిన్నట్లు వెల్లడించింది. అయితే, ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొంది. ఇరాన్ ఈ క్షిపణి దాడికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తంచేసింది. దాడిపై అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించారని ఈ ప్రాంతం మీదుగా వెళ్తున్న నౌకలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- వార్తలాప్ వర్క్ షాప్ తో జర్నలిస్టులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన
- పి ఐ బి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్



**సంగారెడ్డి, మార్చి 17 (మనంప్రతినిధి):** ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా తయారవుతున్న కంటెంట్, తప్పుదారి పట్టించే చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వార్తలాప్ పేరుతో జర్నలిస్టులకు ఒకరోజు వర్క్షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్షాప్ను ప్రారంభించారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ వర్క్షాప్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందన్నారు. చిన్న తప్పుదారి పట్టించే సమాచారం కూడా సమాజంలో భయం, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు.మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంలాంటిదని పేర్కొన్నారు.ప్రభుత్వ పాలసీలు, పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆమె అన్నారు. జర్నలిస్టులు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వార్తలను అందించాలని సూచించారు. ఈ తరహా వర్క్షాప్లు జర్నలిస్టులు నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకుని తమ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు ఖచ్చితంగా చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న ఈ కాలంలో తప్పుడు వార్తలను గుర్తించి ఖండించడంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ముఖ్యమైన బాధ్యత నిర్వర్తిస్తున్నదని తెలిపారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. లింగ సమానత్వం , మహిళల సంక్షేమ పథకాలపై సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల మాట్లాడుతూ, లింగ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, పిల్లల్లో సరైన దృక్పథాన్ని తల్లిదండ్రులు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై అవగాహన కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకమని చెప్పారు. జర్నలిజంలో ఏ ఐ వినియోగంపై సత్యప్రియ వివరించారు. నోట్బుక్ కేఎల్ఎం, చాట్ జీపీటీ, గూగుల్ పిన్పాయింట్, ఎలెవన్ లాబ్స్, జెమినీ ఏ ఐ వంటి పలు ఏ ఐ సాధనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. అయితే ఏ ఐ వేదికలపై వ్యక్తిగత లేదా సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్క్షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు పి ఐ బి అదనపు డైరెక్టర్ జనరల్ సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు మరియు అభిప్రాయాలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

# అబద్ధపు హామీలతో అందలమెక్కిన కాంగ్రెస్



- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- బిజెపి నాయకుల డిమాండ్

**నేరేడుచర్ల, మార్చి 17 మనం న్యూస్:** అబద్ధపు హామీలతో అందలమెక్కిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని భారతీయ జనతా పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. నేరేడుచర్ల పట్టణ,మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గత సాధారణ ఎన్నికల్లో గెలవడం కోసం 420 హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చినాక హామీలను విస్మరించింది అని అందులో ప్రధాన హామీలు అయిన రైతు భరోసా,మహిళకు నెలకు 2500/-,గ్యాస్ సబ్సిడీ,ఆసరా ఫెన్షన్ ల పెంపు,ఉచిత గృహ వినియోగ విద్యుత్ వంటి అంశాలతో పాటు ప్రదానంగా నిరుద్యోగులకు నెలకు 1000/- ఫెన్షన్,ఉద్యోగాల భర్తీ లో వెంటనే అమలు చేయాలని ప్రభుత్వం అలసత్వంవీడి ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప రాబోయే రోజులు బీజేపీ పెద్ద ఎత్తున ప్రభుత్వం పై ప్రజాపోరాటం చేస్తుందని బీజేపీ పట్టణ,మండల కమిటీలు ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. ఇట్టి హామీలు వెంటనే అమలు చేయాలని మండల కమిటి,పట్టణ కమిటిఅధ్యక్షులుకొ ణతం.నాగిరెడ్డి, చింతకుంట్ల. రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ సురిగి సైదులు గౌడ్ కు మున్సిపల్ కమీషనర్ చెన్నబోయిన నాగరాజులకు మంగళవారం వినతి పత్రాలు అందించారు.

ఇట్టి కార్యక్రమం లో పట్టణ ప్రధాన కార్యదర్శులు ఏమిరెడ్డి,శంకర్రెడ్డి, కాలం. నాగయ్య, పల్లెపంగ. వీరబాబు,జిల్లా కోశాధికారి తాళ్ల.నరేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, ఇతర జిల్లా,మండల, పట్టణ నాయకులు ఉరిమల్ల రామూర్తి, ఆకుల జగతయ్య, కొప్పులక్ష్మినారాయణ,కొప్పులరాంరెడ్డి,నందిపాటిహి ందూజా,ాంపెల్లి.నారాయణరెడ్డి,దేవిరెడ్డి.నాగిరెడ్డి, అంజయ్య, కాల్వ.సైదులు,వినయ్ తదితరులు జరిగినది.

## విద్యుత్ సరఫరా సమస్యలపై రైతులతో ముఖాముఖి



**పాలకీడు, మార్చి 17 (మనం న్యూస్):** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజు లలో భాగంగా మండల పరిధిలో జాన్పాడు గ్రామంలో మంగళవారం విద్యుత్ అధికారులు గ్రామ ప్రజలనుండి ,రైతులు నుండి విద్యుత్ సరఫరాపై ,సమస్యలపై వివరాలను అడిగి తెలుసుకుంటున్న విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో లైన్మెన్ సైదా రాజు, లైన్ ఇన్స్పెక్టర్ పిచ్చయ్య, పాష, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో డిజిటల్ హెల్త్ కార్డుల అమలుకు సమగ్ర యాక్షన్ ప్లాన్



- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జీజీహెచ్ వరకు పూర్తి ఏర్పాట్లు

**సంగారెడ్డి, మార్చి 17 మనం ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడానికి డిజిటల్ హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు,జిల్లా వైద్య అధికారులతో డిజిటల్ హెల్త్ కార్డు ప్రక్రియసమర్థవంతంగా ఎలా అమలు చేయాలనే అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ.ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన ఆరోగ్య సేవలు అందించడంలో డిజిటల్ హెల్త్ కార్డులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి హెల్త్ ఐడి నమోదు జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రాజెక్ట్ అమలు పై అవగాహన, అవసరమైన సిబ్బంది ,పరికరాలు, ప్రాథమిక నివేదిక ను సిద్ధం చేయాలన్నారు.జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని వైద్యాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు తగిన సిబ్బంది నియామకం, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, ఓపీ కేంద్రాలను సిద్ధం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఎం వసంతరావు , వైద్యాధికారులు డాక్టర్ శశాంక్, డాక్టర్ నాగ నిర్మల ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి



**సూర్యాపేట, మార్చి 17 (మనం ప్రతినిధి):** 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేస్తూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు.ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం హుజూర్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్,పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు.పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు. ప్రజలు కలిసి పనిచేయాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సందర్శించి కిచెన్ షెడ్డు, త్రాగునీరు, టాయిలెట్స్ వంటశాల, 6వ తరగతి విద్యార్థులతో తెలుగు పాఠం చదివించి మ్యాథ్స్ చేయించారు. అదేవిధంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. స్కూల్ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న స్కూల్ గదులను వాటి వివరాలను అడిగి తెలుసుకుని దానిని తొలగించి, సదనం చేయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ తహసిల్దార్ కవిత. ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలన

హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి,సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, జిల్లా ఉద్యానవన అధికారి నాగయ్య, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగు మందులపై అవగాహన



**భీమదేవరపల్లి, మార్చి 17 మనం న్యూస్:** భీమదేవరపల్లి లో రైతులకు పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించారు. మంగళవారం రోజున నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి హాజరై రైతుల అవగాహన సదస్సు ర్యాలీలో పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూ రైతులు పంటను పరిశీలించి పరిస్థితి తీవ్రమైతేనే పురుగు మందులు పుష్కారి చేయాలని సూచించారు. పంటలపై పురుగుమందులు పిసికారి చేసేటప్పుడు రైతులు రక్ష చర్యలను పాటించాలని తప్పకుండా రక్షణ దుస్తులు ముఖానికి మనసుకు తలకు హెల్మెట్ పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు తోపాటు కళ్ళకి అద్దాలు చేతుల గ్లౌజులు కాళ్లకు బూట్లు ధరించి పిష్కారి చేయాలని రైతులను కోరారు.

రైతులు ఎరుపు రంగు గుర్తు కలిగినటువంటి మోనో ఇతర మందులను వాడరాదని పర్యావరణానికి హాని కలిగించే పురుగు మందులు వాడకం తగ్గించి కషాయాలు వాడాలని, రెండు మూడు రకాల పురుగుమందుల కాంబినేషన్లో మిశ్రమాలను వాడొద్ద అని బిసిఐ సమన్వయకర్తలు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు సాయికిరణ్ తిరుపతి రజిత సోని ఉపసర్పంచ్ శనిగరం ఐలయ్య వార్డు సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ హాస్పిటల్ లల సాధారణ ప్రసవాలు పెంచాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**మేళ్లచెరువు మార్చి 17 మనం న్యూస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణ లో భాగంగా వైద్య నిపుణలచే ప్రతి పి హెచ్ సి లో మెడికల్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుందనీ వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. దీనిలో భాగంగా మంగళవారం మేళ్ల చెర్వు పి హెచ్ సి లో జరిగే మెడికల్ క్యాంప్ ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మెడికల్ క్యాంప్ ల ద్వారా జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, మహిళలకు గర్భశాయ ముఖ కాన్సర్ ను గుర్తించే టాప్ స్ప్రెయర్, కంటికి సంబందించి కాంట్రాక్ట్ లోపం,బి పి షుగర్, చిన్న పిల్లలో ఎత్తు, పోషకాహార లోపాలకు చెందిన వైద్య నిపుణులు రోజుకొక్క పి హెచ్ సి కి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించటం తో పాటు ఆరోగ్యం మెరుగు పడేలా పలు సూచనలు ఇస్తారని, ఇంకా ఏమైనా శస్త్ర చికిత్స లు చేయాల్సివచ్చిన, మెరుగైన వైద్యం కోసం జనరల్ హాస్పిటల్ కి రిఫర్ చేయటం జరుగుతుందని అన్నారు. మంగళవారం మేళ్లచెర్వు లో నిర్వహించిన మెడికల్ క్యాంప్ లో 300 మంది ఓపి నమోదు అయ్యారని తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న తీరు పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పిహెచ్ సి లలో సాధారణ ప్రసవాలు పెరిగేలా ప్రజలను ఆహగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ మేళ్లచెర్వు మండల కేంద్రం లోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ లో కలెక్టర్ హాస్టల్ లోని గదులను వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులను ప్రతి రోజు వంట బాగుంటుందా ? మెను ప్రతిరోజు అమలు చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదవతరగతి వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్ట్ లో కనీసం 70 శాతానికి పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొనిరావాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ మాధవ్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యులు యస్వంత్, మణి, ప్రజ్ఞ, సాయి శ్రీ, వెంకటేష్, సమీర, మెడికల్ అధికారి, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఇన్చార్జి తహసిల్దార్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి, ఉప సర్పంచ్, సిబ్బంది, ఉన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగస్వాములు కావాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**చేవెళ్ల, మార్చి 17 (మనం న్యూస్):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 15,16వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ బండారు శైలజా ఆగిరెడ్డిలతో కలిసి ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను తెలుసుకుని వాటిని ప్రణాళికబద్ధంగా గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈనెల 6న ప్రారంభమై జూన్ 2న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. వార్డుల్లో నెలకొన్న వివిధ సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పార్టీలకతీతంగా ముందుకు వచ్చి మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుంటూ ప్రభుత్వ నిధులు మంజూరు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్స్ మద్దెల శ్రీనివాస్, మూడవత్ నాయక్, నర్సింలు, గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మంగలి బాలరాజ్, మాజీ సర్పంచులు ప్రభాకర్, బీమయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

- ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత




**రాజన్న సిరిసిల్ల, మార్చ్ 17(మనం ప్రతినిధి ):** రాజీ మార్గమే రాజ మార్గమని, కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు బి.పుష్పలత అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు సముదాయంలో రాజన్న సిరిసిల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారమవడం ద్వారా ప్రజలు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందుతారని తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు లోక్ అదాలత్లో మరిన్ని కేసులను పరిష్కారానికి పంపేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల/ఇన్చార్జి కార్యదర్శి, పి.లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై అమెరికా చేస్తున్న యుద్ధాన్ని ఆపాలి

- అమెరికా యుద్ధ నీతి పట్ల మోదీ మౌనం వీడాలి
- వీరనారి మల్లు స్వరాజ్యం వర్ధంతిని జయప్రదం చేద్దాం
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు

**పెన్ పహాడ్, మార్చి 17 (మనం న్యూస్):** ఇరాన్ పై అమెరికా సమాజ్యవాదం చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో నెమ్మాది మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల పై తన ఆధిపత్యాన్ని సాగించడం కొరకు ఆయుధ పట్టును పశ్చిమ దేశాల పై తన పట్టును కొనసాగించే క్రమంలో ఆయిల్ నిక్షేపాలను యదేచ్చగా కొల్లగొట్టేందుకు ఇరాన్ పై ఇజ్రాయెల్ ను రెచ్చగొట్టి గత 15 రోజులుగా అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ పై భీకర యుద్ధం కొనసాగించడం వల్ల వేలాది మంది ప్రజలు, పిల్లలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు గతంలో కూడ ఇరాక్, లిబియాలపై యుద్ధం చేసి ఆ దేశ అధ్యక్షులను పట్టుకొని చంపిందనీ, వెనుజుల అద్యక్షుడు మధుకరో ను బంధించి జైలులో పెట్టారని వారు బ్రతికి బయటకు వచ్చే అవకాశాలు ఎంత మాత్రం లేవన్నారు అదే విధంగా ఈ యుద్ధాల వల్ల ప్రపంచ దేశాలపై తీవ్రమైన ఆర్థిక సంక్షోభం వస్తుందనీ ఆర్థిక వేత్తలు హెచ్చరికలు చేస్తున్న మోడీ ప్రభుత్వం మౌనంగా ఉంటుందని ఆయన అన్నారు ప్రపంచ వ్యాప్తంగా ఆయిల్, గ్యాస్ కొరత ఏర్పడిందని ఆ ప్రభావం మన దేశంలో మరింతగా కొరత ఏర్పడి ప్రజలు పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల వద్ద రద్దీ పెరిగిందని విచారం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వీరవనిత మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో విజయ్ పంక్షన్ హాల్ లో ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం... భారత్ పై ప్రభావం అనే అంశంపై పై సెమినార్ జరుగుతుందని ప్రధాన వక్తగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరుకానున్నారని తెలిపారు పట్టణంలోని ప్రముఖులు, మేధావులు, విద్యార్థులు వామ పక్ష నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు ఈ సమావేశం లో సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, గుర్రం గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి గోపి రెడ్డి నందిగామ సైదులు, తదితరులు పాల్గొన్నారు.



# రుసల్ కమిషన్లు ప్రపంచంలోనే మొట్టమొదటి ఇనర్ట్ యానోడ్ ఎలక్ట్రోలైజర్

- లార్జ్-స్కేల్ గ్రీన్ అల్యూమినియం ఉత్పత్తికి మార్గం తెరుస్తోంది


**రాజమండ్రి, మార్చి 17:** ప్రపంచంలోని ప్రముఖ అల్యూమినియం ఉత్పత్తిదారులలో ఒకరైన రుసల్, ఇనర్ట్ యానోడ్లను ఉపయోగించే మొదటి పారిశ్రామిక ఎలక్ట్రోలైజర్ను ప్రారంభించింది, ఇది పెద్ద ఎత్తున గ్రీన్ అల్యూమినియం ఉత్పత్తి వైపు కీలకమైన అడుగును సూచిస్తుంది. కొత్త యూనిట్ రష్యాలో విస్తృతంగా ఉపయోగించే స్మెల్టింగ్ టెక్నాలజీని భర్తీ చేయడానికి రూపొందించబడింది, ఇది ఇప్పటికే ఉన్న ఉత్పత్తి మౌలిక సదుపాయాలను డీకార్బొనైజ్ చేయడానికి ఆచరణాత్మక మార్గాన్ని ప్రదర్శిస్తుంది. ఈ ప్రయోగంతో, పారిశ్రామిక పరీక్షల నుండి వాణిజ్య అమలులోకి జడ యానోడ్ టెక్నాలజీని తరలించిన ప్రపంచవ్యాప్తంగా మొదటి కంపెనీగా రుసల్ అవతరించింది. సీవో2 ఉత్పత్తి చేయబడినప్పుడు కార్బన్ ఆనోడ్లతో సాంప్రదాయ ప్రక్రియల మాదిరిగా కాకుండా, జడ యానోడ్లతో విద్యుద్విశ్లేషణ స్వచ్ఛమైన ఆక్సిజన్ను మాత్రమే విడుదల చేస్తుంది. ఈ సాంకేతికతను ఉపయోగించి ఉత్పత్తి చేయబడిన ప్రతి టన్ను అల్యూమినియంకు, దాదాపు 900 కిలోగ్రాముల ఆక్సిజన్ వాతావరణంలోకి విడుదల అవుతుంది, ఇది స్మెల్టింగ్ ప్రక్రియ నుండే ప్రత్యక్ష గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను తొలగిస్తుంది. ఈ మైలురాయి యొక్క ప్రాముఖ్యత సాంకేతికతలోనే కాదు, ఇప్పటికే ఉన్న పారిశ్రామిక ఆస్తులకు దాని వర్తింపులోనూ ఉంది. ప్రస్తుతం దాని స్మెల్టర్లలో పనిచేస్తున్న వేలాది ఎలక్ట్రోలైజర్లతో, రుసల్ ఇప్పుడు ప్రపంచ అల్యూమినియం పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆధునీకరణ కార్యక్రమాలలో మొదటి దశను ప్రారంభించింది. జడ యానోడ్లను ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలలో అనుసంధానించడం ద్వారా, కంపెనీ గ్రీన్ అల్యూమినియంను స్కేల్లో ఉత్పత్తి చేయడానికి వాస్తవిక మార్గాన్ని సృష్టిస్తోంది - కొత్త సౌకర్యాలలో మాత్రమే కాకుండా, రష్యా యొక్క అల్యూమినియం ఉత్పత్తి సామర్థ్యం అంతటా. రుసల్ యొక్క కస్టమర్లకు, ఈ అభివృద్ధి వ్యూహాత్మక విలువను కలిగి ఉంటుంది. జడ యానోడ్ టెక్నాలజీతో ఉత్పత్తి చేయబడిన అల్యూమినియం పరిశ్రమలో అత్యల్ప కార్బన్ పాదముద్రలను అందిస్తుంది, తయారీదారులు నిజంగా స్థిరమైన సరఫరా గొలుసులను నిర్మించడానికి వీలు కల్పిస్తుంది. గ్లోబల్ రెగ్యులేటర్లు ఎంబెడెడ్ కార్బన్ ఉద్గారాలపై అవసరాలను కఠినతరం చేస్తున్నందున, అటువంటి పదార్థాలకు ప్రాప్యత చాలా కీలకం అవుతుంది. రసెల్ యొక్క జడ యానోడ్ అల్యూమినియం కస్టమర్లు అత్యంత కఠినమైన నియంత్రణ ప్రమాణాలను తీర్చడానికి మరియు వారి స్వంత ఉత్పత్తులను - ఆటోమోటివ్ భాగాల నుండి ఆహార ప్యాకేజింగ్ వరకు - తక్కువ-కార్బన్ పరివర్తనలో నాయకులుగా ఉంచడానికి అనుమతిస్తుంది. సాంకేతికత ఇప్పటికే పైలట్ దశను దాటిపోయింది. 2017 నుండి, రుసల్ క్రమపద్ధతిలో జడ యానోడ్ విద్యుద్విశ్లేషణను అభివృద్ధి చేసింది, సుమారు 6,000 టన్నుల వాణిజ్య-గ్రేడ్ అల్యూమినియం (ఎ7, లేదా పీ1020) ను ఉత్పత్తి చేస్తుంది మరియు స్థిరమైన ప్రక్రియ స్థిరత్వం మరియు ఉత్పత్తి నాణ్యతను ప్రదర్శిస్తుంది.

# మహిళలపై దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ ఎంపీ




**అల్లవరం మార్చి 17 మనం న్యూస్ ప్రతినిధిః** టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న తిరుపతిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన మహిళలపై టీడీపీ గూండాలతో దాడి చేయించడం, అనంతరం తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడటం వంటి దుర్మార్గ చర్యలకు నిరసనగా మంగళవారం అమలాపురం ఈదరపల్లి బ్రిడ్జి సమీపంలోని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చింతా అనురాధ మాట్లాడుతూ, తిరుమల తిరుపతి వంటి పవిత్ర పుణ్య క్షేత్రం గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇటీవల ఓ మహిళతో నడిపిన వ్యవహారం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ , బొమ్మి ఇజ్రాయిల్ , తోట త్రిమూర్తులు , అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మీ , అమలాపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ , రామచంద్రాపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ , పి. గన్నవరం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ , రాజోలు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి దేవి , వైయస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శులు, సిఇసి, ఎస్ ఇ సి మెంబర్లు, నియోజకవర్గ పరిశీలకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన విక్టరీ స్టడీ సర్కిల్



**కోటనందూరు మనం న్యూస్ మార్చి 17,** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం గత కొన్ని సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను నవోదయ పరీక్షలలో జిల్లాలో ప్రథమ స్థానం సంపాదిస్తూ ఈ సంవత్సరం కూడా జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కువ సీట్లు సాధిస్తూ స్టేట్ నెంబర్ వన్ గా ఈ సంవత్సరం కూడా విక్టరీ స్టడీ సర్కిల్ నిలిచింది .ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు , విక్టరీ అభిమానులు శ్రేయోభిలాషులు ఎంత ఆనందంతో సంతోషిస్తూ విక్టరీ స్టడీ సర్కిల్ ను, వారి బృందాన్ని అభినందించి మా పిల్లలకు మంచి భవిష్యత్తును ఇచ్చారని కొనియాడారు... ఈ సందర్భంగా విక్టరీ స్టాప్, డైరెక్టర్ పి చిన్ని ని విక్టరీ సాధించిన విద్యార్థులను అభినందించారు.

# గ్రీన్ గ్రిడ్ ట్రాన్స్ మిషన్ లైన్లను పర్యావరణ హితంగా టెక్నాలజీ ఎలా



**రాజమండ్రి, మార్చి 17:** దశాబ్దాలుగా, విద్యుత్ ట్రాన్స్ మిషన్ కు సంబంధించి మౌలిక సదుపాయాల విస్తరణ అనేది ఒక అనివార్యమైన అంశంగా అందరూ చూశారు. ఎత్తైన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం కోసం అడవులను తొలగించడం మరియు పచ్చని రమణీయ దృశ్యాలను తీసివేయడం అందరికి భారంగా అన్పించేది. కానీ ఇప్పుడు పరిస్థితుల్లో బాగా మార్పు వచ్చింది. పర్యావరణాన్ని కాపాడుకోవాలనే అవగాహన కూడా అందరిలో వచ్చింది. ప్రతిపాదిత గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 కింద దాదాపు 11 జీడబ్ల్యూ సౌరశక్తిని మరియు 7 జీడబ్ల్యూ పంప్డ్ నిల్వ సామర్థ్యాన్ని అనుసంధానించే ప్రణాళికతో ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోంది. దీనివల్ల గ్రీన్ గ్రిడ్ను నిర్మించడం కోసం అడవులను ఏమాత్రం తొలగించకుండా పనిపూర్తి చేయవచ్చని తెలుస్తోంది. ట్రాన్స్ మిషన్ ఇంజనీరింగ్లో పురోగతి వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తన విద్యుత్ నెట్ వర్క్ ను మరింతగా విస్తరించుకునేందుకు వీలు కల్పించింది. అదే సమయంలో విద్యుత్ లైన్ల ఏర్పాటు చేయడం కోసం పర్యావరణ సమతుల్యాన్ని తొలగించడం గణనీయంగా తగ్గిస్తుందని నిపుణులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతంలోని పెద్ద సౌర మరియు పవన ప్రాజెక్టులను విశాఖపట్నం మరియు విజయవాడ వంటి ప్రధాన డిమాండ్ కేంద్రాలకు అనుసంధానించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమయంలో విస్తృత రైట్-ఆఫ్-వే (ఖౌగి) కారిడార్లు, అధిక-వోల్టేజ్ లైన్లు చెట్లతో సంబంధంలోకి రాకుండా చూసుకోవడానికి వృక్షసంపదను తొలగించారు. ఎందుకంటే ఎత్తైనా టవర్లకు ఎక్కడా చెట్లు అడ్డురాకుండా భూమి చదునుగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. పవర్ ట్రాన్స్ మిషన్ విజయవంతం కావాలంటే బలమైన ప్రసార నెట్వర్క్ కీలకమని ఇంధన రంగ నిపుణులు చెప్తున్నారు. సీనియర్ విద్యుత్ రంగ నిపుణుడు సద్దాఫ్ ఆలం మాట్లాడుతూ, ఆధునిక టవర్ డిజైన్లు ఇప్పటికే పర్యావరణ అవాంతరాలను తగ్గించడంలో సహాయపడుతున్నాయని అన్నారు.'బాగా వెడల్పుగా ఉండే లాటిస్ టవర్లను ఏర్పాటు చేయడం కోసం గతంలో పెద్ద కారిడార్లను క్లియర్ చేయాల్సి వచ్చింది. టవర్ డిజైన్ లో వచ్చిన అద్భుతమైన మార్పుల వల్ల, ఇప్పుడు నిర్మాణాలకు చాలా తక్కువ గ్రౌండ్ స్పేస్ అవసరం పడుతుంది. ఇప్పుడిదే వాటిని అటవీ-స్నేహపూర్వకంగా మార్చేసింది. ఏపీ ట్రాన్స్ కో వంటి సంస్థలు ముఖ్యంగా దట్టమైన ప్రాంతాలలో ఇరుకైన-బేస్ టవర్లు మరియు మోనోపోల్లను ఎక్కువగా స్వీకరిస్తున్నాయి' అని ఆలం అన్నారు.అలం చెప్పిన దాని ప్రకారం, మోనోపోల్ టవర్లు దాదాపు 50-60 శాతం భూమి విస్తీర్ణాన్ని తగ్గించగలవు, వరుసగా ఉండే చెట్ల సమూహాలకు భంగం కలిగించకుండా ట్రాన్స్ మిషన్ లైన్లు ఇరుకైన కారిడార్ల గుండా వెళ్ళడానికి వీలు కల్పిస్తాయి. అటవీ ప్రాంతాల్లో, మోనోపోల్ టవర్లు ఇంజనీర్లకు ఎక్కువ సౌలభ్యాన్ని ఇస్తున్నాయి. నిర్మాణాలను సహజ క్లియరింగ్లలో లేదా తక్కువ దట్టమైన వృక్షసంపద ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయవచ్చు. ఇది అటవీ విస్తీర్ణం మరియు వన్యప్రాణుల ఆవాసాలకు ఆటంకం కలిగించడాన్ని గణనీయంగా తగ్గిస్తుంది' అని ఆయన జోడించారు. ఇక్కడ వచ్చిన మరో అద్భుతమైన టెక్నాలజీ అప్ డేట్ ఏంటంటే... అధిక-ఉష్ణోగ్రత తక్కువ-సాగ్ కండక్టర్ల వాడకం. సాంప్రదాయిక ట్రాన్స్ మిషన్ వైర్లు భారీ విద్యుత్ భారం కింద వేడెక్కినప్పుడు కుంగిపోతాయి. కానీ ఇప్పుడు వాటి భద్రత దృష్ట్యా విస్తృత వృక్షసంపద ఉండడం చాలా అవసరం.ఏపీ నుండి వసంత్ పంపించారు

# కోనసీమ సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను సందర్శించిన ప్రభుత్వ విప్



**ముమ్మిడివరం, మార్చి 17, మనం న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఉన్న కోనసీమ సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను మంగళవారం ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు సందర్శించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ అమలాపురం మరియు పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించే విధంగా ఇటువంటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఏర్పాటు చేసినందుకు హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు.హాస్పిటల్ లో అందిస్తున్న వైద్య సదుపాయాలు, ఆధునిక పరికరాలు మరియు రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

# శిరగట్లపల్లి దళిత పేటకు అందని తాగునీరు

- వేసవిలో ప్రజలు ఇక్కట్లు

**అల్లవరం మార్చి 17 మనంప్రతినిధిః** ప్రజలందరికీ తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కోట్లాది రూపాయలు కేటాయించి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి పైప్ లైన్లు, కొళాయిలు నిర్మిస్తుండగా కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం దళిత వాడకు తాగునీరు అందని పరిస్థితి తలెత్తుతోంది.. వివరాల్లోకి వెళితే అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామంలో మొత్తం నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. ఇందులో జాంబవాని పేటలో ఒక ఓవర్ హెడ్ ట్యాంకు, మెయిన్ రోడ్డులో ఒక ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. బీసీ ఓసీ ప్రాంతానికి సరిపడేలా మరొక ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. ఎస్సీ ప్రాంతం అయిన శిరగట్ల పల్లి కు నూతనంగా మరో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించియున్నారు.

శిరగట్లపల్లిలో ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి అదనంగా బీసీ, ఓసీ ప్రాంతాలకు మరో పైప్ లైన్ వేయడం వల్ల శిరగట్లపల్లిలోని దళితులు ఉండే ప్రాంతానికి తాగునీరు అందని పరిస్థితి తలెత్తింది.. ఇదంతా ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ పాలక వర్గం నిర్లక్ష్యం వల్లనే తాగునీటి సమస్యను దళితులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిభందనలకు వ్యతిరేకంగా వేసిన పైప్ లైన్ తొలగించి కేవలం దళిత ప్రజలున్నటువంటి ప్రాంతంలో నిర్మించిన ట్యాంకు నుంచి అదే ప్రాంతానికి నీరు దక్కేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

# ఇఫ్తార్ విందులో జాయింట్ కలెక్టర్



**అమలాపురం మార్చి 17 మనం న్యూస్:** మత సామరస్యం, ఆత్మీ యతకు ప్రతిక ఇఫ్తార్ విందని జిల్లా జాయింట్ కలెక్ట ర్ టి నిశాంతి అన్నా రు మంగళవారం స్థానిక సత్యనారాయణ గార్డెన్ నందు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ వారి ఆధ్వ ర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పా టు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆమె ము ఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

# ఆత్మహత్య కు అనుమతి ఇవ్వండి...దివ్యాంగుడు

- వికలాంగుడిపై వేదింపులు, ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతికి జిల్లా కలెక్టరుకు పిర్యాదు



**అల్లవరం మార్చి 17 మనం న్యూస్ ప్రతినిధి:** వికలాంగులకు ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధికి చేయుత నిస్తామని ప్రభుత్వం అన్ని రంగాల్లోని కూడా ఎంతో కృషిచేస్తుంది. పెంక్షన్లు, ఉచిత బస్సు, ఉద్యోగ అవకాశాలు ఇలా ఎన్నో అవకాశాలు కల్పిస్తుంది. అయితే ప్రభుత్వ అదికారులు చిన్నచూపు దివ్యాంగుడిపై చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాలుకెళితే అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామానికి చెందిన వికలాంగుడు కుంపట్ల రాము పెళ్లిచేసుకుని భార్య ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నడు. టైలరింగ్ పనులుచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ప్రభుత్వం ఇచ్చే పట్ట భూములు గృహం నిర్మంచుకుని ఉన్నాడు. అయితే కొందరు భూస్వాములు మరియు కొందరు ఓ కుటుంబానికి చెందిన వాళ్లు వికలాంగుడిఅయిన కుంపట్ల రాము ఖాళీ స్తలంపై కన్నువేసి భూకబ్జ చేసి ఆలయనిర్మనం చేపట్టారు. అయితే ఆలయ నిర్మానాన్ని అడ్డుకోవడం వికలాంగుడు చేసాడు. దాంతో కొందరు గతంలో దాడిచేసి హత్యయత్నం చేసారని, కేసును పలుకుబడితో ముందుకు వెల్లనీయలేదు. అయితే ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరిగుతూ అతనికున్న పట్టా, గతంలో ఒ.టి.యస్ రిజిస్ట్రేషన్ పత్రాలతో తహశీల్దారు కార్యాలయం, పోలీస్టేషన్ చుట్టు తిరుగుతు ఉన్నాడు. అధికారులు న్యాయం చేయడంతో అంతంత మాత్రంగ ఉన్నరని నా భూమిలో ఆలయనిర్మించి దానిపై ఏవిధమైన హక్కు లేని వారిపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడంతో పాటు రెవెన్యు అధికారులు తప్పడు నివేదికను ఇచ్చారని కలెక్టరుకు తెలిపాడు. విసుగుచెందిన వికలాంగుడు బార్యభర్తలతో డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్కు బార్యభర్తలు కలిసి వికలాంగుడికి జరుగుతున్న అన్యాయంపై వివరించి మా కుటుంబనికి ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతిఇవ్వాలని జిల్లా కలెక్టరుకు పిర్యాదుచేసారు. కలెక్టరు స్పందించి అమలాపురం ఆర్.డి.ఓను విచారన చేయాలని ఆదేసించారు.

# పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్గా బీహెచ్.భవాని శంకర్ బాధ్యతల స్వీకరణ



**యు. కొత్తపల్లి మనం న్యూస్ (పిఠాపురం) :** పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బిహెచ్.భవాని శంకర్ మంగళవారం పిఠాపురం పాడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఏవీఎం స్టడీస్ సెంటర్ నవోదయలో విజయ దుందుభి



**కోటనందూరు మనం న్యూస్ మార్చి 17:** కోటనందూరు మండలం కే ఈ చిన్నయ పాలెం గ్రామానికి చెందిన మత్తుర్తి యశ్వంత్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి వంద మార్కులకు గాను 98.75 మార్కులతో జిల్లా మూడో ర్యాంకుతో నవోదయ సీటును కైవసం చేసుకున్నాడు. కొత్త కొట్టం గ్రామానికి చెందిన గాడి లోకేశ్వర్ వంద మార్కులకు గాను 90 మార్కులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 37వ ర్యాంకును అదేవిధంగా కేఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి పురుషోత్తమరావు 86.25 మార్కులతోనూ 69వ ర్యాంకును అదేవిధంగా అదే గ్రామానికి చెందిన అడిగర్ల సాత్విక 88.75 మార్కులతో 31వ ర్యాంకును కైవసం చేసుకుని నవోదయ సీట్లు సాధించడం జరిగింది.

# ఏప్రిల్ 15 వరకూ గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

- జేసి నిశాంతి



**అమలాపురం మార్చి 17: మనం న్యూస్** గాలికుంటు వ్యాధిని 2030 నాటికి పూర్తిగా నియంత్రిం చాలని లక్ష్యంతో వ్యాధి నివారణ టీకాలు ఏడాదిలో రెండు సార్లు క్రమం తప్ప కుండా వేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాం తి తెలిపారు.గాలి కుంటు వ్యాధి నివా రణ టీకా కార్యక్రమ గోడ పత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆవిష్క రించారు.జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ టీకాల కార్యక్రమాన్ని మార్చి 16 నుండి ఏప్రిల్15 వరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 4 నెలల వయసు పైబడిన ఆవు, గేదె జాతి పశువులకు ఈ టీకాలు వేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

# పలేరియా కిట్లు పంపిణీ చేసిన సర్పంచ్



**అల్లవరం మార్చి 17 మనం ప్రతినిధిః** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం పలేరియా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని చిన్న చిన్న వ్యాధులు వచ్చినప్పుడు మన గ్రామంలో ఉన్నటువంటి గవర్నమెంట్ హెల్త్ సెంటర్ లకు వెళితే మెరుగైన వైద్యాన్ని ప్రభుత్వం మనకు అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, పాలకవర్గ ఓలేటి పరమేశ్వరరావు, చింతం శ్రీను, దొమ్మేటి రాధాకృష్ణ, హెల్త్ సుపర్వేజర్ సాపే సత్యనారాయణ, ఎమ్మెల్ హెచ్ పిలు, రాపాక సౌమ్య, నల్లి విజయ, ఏ ఎన్ ఎం లు, హెల్త్ అసిస్టెంట్ లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన శ్రీకాంత్



**అల్లవరం మార్చి 17 మన ం ప్రతినిధిః** అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామం లో సర్జరీ చేయించుకుని స్వగృహం లో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ను అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి నీ అడిగి తీసుకున్నారు.అదేవిధం గా సాపే కృష్ణ తల్లి సాపే లక్ష్మీ అకాల మృతికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులను శ్రీకాంత్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ,కొనుకు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద నోబాల్ వేసిన అక్తర్!

పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ అసద్ అక్తర్ క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద నోబాల్ వేశాడు! ఇది క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అతడు స్పాట్ ఫిక్సింగ్ కు ఏమైనా పాల్పడ్డాడా.. అని సోషల్ మీడియాలో క్రికెట్ అభిమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పాకిస్థాన్ లో దేశవాళీ టీ20 క్రికెట్ పోటీల సందర్భంగా మార్చి 14న కరాచీ బ్లూస్, లాహోర్ బ్లూస్ కు మధ్య పెషావర్ లోని




ఇమ్రాన్ ఖాన్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్ లో కరాచీ బ్లూస్ తరఫున ఆడిన అసద్ అక్తర్ తన బౌలింగ్ లో భాగంగా పెద్ద నోబాల్ వేశాడు. క్రీజు లైన్ నుంచి చాలా ముందుకు వెళ్లి బంతిని సంధించాడు. అతడు ఆ ఓవర్లో 21 పరుగులిచ్చాడు. రెండు వైడ్స్, రెండు నోబాల్స్ వేశాడు. అయితే ఇది సోషల్ మీడియాలో చర్చకు దారి తీస్తోంది. అక్తర్ మరీ అంత పెద్ద నోబాల్ వేయడంతో స్పాట్ ఫిక్సింగ్ ఏమైనా జరిగిందా? అని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

చాలా మంది ఈ నోబాల్ ను 2010లో ఇంగ్లాండ్, పాకిస్థాన్ కు మధ్య జరిగిన మ్యాచ్ లో పాక్ బౌలర్ మహ్మద్ ఆమిర్ స్పాట్ ఫిక్సింగ్ కు పాల్పడుతూ నోబాల్ వేసిన ఉదంతంతో పోల్చుతున్నారు. అయితే ఈ మ్యాచ్ లో అసద్ అక్తర్ మరీ అంత పెద్ద నోబాల్ ఎందుకు వేశాడో కారణం తెలియదు! మొత్తానికి ఈ నోబాల్ సోషల్ మీడియాలో మాత్రం వైరల్ గా మారింది.

# ప్రతీకారం తీర్చుకున్న న్యూజిలాండ్






తొలి టీ20లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన పరాభవానికి న్యూజిలాండ్ ప్రతీకారం తీర్చుకుంది. రెండో టీ20 మ్యాచ్ లో సఫారీ జట్టును మట్టికరిపించి జయభేరి మోగించింది. టీ20 ప్రపంచ కప్-2026లో రన్నరప్ గా నిలిచిన కివీస్.. ప్రస్తుతం స్వదేశంలో ఐదు టీ20 మ్యాచ్ ల సిరీస్ తో బిజీగా ఉంది.

ఇందులో భాగంగా ఆదివారం మౌంట్ మౌంగనీ వేదికగా ప్రొటీస్ తో తొలి టీ20లో తలపడ్డ న్యూజిలాండ్.. ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. తాజాగా హామిల్టన్ లో మంగళవారం నాటి మ్యాచ్ లో టాస్ ఓడిన కివీస్.. సౌతాఫ్రికా ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్ కు దిగింది.

టాపార్డర్ లో ఓపెనర్ టామ్ లాథమ్ (11), వన్ డౌన్ బ్యాటర్ టిమ్ రాబిన్సన్ (1) నిరాశపరచగా.. మరో ఓపెనర్ డెవాన్ కాన్వే అర్ధ శతకం (60)తో ఆకట్టుకున్నాడు. మిగిలిన వారిలో నిక్ కెలీ (12 బంతుల్లో 21), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (14 బంతుల్లో 21) ఫర్వాలేదనిపించగా.. కోల్ మెకాంచి (12 బంతుల్లో 18), జోష్ క్లార్క్ సన్ (9 బంతుల్లో 26) మెరుపు ఇన్నింగ్స్ తో అజేయంగా నిలిచారు.

ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో న్యూజిలాండ్ ఆరు వికెట్ల నష్టానికి 175 పరుగులు సాధించింది. సఫారీ బౌలర్లలో వియాన్ ముల్డర్ రెండు వికెట్లు తీయగా.. గెరాల్ కోయెట్జి, ఒట్నీల్ బార్ట్మాన్, కెప్టెన్ కేశవ్ మహరాజ్, జార్జ్ లిండే తలా ఒక వికెట్ దక్కించుకున్నారు.

లక్ష్య ఛేదనకు దిగిన సౌతాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్లలో కొన్నోర్ ఎస్తరుజెన్ (8)ను బెన్ సియర్స్ వెనక్కి పంపగా.. వియాన్ ముల్డర్ (16)ను సాంట్నర్ అవుట్ చేశాడు. వన్ డౌన్ లో వచ్చిన టోనీ జార్జి (1) మెకాంచీ బౌలింగ్ లో పెవిలియన్ చేరాడు.

**107 పరుగులకే ఆలౌట్**

మిగిలిన వారిలో రూబిన్ హెర్మాన్ (19) ఫర్వాలేదనిపించగా.. జార్జ్ లిండే 12 బంతుల్లో 33 పరుగులు చేశాడు. మిగిలిన వారంతా చేతులెత్తేయడంతో 15.3 ఓవర్లలో 107 పరుగులకే సౌతాఫ్రికా ఆలౌట్ అయింది. ఫలితంగా న్యూజిలాండ్ 68 పరుగుల తేడాతో గెలిచి సిరీస్ ను ప్రస్తుతానికి 1-1తో సమం చేసింది.

కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్, బెన్ సియర్స్ చెరో మూడు వికెట్లతో చెలరేగగా.. సాంట్నర్ రెండు, మెకాంచి, జేమ్స్ నీషమ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. న్యూజిలాండ్- సౌతాఫ్రికా మధ్య శుక్రవారం నాటి మూడో టీ20కి ఆక్లాండ్ లోని ఈడెన్ పార్క్ వేదిక.



# హరీష్ దర్శకత్వంలో చిరంజీవి.. త్వరలోనే ఆఫీషియల్ క్లారిటీ..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్లలో బిజీగా ఉన్న దర్శకుడు హరీష్ శంకర్, మెగాస్టార్ చిరంజీవితో మూవీ పై తాజాగా ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. మార్చి 19, 2026న ఉగాది కానుకగా పవన్ కళ్యాణ్ సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో, చిరంజీవితో ప్రాజెక్ట్ ఖచ్చితంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశాడు.

చాలా కాలంగా మెగా అభిమానులు ఎదురుచూస్తున్న ఈ కాంబినేషన్ త్వరలోనే పట్టాలెక్కనుందని ఆయన భరోసా ఇచ్చాడు. ఈ సినిమా ఎలా ఉండబోతోందనే విషయంపై హరీష్ శంకర్ స్పందిస్తూ.. వింటేజ్ చిరంజీవిని వెండితెరపై చూపిస్తానని హామీ ఇచ్చాడు. ముఖ్యంగా 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' వంటి సినిమాల్లో చిరంజీవి పండించిన మాస్ మేనరిజమ్స్, కామెడీ టైమింగ్ ను దృష్టిలో పెట్టుకుని ఈ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలిపాడు.

మెగాస్టార్ ను ఒక అభిమాని ఎలా చూడాలనుకుంటారో, ఈ సినిమా కూడా అలాగే ఉంటుంది అని ఆయన వ్యాఖ్యానించడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. మెగాస్టార్, హరీష్ శంకర్ ఇద్దరూ మాస్ ఎంటర్టైనర్లను అందించడంలో సిద్ధహస్తులు కావడంతో ఈ ప్రాజెక్ట్ పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ పనుల వల్ల ఈ క్రేజీ ప్రాజెక్ట్ కొంత ఆలస్యమైనప్పటికీ, త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.




# 'బైకర్'లో ఏకంగా 8 సాంగ్స్!

యూవీ క్రియేషన్స్ బ్యానర్ లో శర్వానంద్ హీరోగా అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పోర్ట్స్ అండ్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్' ఏప్రిల్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన గిబ్రాన్ ఈ సినిమాకి సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నాడు. 'సాహో' తర్వాత తనకిది ఒక పర్ఫెక్ట్ కమ్ బ్యాక్ మూవీ అవుతుందని ధీమా వ్యక్తం చేశాడు. దర్శకుడు అభిలాష్ చెప్పిన కథలోని ఎమోషన్స్ తనను బాగా ఆకట్టుకున్నాయని, స్క్రిప్ట్ చాలా పవర్ ఫుల్ గా ఉందని ఆయన పేర్కొన్నాడు.

టెక్నికల్ పరంగా ఈ సినిమా హాలీవుడ్ రేంజ్ లో ఉంటుందని గిబ్రాన్ తెలిపాడు. హై-ఆక్టేన్ రేసింగ్ యాక్షన్ సీక్వెన్స్ లతో పాటు, హృదయాన్ని హత్తుకునే కుటుంబ అనుబంధాల కలయికతో ఈ చిత్రం అద్భుతంగా వచ్చిందని చెప్పాడు. ముఖ్యంగా తండ్రి-కొడుకుల మధ్య ఉండే బాండింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, శర్వానంద్ తన నటనతో అందరినీ మెప్పిస్తారని ఆయన వెల్లడించాడు. సాధారణంగా కమర్షియల్ సినిమాల్లో 5 లేదా 6 పాటలు ఉంటాయి. కానీ 'బైకర్' చిత్రంలో మొత్తం 8 పాటలు ఉండటం విశేషం. ఇందులో ఒక పూర్తి స్థాయి పాటతో పాటు, మిగిలినవన్నీ కథలో భాగంగా వచ్చే మాంటేజ్ సాంగ్స్ అని గిబ్రాన్ స్పష్టం చేశాడు.



# మా నాన్నకు ఆ గుర్తింపు అవసరం లేదు : ఆస్కార్‌పై ఈషా కామెంట్స్

ఆస్కార్ వేడుకలో ధర్మేంద్రకు తగిన గౌరవం దక్కలేదంటూ విమర్శలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై ఆయన కుమార్తె, నటి ఈషా తొలిసారిగా స్పందించారు. ఈ వేడుకలోని 'ఇన్ మెమోరియం' సెగ్మెంట్ లో ధర్మేంద్ర పేరును విస్మరించడంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సినీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ నిరసన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన ఈషా దీనిపై స్పందించారు.

''ఆస్కార్ వేదికపై పేరు ప్రసారం కాకపోవడం వల్ల మా నాన్నకు ఇబ్బందేం లేదు. ఒకవేళ ఆయన ఉన్నా కూడా ఇలాంటి వేడుకల గురించి పట్టించుకునేవారు కాదు. ఆయన ఎప్పుడూ గుర్తింపు కోసమో, హోదా కోసమో పాకులాడలేదు'' అని పేర్కొన్నారు. తన తండ్రి వ్యక్తిత్వాన్ని వివరిస్తూ, ఆయనకు ప్రేక్షకుల హృదయాల్లో సంపాదించుకున్న స్థానం మాత్రమే ముఖ్యం.. ఇలాంటి అధికారిక గౌరవాలు ఆయన కోరుకోరని స్పష్టంచేశారు. దీనిపై హేమమాలిని కూడా స్పందిస్తూ.. ఆస్కార్ ధర్మేంద్రను విస్మరించడం బాధాకరమే అయినా, ఆయనకు అభిమానుల ప్రేమే గొప్ప అవార్డు అని అభిప్రాయపడ్డారు.

నవంబర్ 2025లో ధర్మేంద్ర మరణించిన తర్వాత జరిగిన ఈ ఆస్కార్ వేడుకలో ఆయనను స్మరించుకోకపోవడంపై వివాదం రేగింది. అయితే, లైవ్ టెలికాస్ట్ లో ఆయన పేరు లేకపోయినప్పటికీ, అకాడమీ అధికారిక వెబ్ సైట్ గ్యాలరీలో ఆయన పేరును చేర్చడం గమనార్హం.

# మా అమ్మ ఆయన అభిమానే

## - శ్రీలీల ఇంట్రెస్టింగ్ కామెంట్స్..

అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ తో కలిసి సందడి చేసేందుకు నటి శ్రీలీల సిద్ధమయ్యారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్ నటించిన తాజా యాక్షన్ ఎంటర్ టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఉగాది కానుకగా మార్చి 19న ఈ చిత్ర ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ శ్రీలీల పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు.

● అప్పట్లో పవన్ కల్యాణ్ గారు వేసుకున్న డ్రెస్ లు ఇప్పుడు మళ్లీ ట్రెండ్ అవుతున్నాయి. ఆయన 'ఖుషి' సినిమా అంటే నాకెంతో ఇష్టం. 'జల్సా'లో ఇలియానాతో ఉండే కొన్ని సీన్స్ భలే సరదాగా అనిపిస్తాయి.

● మా అమ్మ ఆయన అభిమానే. నేను ఆయనతో సినిమా చేస్తున్నా అని చెప్పగానే నాకంటే ఎక్కువ



సంతోషించారు. పవన్ కల్యాణ్ గారితో ఫస్ట్ సీన్ చేస్తున్నప్పుడు నేను ఆశ్చర్యంతో అలా ఆయన్ని చూస్తు ఉండిపోయా.

● శ్రీలీల అంటే డ్యాన్స్.. డ్యాన్స్ అంటే శ్రీలీల.. దీన్ని హరీశ్ శంకర్ బ్రేక్ చేసేందుకు ప్రయత్నించారు. పవన్ కు నాకూ మధ్య డ్యాన్స్ మూమెంట్స్ లేవు. ఒక్క స్టెప్ ఉంది అంతే. చాలా క్యూట్ సన్నివేశాలు ఉన్నాయి.

● ముక్కుసూటిగా మాట్లాడేవాళ్లు నిజాయితీగా ఉంటారు. హరీశ్ శంకర్ అలాంటి వ్యక్తే.

● కల్యాణ్ గారికి బిడియం ఎక్కువ.. కానీ, ఫ్యాన్స్ కోసం అని చెప్పగానే ఎలాంటి సీన్ అయినా చేసేస్తారు. ఆయనకు జోడీగా నటించాలని ప్రతి హీరోయిన్ కలలుకంటుంది.

● చిన్న చిన్న వాటిని కూడా ఆయన ఆస్వాదిస్తారు. షూటింగ్ సమయంలో చెట్లను చూసి మురిసిపోతూ ఉండేవారు.

● ఈ ఓటీటీల కాలంలో కూడా సినిమాలకు ఆదరణ దక్కుతుందంటే మ్యూజిక్ కూడా ఒక కారణం. 'ఉస్తాద్ భగత్ సింగ్'లో సంగీతం కూడా అదిరిపోతుంది.

● ఒకవైపు సినిమాలు, ఒకవైపు ఎంబీబీఎస్ రెండూ బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం. అమ్మ డాక్టర్ కావడం నాకు ప్లస్ పాయింట్. ఇంట్లో పాఠాలు చెప్పేది. అలా డాక్టర్ అయ్యాను. దానికి కూడా పవర్ స్టారే స్ఫూర్తి. ఆయన ఒకవైపు సినిమాలు చేస్తూనే.. డిప్యూటీ సీఎం అయ్యారు కదా..!

● నా కాలేజ్ లైఫ్ ను సెట్స్ కు తీసుకురాలేదు. కాలేజ్ కే పరిమితం చేశా. అందుకే ఎక్కడా పోస్ట్ లు కూడా పెట్టలేదు. కొంతమంది ఫ్రెండ్స్, వైవాలో తిట్టించుకోవడం..తదితర అంశాలను ఎంజాయ్ చేశా.

● నా మొదటి చిత్రం 'పెళ్లిసంద్ద' థియేటర్ లో చూసినప్పుడు నేను స్క్రీన్ పై కనిపించగానే అభిమానులు పేపర్లు ఎగరేశారు. ఆ పేపర్లు ఇంటికి తీసుకెళ్లి దాచిపెట్టుకున్నా. ఇప్పటికీ ఉన్నాయి. 'ఉస్తాద్ భగత్ సింగ్'ను మాస్ థియేటర్ లోనే చూడాలనుకుంటున్నా.

● ఒక్కో సినిమా నుంచి ఒక్కొక్కటి దాచుకోవడం అలవాటు. ఈ సినిమాలో నేను వేసుకున్న నెక్లెస్ దాచుకున్నా.

● 'ఉస్తాద్ భగత్ సింగ్' గురించి ఒక్క మాటలో చెప్పాలంటే 'ఫ్యాన్స్ కు పండగే'.

● ఆర్టిస్టుగా పుట్టడమే పూర్వజన్మ పుణ్యం. ఈరోజుల్లో మనవాళ్లే మనపై ప్రేమ చూపిస్తారో లేదో తెలీదు. అలాంటిది ఆర్టిస్టులను మాత్రం కోట్లమంది అభిమానిస్తారు.

● పవన్ కల్యాణ్ రీమేక్ లో నేను నటించాల్సి వస్తే 'జల్సా', 'గబ్బర్ సింగ్' రెండింటిలో చేస్తా.





# కొన్నిసార్లు 24 గంటలూ పనిచేశాను

''ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా 'గబ్బర్ సింగ్'లాగే అందర్నీ అలరించేలా ఉంటుంది'' అంది నటి రాశీ ఖన్నా. పవన్ కల్యాణ్ తో కలిసి పని చేయాలన్న తన కల ఈ చిత్రంతో నెరవేరిందని సంతోషం వ్యక్తం చేసింది. పవన్ కల్యాణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. దీంట్లో శ్రీలీలతో పాటు రాశి కూడా ఓ కథానాయికగా నటించింది. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్ లో విలేకర్లతో ముచ్చటించింది రాశి ఖన్నా.

''నా సినీ ప్రయాణంలో తొలిసారి కథ వినకుండానే ఓకే చెప్పిన సినిమా ఇది. పవన్ కల్యాణ్ చిత్రం అనగానే మరో ఆలోచన లేకుండా ఎంతో ఉత్సాహంగా వెంటనే చేస్తానని చెప్పా. ఎందుకంటే నేను నా తొలి చిత్రం చేస్తున్నప్పటి నుంచే ఆయన స్టార్ డమ్, పవనిజం గురించి విన్నా. అప్పుడే ఆయనతో కలిసి ఒక్క సినిమా అయినా చేయాలని అనుకున్నా. ఇది 'ఉస్తాద్..'తో నెరవేరింది. నేను ఈ చిత్రం ఒప్పుకున్నప్పుడే 'పవన్ షెడ్యూల్స్ ఎలా ఉంటాయో చెప్పలేమ'ని దర్శకుడు హరీశ్ నాకు ముందే చెప్పారు. దానికి తగ్గట్లుగానే నా డేట్స్ సర్దుబాటు చేసుకుంటానని చెప్పా. ఈ చిత్రం కోసం కొన్నిసార్లు పగలు రాత్రి తేడా లేకుండా 24గంటల షిఫ్టులు కూడా పని చేశాను. అదొక మర్చిపోలేని అనుభవం''.

''ఇదొక మంచి కుటుంబ కథా చిత్రం. అందర్నీ అలరించేలా ఉంటుంది. ఈ సినిమాతో వింటేజ్ పవన్ కల్యాణ్ ని చూస్తారు. నేనిందులో శ్లోక అనే మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తా. ఈ కథలో నా పాత్రతో పాటు ప్రతి పాత్రకీ మంచి ప్రాధాన్యత ఉంటుంది. నాకిందులో ఓ మంచి మాస్ పాట కూడా ఉంది''.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.